జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 55 సంచిక : 10 అక్టోబర్, 2022 పేజీలు : 24 వెల : రు. 10/-

వాస్తవిక సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించే పాలకుల నిరంతర ప్రయత్నాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు నిర్వహించేందుకు దాదాపు 18 నెలలు సమయముండగానే, అధికార విపక్షాలు తమ తమ గెలుపు అవకాశాలకు పథకాలను రచిస్తూ, రంగంలోకి దిగుతున్నాయి. అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ స్థానాలన్నింటినీ తామే కైవసం చేసుకుంటామని, అది పెద్ద కష్టమైన విషయం కాదని చెబుతోంది. గత మూడున్నర సం॥ల తమ పాలనా కాలంలో రాష్ట్రంలోని 87 శాతం ప్రజలకు లబ్ధి చేకూర్చాము కనుక, తమ గెలుపుకు తిరుగులేదని బీరాలు పలుకుతోంది.

వాస్తవానికి 'గడపగడపకు ప్రభుత్వం' కార్యక్రమంలో ఎంఎల్ఏలకు, మంత్రులకు ప్రజల నుండి ఎదురవుతున్న చేదు అనుభవాలు వారికి కలవరం కలిగిస్తోంది. ముఖ్యంగా గత సంవత్సరకాలంపైగా తమ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వస్తున్న వివిధ రంగాల ప్రజానీకం సంఖ్య పెరుగుతోంది. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ఎంతో కొంతమందికి ఏదోమేరకు ఆర్థిక లబ్ధి చేకూరినట్లు కన్పిస్తున్నప్పటికీ, ప్రజలపై నానాటికీ పెరుగుతున్న భారాలు - నిత్యావసరాల ధరల పెరుగుదల, విద్యుత్తు, ప్రయాణ, రవాణా ఛార్జీల పెరుగుదల; పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలలతోపాటు, పన్నుల, జరిమానాల పెంపుతో పేద, మధ్యతరగతి ప్రజానీకం కునారిల్లిపోతున్నారు. కరోనా మహమ్మారితో ఇప్పటికే కుదేలైవున్న ప్రజానీకానికి కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోగా, ఉన్న అవకాశాలనే రద్దుచేస్తుండటంతో అత్యధిక ప్రజానీకం అసంతృప్తితో వున్నారు. ఈ అసంతృప్తి వివిధ సందర్భాలలో నిరసనాందోళనలరూపం తీసుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వ 'భరోసా'లు, 'ఆసరా'లను గేలిచేస్తూ రుణభారం నుండి విముక్తి కాలేక రైతులనేకమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా వుంది. ప్రపంచబ్యాంకు ఆదేశాలకు తలొగ్గిన ప్రభుత్వం, రైతుల నిరసనలను బేఖాతరు చేస్తూ సాగు విద్యుత్తు మోటార్లకు మీటర్లు బిగించే పనిని వేగంగా సాగిస్తోంది. రాష్ట్రంలో సహకార పాడిపరిశ్రమను పడకన వేసి, తమ స్వార్థ ప్రయోజనాల కోసం 'అమూల్'ను ముందుకు తెచ్చి పాడిరైతులను దెబ్బతీస్తున్నారు. పోలవరం నిర్వాసితులు, ఆశావర్కర్స్, పారిశుధ్య సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులు, నిరుద్యోగ యువత, రైతాంగం, విశాఖ ఉక్కు కార్మికులు, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు.... ఇలా సమస్తరంగాల ప్రజానీకం తమ దీర్ఘకాల, అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రోడ్లమీదకు వస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో మరింతగా కూరుకుపోతూండగా, దీనంతటికీ కారణం మీరంటే మీరని, అధికార విపక్షాలు కొట్లాడుకుంటున్నాయి. సిపిఎస్ రద్దుకోసం నిరంతరాయంగా ఆందోళన సాగిస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, తీవ్ర వేధింపు చర్యలకు పాల్పడుతోంది. కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాచే వైపుగా సభలకు, ప్రదర్శనలకు అనుమతి నిరాకరిస్తూ నిరంకుశ చర్యలను చేపడుతోంది.

ఈ నేపథ్యంలో మరోసారి రాజధాని సమస్యను పాలకపార్టీలు రాజేస్తున్నాయి. చంద్రబాబు అధికారంలోనున్న కాలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములేగాక రాజధాని పేరుతో 33 వేల ఎకరాల భూములను రైతుల నుండి గుంజుకున్నారు. ఆనాటికి 10 సం॥ల కాలం హైదరాబాద్ రాజధానిగా కొనసాగటానికి ఇంకా ఉండే అవకాశాలను కాదని, లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం పేరుతో ప్రజలను చంద్రబాబు దాని చుట్టూతా తిప్పాడు. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, చంద్రబాబు పాలనలో రాజధాని భూములలో 'ఇన్‌సైడర్ ట్రేడింగ్' జరిగిందని, భారీ అవినీతి చోటుచేసుకుందంటూ, మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చి చట్టం చేసింది. అయితే నాటకీయ పరిణామాలతో హైకోర్టులో దానిని విరమించుకున్నట్లుగా ప్రకటించి, మరల పకడ్బందీగా దానినే చట్టంగా తెస్తామని చెబుతున్నారు. అభివృద్ధి పేరిట పాలన వికేంద్రీకరణ చేయాలని అమరావతి నుండి రాజధానిని తరలించే ప్రయత్నాలు దోపిడీ పాలక ముఠాలలో తీవ్రమౌతున్న వైరుధ్యాలను వెల్లడి చేస్తున్నాయి. స్థిరపడిన పెట్టుబడిదారులకూ, కొత్తగా ఎదుగుతున్న పెట్టుబడిదారులకూ నడుమ రియల్ఎస్టేట్, కాంట్రాక్టులు, స్వీయ స్వార్థ ప్రయోజనాల కోసం పెరుగుతున్న వైరుధ్యాలే పోలవరం, రాజధాని అంశాలలో వివిధ సమస్యలుగా ప్రజల ముందుకు తెస్తున్నారు.

ఈలోగా, అమరావతి ఏకైక రాజధానిగా కొనసాగాలని చేస్తున్న ఆందోళన వెయ్యిరోజులు పూర్తయిన సందర్భంగా అమరావతి ప్రాంత రైతులు అమరావతి నుండి అరసవల్లి (శ్రీకాకుళం జిల్లా) వరకు పాదయాత్ర తలపెట్టి, న్యాయస్థానం నుండి అనుమతి పొంది, కొనసాగిస్తున్నారు.

మూడు రాజధానులను కొనసాగించి తీరుతామని, అన్ని ప్రాంతాల అభివృద్ధే తమ లక్ష్యమంటూ మంత్రులు, ఎంఎల్ఏలే వివిధ జిల్లాలలో ప్రకటనలు చేస్తూ, (తరువాయి 2వ పేజీలో)

జనశక్తి
ప్రజల తయారుచేసుకొని ప్రజల పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 55
సంచిక : 10

లోపలిపేజీల్లో

వెల : విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :
ఎస్.శేషమ్మ, ఎడిటర్
32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,
ఎం.ఆర్.పురం, విజయవాడ-10.

జైలులో కామ్రేడ్ పాండు నారోట్ మరణాన్ని ఖండించండి

డా॥ జి.ఎన్. సాయిబాబాపై వున్న కేసులన్నింటినీ ఉపసంహరించుకొని ప్రభుత్వం ఆయనను వెంటనే విడుదల చేయాలి

పాండు నారోట్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను నిరాకరిస్తూ రావటంతోపాటు, ఆయన ఆరోగ్య పరిస్థితిపట్ల అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దోపిడీ పాలకవర్గాల పాలనలో అనేకమంది కామ్రేడ్స్ జైలులోనే ప్రాణాలు కోల్పోయారు. నిన్న స్టాన్‌స్వామి, నేడు పాండు నారోట్ అదే తీరులో హత్యగావించబడ్డారు.

జైలులో మరణంగా పేర్కొంటున్న నారోట్ హత్యను సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటీ ఖండిస్తోంది.

జి.ఎన్. సాయిబాబా సహనిందితుడైన 33 సం॥ల పాండు నారోట్ 2022 ఆగస్టు 25న సా॥ 5:30 గం॥కు నాగపూర్ జిఎంసిహెచ్ ఆసుపత్రిలో మరణించారు. అంతకుమునుపు రెండు రోజుల క్రితం పాండును ఆసుపత్రికి తరలించినట్లుగా అతని తరఫు న్యాయవాది కనుగొన్నాడు. అంతేతప్ప దిగజారిపోతున్న అతని ఆరోగ్యస్థితి గురించి జైలు అధికారులు నారోట్ కుటుంబ సభ్యులకు ఎటువంటి సమాచారమూ అందించలేదు. ఆయన మరణించిన తర్వాత కూడా ఆయన అనారోగ్యానికి ఎందుకు గురయ్యాడో, ఆయన మరణానికి కారణమేమిటో తెలియబర్చలేదు. వాస్తవానికి పాండు ఆరోగ్యంగా వున్న యువకుడు. ఆయన ఆరోగ్యం దారుణంగా క్షీణించిందన్న సమాచారమే లేదు. జైలు అధికారుల ఘోర నిర్లక్ష్యం ఫలితంగానే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించింది. పాండు అనారోగ్యానికి గురయ్యాడా లేదా అనే సమాచారం కుటుంబసభ్యులకు తెలీదు. పాండును ఐసియు విభాగానికి తరలించి చికిత్స అందించవలసిందిగా పాండు తరఫు న్యాయవాది కోరినా, దానిని వారు పెడచెవిన పెట్టారు.

జైలులోని ఖైదీల ఆరోగ్య పరిస్థితి గురించిన ఈ రకమైన తీవ్ర నిర్లక్ష్యం, అనేక విషాదాలకు కారణమవుతోంది. హైకోర్టుకు అప్పీల్ చేరటానికే 5 సం॥లు పడుతుండగా, అక్కడి నుండి అది ముందుకు సాగకుండా వుంది. ఇక ఇప్పుడు పాండు మరి లేదు.

అదే జైలులో నిర్బంధంలోనున్న, అంగవైకల్యంతోపాటు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సాయిబాబాను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము.

విశ్వం, ప్రధాన కార్యదర్శి,
కేంద్రకమిటీ, సిపిఐ(ఎం-ఎల్)

28-8-2022

(మొదటి పేజీ తరువాయి)

రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ, ఉద్రిక్త వాతావరణాన్ని రెచ్చగొడుతున్నారు. 'అమరావతి రైతులది పాదయాత్ర కాదు; దండయాత్ర' అంటూ, ఉత్తరాంధ్ర నుండి పోటీ యాత్రలకు పథకాలు రచిస్తూ దాడులకు పురిగొల్పుతున్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా పేర్లతో తిరిగి ప్రాంతీయ విద్వేషాలకు ఆజ్యం పోస్తున్నారు. ప్రజానీకం ప్రాంతీయ విద్వేషాలకు లోనుకాకుండా సంయమనం పాటించాలి. అమరావతి రైతుల ఆందోళనమాటున తిరిగి బలం పుంజుకునేందుకు తెలుగుదేశం పార్టీ తన పావులు కదుపుతోంది.

రాష్ట్ర విభజన, సమైక్య ఆంధ్ర ఆందోళనల సందర్భంగా ప్రజల మౌలిక సమస్యలతో సంబంధంలేని ఈ అంశాల చుట్టూ ప్రజలను తిప్పి, పాలకులు పబ్బం గడుపుకున్నారన్న విషయం ఆచరణలో రుజువైంది.

విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాడు చంద్రబాబు - రాజధాని, ప్రత్యేక హోదా చుట్టూ ప్రజల ఆలోచనలను తిప్పుతూ తన కాలం గడుపుకున్నాడు. ఈనాడు తిరిగి వైసిపి ప్రభుత్వం, 'అమరావతా లేక మూడు రాజధానులా' అనే అంశం చుట్టూ ప్రజల ఆలోచనలను మళ్ళించి, మౌలిక సమస్యల నుండి వారిని ప్రక్కకు నెట్టటానికి మరో ప్రయత్నం చేస్తోంది.

రాష్ట్రాలను అస్థిరపరచటం ద్వారా సామ్రాజ్యవాదం వివిధ రూపాలలో దేశంలో మరింతగా వేళ్ళూనుకొంటోంది. అడవులను, గనులను, సమస్త వనరులను వారు విచక్షణారహితంగా దోపిడీ చేసుకోవటానికి; ప్రభుత్వ, ప్రభుత్వరంగ పరిశ్రమలను తెగనమ్మటానికి వీలైన చట్టాలను, చట్టసవరణలను 'సందట్లో సడేమియా'లాగా పాలక ప్రభుత్వాలు చకచకా చేసేస్తున్నాయి. రైతాంగం, కార్మికుల జీవితాలు నానాటికీ దుర్భరంగా మారుతున్నాయి. ప్రజాస్వామిక హక్కులు మృగ్యమవుతున్నాయి. ప్రజల వాస్తవిక సమస్యల నుండి ప్రక్కకు మళ్ళించి, పెడదోవ పట్టించే పాలకుల కుటిల విధానాలపట్ల ప్రజలు, అభ్యుదయ, విప్లవశక్తులు అప్రమత్తంగా ఉండటంతోపాటు, ప్రజల మౌలిక సమస్యలపై నిలకడైన, నిరంతరాయ పోరాటాలకు నిర్మాణాత్మక కృషి సాగించాలి. ★

చైనా, తైవాన్‌ల నడుమ ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్న అమెరికా సామ్రాజ్యవాదులు

రష్యా, ఉక్రెయిన్‌ల నడుమ అవాంఛిత యుద్ధాన్ని రగల్చటంతో సంతృప్తి చెందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, అదే సమయంలో చైనాకు వ్యతిరేకంగా శత్రుత్వాన్ని రగిల్చేందుకు ఇండో–పసిఫిక్ ప్రాంతంలో 'క్వాడ్' మరియు ఆ తరహా సంస్థలను ప్రేరేపిస్తున్నాడు. 'ప్రపంచ క్రమాన్ని పరిరక్షించే', 'ప్రజాస్వామ్యాన్ని కాపాడే' పేరిట, అమెరికా ఉద్దేశ్యపూర్వకంగా ఇతర దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకొని, వారిలోవారికి విబేధాలు కల్పించి, ఆ దేశాలలో ప్రజల మధ్య శత్రుత్వాలను రెచ్చగొట్టటాన్ని అమెరికా, అమెరికా సామ్రాజ్యవాదం ప్రశ్నించే వీలులేని తమ హక్కులాగా భావిస్తున్నారు. ఆవిధంగా ఉద్రిక్తతలను ఎల్లవేళలా ఆరకుండా వుంచుతూ, యావత్ ప్రపంచంపై అమెరికా తన ఆధిపత్యాన్ని కొనసాగించాలని భావిస్తోంది.

ప్రస్తుతం, అమెరికా క్రమంగా తగ్గుతోన్న తన పరపతిని తిరిగి ప్రతిష్టించుకోవటం కోసం, తైవాన్ స్వాతంత్ర్యాన్ని సమర్ధించేపేరిట తైవాన్ అంశాన్ని రేపుతోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, డెమోక్రటిక్ పార్టీలు తైవాన్, చైనాల మధ్య ఉద్రిక్తతలను ప్రేరేపిస్తున్నాయి.

1979లో చైనాతో సంబంధాలను స్థాపించుకునే సందర్భంలో, అమెరికా, చైనాల సంయుక్త ప్రకటనలో ఇలా పేర్కొన్నారు : "అమెరికా సంయుక్త రాష్ట్రాలు పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను ఏకైక, చట్టబద్ధ ప్రభుత్వంగా గుర్తిస్తోంది". ఆనాటినుండి 'ఒకే చైనా విధానం' క్రింద అమెరికాకు తైవాన్‌తో ఏవిధమైన దౌత్యపరమైన సంబంధాలూ లేవు.

అయితే, ఈనాడు అమెరికా ఉద్దేశపూర్వకంగా 'ఒకే చైనా విధానాన్ని' తప్పుగా అన్వయించేందుకు ప్రయత్నిస్తూ చైనా, తైవాన్‌ల నడుమ ఉద్రిక్తతలను రగిలిస్తోంది.

ఆగస్టు 3వ తేదీన, అమెరికా పార్లమెంట్ స్పీకర్, డెమోక్రటిక్ పార్టీ సీనియర్ రాజకీయ నాయకురాలైన నాన్సీ పెలోసి తైవాన్‌ను సందర్శించింది. తైవాన్ అధ్యక్షుడు సాయ్ ఇంగ్వెన్‌తో చర్చలు జరిపింది. చట్టసభలనుద్దేశించి మాట్లాడటంతోపాటు పౌర సన్మానాన్ని అందుకుంది. గత 25 సం॥ల కాలంలో అమెరికా నుండి తైవాన్ వచ్చిన అత్యున్నతస్థాయి ప్రతినిధుల జరిగిన పర్యటన ఇదే కావటం గమనార్హం. 'ఒకే చైనా పాలసీ'లోని అంగీకృత అంశాలను ఉల్లంఘించేదిగా ఈ పర్యటనకు ముందు కూడా చైనా బహిరంగంగా అమెరికాను హెచ్చరించింది. చైనా హెచ్చరికను అమెరికా పెడచెవిన పెట్టింది. నాన్సీ పెలోసి తైవాన్‌ను సందర్శించింది. అనవసరపు రెచ్చగొట్టే చర్యగా దీనిని చైనా భావించింది. రెచ్చిపోయి, ఆగ్రహంతోనున్న చైనా, తైవాన్ పరిసరాల్లోని సముద్ర జలాల్లోనూ, ఆకాశంలోనూ సైనిక విన్యాసాలు నిర్వహించింది. తైవాన్ జలసంధి రేఖను దాటి అది తైవాన్ పరిసరాల్లో సాంప్రదాయక క్షిపణులను పేల్చింది.

మరింత దెబ్బతిన్న వ్యూహాత్మక వాతావరణంతో నాన్సీ పెలోసి తైవాన్‌ను వీడింది. పైగా, ఆమె అమెరికా వెళ్ళే దోవలో టోక్యోలో ఆగి, 'తైవాన్‌ను ఒంటరి చేసే చైనా ప్రయత్నాలను అమెరికా సాగనివ్వబోద'ని ప్రకటించింది. అలాగే "..... మమ్మల్ని అక్కడికి (తైవాన్‌కు) వెళ్ళకుండా నిరోధించటం ద్వారా, తైవాన్‌ను చైనా ఒంటరి చేయలేద"ని పేర్కొంది.

2022 మే నెలలో జపాన్ సందర్శన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా "తైవాన్ ద్వీపాన్ని సైనిక శక్తితో చైనా తమ అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తే, అమెరికా సైనిక బలగాలు తైవాన్ సైన్యానికి అండగా నిలుస్తాయని" ప్రకటించాడు.

చైనా సైనిక విన్యాసాలకు ప్రతిచర్యగా తైవాన్ కూడా యుద్ధసామాగ్రితో సైనిక కసరత్తులు సాగిస్తూ "శత్రు బలగాలను నేలపైన, నీటిలోనూ వుండి ఎదుర్కొనేందుకు సాధన" చేస్తున్నామని ప్రకటించింది.

ఈవిధంగా అమెరికా రేపిన చిచ్చు సంక్షోభాన్ని సృష్టించింది.

వాషింగ్టన్‌తోనున్న సైనిక మార్గాలను తెగదెంపులు చేసుకుంటున్నట్లు, అలాగే మూడు కీలక చర్చల యంత్రాంగాలను రద్దుచేస్తున్నట్లు చైనా ప్రకటించింది.

అమెరికా, చైనాల నడుమ ఉద్రిక్తతలను మరింత పెరగకుండా తగ్గిస్తామని ఒకవైపున జోబైడెన్ ప్రకటిస్తూనే, మరోవైపున వాస్తవానికి ఈ అంశంతో అనవసర ఉద్రిక్తతలను ఎగదోస్తున్నాడు.

ఈ పరిణామాల తర్వాత కూడా, ఉద్రిక్తతలను రెచ్చగొట్టే తన ప్రయత్నాలను మానుకోలేదు.

తిరిగి ఆగస్టు 25న, అమెరికా సెనెట్ సభ్యురాలు, వాణిజ్యం, ఆయుధాలకు సంబంధించిన సెనెట్ కమిటీ సభ్యురాలు అయిన మార్షా బ్లాక్‌బర్న్ తైవాన్‌ను సందర్శించింది. ఈమె రిపబ్లికన్ పార్టీకి చెందినవారు. డొనాల్డ్ ట్రంపుకు మద్దతుదారు. ఈమె మాట్లాడుతూ "చైనా కమ్యూనిస్టుపార్టీకి వ్యతిరేకంగా మనం తప్పక నిలబడాలి" అని చైనాకు వ్యతిరేకంగా ఒక పిలుపునిచ్చారు.

ఈవిధంగా డెమోక్రటిక్ పార్టీ సెనేటర్, స్పీకర్ అయిన నాన్సిపెలోసి మరియు రిపబ్లికన్ పార్టీ సెనెటర్ మార్షాబ్లాక్‌బర్న్‌లు తైవాన్ అంశాన్ని ఉపయోగించుకొని అమెరికాలో జరిగే మధ్యంతర ఎన్నికలలో తమ తమ రాజకీయ పార్టీలకు లబ్ధి చేకూరేవిధంగా దేశంలోని ఓటర్లను ప్రభావితం చేయబూనుకున్నారు. ఈ ప్రయత్నాలతో రెండు పార్టీలూ అమెరికా ప్రజలలో చైనా వ్యతిరేక భావోద్వేగాల్ని రేపటానికి, పెంచటానికి చూస్తున్నారు. పెలోసి తైవాన్ పర్యటన తదనంతరం, డెమోక్రటిక్ పార్టీ పోల్ రేటింగ్ పెరగటం ప్రారంభమైంది.

ఆగస్టు 13న, అమెరికా సైనికరంగంలో ఇండోనేషియా ఇంగ్లాండ్, కెనడా, ఫ్రాన్స్, మలేసియా, దక్షిణ కొరియా, న్యూజిలాండ్, పాపువా న్యూగినియా, తూర్పు తైమూర్ వంటి 14 దేశాలతో కూడిన సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించి, దీనికి తమ పరిశీలకులను పంపింది. ఈ సంయుక్త సైనిక విన్యాసాల లక్ష్యం ఇండో పసిఫిక్ కూటమి నిర్మాణం, మరియు చైనా సైన్యాన్ని పరిమితం చేయటం, ఈ ప్రాంతంలో దౌత్యపరమైన ప్రభావాన్ని కలిగించటం అని పేర్కొన్నారు. 5 వేలమంది అమెరికా సైనిక సిబ్బంది ఈ విన్యాసాలలో పాల్గొన్నారు.

ఆగస్టు 28న రెండు అమెరికా యుద్ధనౌకలు తైవాన్ జలసంధికి చెందిన అంతర్జాతీయ సముద్ర జలాలగుండా ప్రయాణించాయి. నాన్సిపెలోసి తైవాన్ సందర్శన తర్వాత జరిగిన ఈ తరహా చర్య ఇదే మొదటిది. అమెరికా సైన్యం ఆకాశ మార్గాన, సముద్రమార్గాన ఎక్కడికైనా వెళ్ళటానికి, ఇండో – పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛాయుతంగా సంచరించటానికి వీలు కల్పించాలనే తమ ప్రకటనకు అనుగుణంగానే ఈ విన్యాసాలు నిర్వహించామని అమెరికా ప్రకటించింది. **(తరువాయి 4వ పేజీలో)**

పనామా ద్రవ్యోల్బణం అసమానతలకు వ్యతిరేకంగా నిరసనలు

జూలై, ఆగస్టు నెలల్లో పనామా దేశం యావత్తూ నిరసనాందోళనలు విస్తరించాయి. గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్న ధరలతో పాటు, అధికమౌతున్న అసమానతలను నిరసిస్తూ గత కొన్ని దశాబ్దాల కాలంలో ఎరుగని అతిపెద్ద ప్రజాసమీకరణలతో ఈ కార్యక్రమాలు జరిగాయి.

1989లో అమెరికా దురాక్రమణ దరిమిలా పనామా నయా ఉదారవాద దేశంగా కొనసాగుతూ వుంది. దేశంలోని సేవారంగం నుండి, మరియు పనామా కాలువ ద్వారా సమకూరే ఆదాయాలతో పనామా ఆర్థికపరిస్థితి గణనీయంగా పుంజుకుంది. అయితే జనాభాలోని అత్యధిక సంపన్నులకే ఈ ఆర్థిక పెరుగుదల లబ్ధి చేకూర్చగా, కార్మికవర్గము, స్థానిక ప్రజానీకం, పనామా రైతులు పేదలుగా మిగిలిపోయారు.

ఐఎంఎఫ్ పనుపున పనామా ప్రభుత్వం, కార్మికుల లే-ఆఫ్‌లను విపరీతంగా పెంచివేసి, వారి జీవన ప్రమాణాలను దారుణంగా దిగజార్చే విధంగా పెద్ద దాడులను సాగించింది.

ధరల పెరుగుదలను, పెరుగుతున్న అసమానతలను నిరసిస్తూ, చమురు ఇంధన ధరలను తగ్గించాలని, వాటి ధరల పెరుగుదలను ఆపాలని డిమాండ్ చేస్తూ ఉత్పత్తిదారులను దారుణంగా దెబ్బతీయకుండానే ఆహారపదార్థాల ధరలను 30 శాతం వరకూ తగ్గించాలని, ఔషధాల ధరలను తగ్గించాలని, దేశ జిడిపిలో 6 శాతాన్ని విద్యారంగానికి కేటాయించాలని, అవినీతి సమస్యల పరిష్కారానికి వివిధ విభాగాల ప్రతినిధులతోకూడిన నియంత్రణాకమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక ప్రజానీకం ఆందోళనలు నిర్వహించారు.

దేశవ్యాపితంగా నిర్వహించిన ఈ ఆందోళనల్లో అనేక సంస్థలు పాల్గొన్నాయి. జీవనం కోసం ప్రజల ఐక్య కూటమి, సంఘటిత ప్రజల హక్కుల కోసం జాతీయ కూటమి (ఏఎన్ఏడిఇపిఓ), స్థానిక ప్రజల సంస్థలు - కొనసాగుతున్న జాతీయ సమ్మె, దేశవ్యాపిత ప్రదర్శనలలో పాల్గొంటున్న ప్రధాన సంస్థలుగా వున్నాయి. శక్తివంతమైన భవన నిర్మాణ కార్మికుల ఏకైక యూనియన్, సామాజిక సంస్థలు, ఇతర రంగాల కార్మికుల, పేదలకు చెందిన సంఘాలు, కొన్ని మధ్యతరగతికి చెందిన సంస్థలు కూడా ఈ ఆందోళనల్లో పాలుపంచుకున్నాయి.

ఆందోళనకారులు దేశవ్యాపితంగా అనేక రహదారులను దిగ్బంధించారు. ప్రతిరోజూ భారీస్థాయిలో మౌలిక వసతుల రంగానికి చెందిన సరుకుల రవాణా జరిగే మధ్య అమెరికాకు చెందిన పాన్-అమెరికన్ కీలకమైన ఓడరేవును స్తంభింపజేశారు. ఈ దిగ్బంధాల కారణంగా ప్రత్యేకించి పనామాలో కొన్ని సరుకుల కొరత కూడా ఏర్పడింది.

ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం నిర్బంధ బలగాలను దేశవ్యాపితంగా మోహరించింది. వివిధ విభాగాలకు చెందిన నిరసనాందోళనలు నిర్వహిస్తున్న ప్రజానీకానికి వ్యతిరేకంగా కొద్దిమందిగా వున్న మితవాద పాలకులు, వ్యాపారవర్గాలు ప్రధాన స్రవంతి మాధ్యమాలలో, సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

ఏమైనా, ప్రభుత్వం చర్చలకు దిగివచ్చి, కొన్ని ఒప్పందాలు చేసుకోక తప్పలేదు. చమురు ధరలను గ్యాలన్‌కు 3.25 యుఎస్‌డికి తగ్గించి, అక్కడే నిలిపి వుంచాలని; 72 నిత్యావసర సరుకుల ధరలను 30 శాతం తగ్గించాలని; ప్రభుత్వ విద్యకు బడ్జెట్‌లో కేటాయింపులు జిడిపిలో 6 శాతానికి పెంచాలని; 150 రకాల ఔషధాల ధరలను నియంత్రించాలని ప్రభుత్వం అంగీకరించింది.

విద్యుత్తు బిల్లులను తగ్గించి, అంతకుమించి పెరగకుండా చర్యలు చేపట్టాలని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలనే డిమాండ్లు ఆగస్టు 4వ తేదీ వరకు ఒక పరిష్కారానికి రాలేదు. ప్రైవేటు ఔషధాల కొనుగోలు, పంపిణీ గొలుసులో లాభాలను నియంత్రించేందుకు ప్రత్యేక సంస్థను నెలకొల్పటానికి ప్రభుత్వం అంగీకరించలేదు.

గౌరవప్రదమైన జీవనహక్కు కోసం వందలాదిమంది ప్రజలు ఇంకా వీధుల్లో ఆందోళన సాగిస్తున్నారు. తమ సమస్యలన్నీ పరిష్కారమయ్యేంతదాకా తాము ఆందోళన కొనసాగిస్తున్నామని వారు చెబుతున్నారు. మరోవైపున ప్రధాన స్రవంతి మాధ్యమాలలో, సామాజిక మాధ్యమాలలో జరిగే దుష్ప్రచారాలను ప్రజాసంఘాలు చురుగ్గా కదిలి ఖండిస్తున్నాయి.

(లెఫ్ట్‌వాయిస్ అండ్ పీపుల్స్ డిస్పాచ్ ఆధారంగా....) ✱

(3వ పేజీ తరువాయి)

ఈ విధమైన అనవసరపు రెచ్చగొట్టే చర్యలతో అమెరికా నిరంతరాయంగా తైవాన్ అంశంపై ఉద్రిక్తతలను పెంచుతూ వస్తోంది. అలాగే పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా తైవాన్‌ను ఏనాడూ పరిపాలించలేదని, కనుక తైవాన్ తమదని ప్రకటించుకునే అవకాశమే చైనాకు లేదని, తైవాన్‌లోని 2 కోట్ల 30 లక్షలమంది జనాభా వారి భవిష్యత్తును నిర్ణయించుకోగలరని తైవాన్ ప్రభుత్వాన్ని అమెరికా పురికొల్పుతూ వస్తోంది.

మరోవైపున చైనా తైవాన్‌కు చెందిన వందమంది ఎగుమతిదారులపై నిషేధం విధించింది; అలాగే చేపలు, పండ్లు, ఇసుక దిగుమతులు వంటివాటిని తాత్కాలికంగా నిలిపివేసింది. తద్వారా తైవాన్‌ను లొంగదీసే ఆర్థికచర్యలు చేపట్టింది. అయితే, చైనా కంపెనీలు ఆధారపడిన తైవాన్‌కు చెందిన సెమీకండక్టర్స్ వంటి ప్రధాన ద్వైపాక్షిక వాణిజ్యాలను లక్ష్యంగా చేసుకోలేదు.

తైవాన్‌పై చైనా తన 3వ శ్వేతపత్రాన్ని వెలువరించింది. దీనిలో తైవాన్ చైనాలో అంతర్భాగమని నొక్కి చెప్పింది. వీలైన శాంతియుత పద్ధతుల్లో తైవాన్‌ను విలీనం చేసుకుంటామని పేర్కొంది. అది సాధ్యం కాకపోతే, చివరి అస్త్రంగా సైనికంగానైనా విలీనం చేసుకుంటామని చెప్పింది.

ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని కొనసాగించాలని ప్రయత్నిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం ప్రేరేపిస్తున్న వైరుధ్యాలలో ఇప్పుడు తైవాన్, తైవాన్ ప్రజానీకం చిక్కుకున్నారు. మధ్యంతర ఎన్నికలలో లబ్ధి పొందటం, ఈ తక్షణ ప్రేరేపణల ఉద్దేశ్యం. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతోనో, మానవ హక్కులుగా చెప్పబడేవాటి పేరుతోనో అమెరికా సామ్రాజ్యవాదం తన కపట నాటకాలకు ముసుగు వేయజాలదు. ✱

ఇటలీ, స్వీడన్ : నయా ఫాశిస్టు మూలాలతోనున్న మితవాద పార్టీల ప్రభుత్వాల ఏర్పాటు

ఇటలీలో జీవన వ్యయం పెరుగుదల, ఇంధన ధరలు ఆకాశాన్నంటడం వంటి సమస్యలపై ప్రజల తీవ్ర అసంతృప్తి ఫలితంగా అధికారంలోనున్న ప్రభుత్వం కూలిపోయిన వెనువెంటనే పార్లమెంటుకు ఎన్నికల జరిగాయి. దీనిలో 'బ్రదర్స్ ఆఫ్ ఇటలీ' పార్టీ అత్యధిక ఓట్లను సాధించింది. నయా ఫాశిస్టు మూలాలున్న ఈ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరచ బోతోంది. 1945లో ఇటలీ ఫాశిస్టు నియంత ముస్సోలినీ పతనం తర్వాత నుండి పరిపాలనా యంత్రాంగానికి సుదూరంగానున్న మితవాద పార్టీ ఇది.

శరణార్థులకు వ్యతిరేకంగా, తీవ్ర జాతీయవాద, ప్రొటెక్షనిస్టు, యూరోసెప్టిక్ విధానాలను 'బ్రదర్స్ ఆఫ్ ఇటలీ' పార్టీ అనుసరిస్తోంది. ఏమైనా, 2014 నుండి తన నయా ఫాశిస్టు మూలాలను బయటకు ఎక్కువగా కనబడనీయకుండా ప్రాచుర్యం పొందిన అమోదయోగ్య ధోరణిని ఆ పార్టీ అలవర్చుకుంది. అది చాలా సౌకర్యవంతంగా, మోసకారితనంగా ప్రజల అసంతృప్తిని, రాజకీయ వేగ గతిని రాజకీయ - అధికారాన్ని కైవసం చేసుకోవాలనే తన ప్రయోజనానికనుగుణంగా వాడుకుంది.

జీవన వ్యయం పెరుగుదల, సంక్షోభం, ధరలు పెరుగుతూ వుండటం, అంతులేని నిరుద్యోగం వంటి సమస్యలకు, ప్రజల అసంతృప్తికి ప్రధాన కారణం, ప్రపంచవ్యాపితంగా పాలకులు అమలుచేస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల వైఫల్యంలో వుంది. అయితే, పెట్టుబడిదారీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల అసంతృప్తిని మళ్ళించటానికి బదులుగా, నయా ఉదారవాద ఆర్థిక విధాన సమర్థకులైన ఈ అతి-మితవాద, నయా ఫాశిస్టు పార్టీలు మోసకారితనంగా ప్రజల అసంతృప్తినంతా శరణార్థులపైకి మళ్ళించి, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలు సృష్టించిన పరిస్థితిని వాడుకుంటున్నారు.

శరణార్థులపైకి ప్రజల దృష్టిని మళ్ళించే ఇదే వ్యూహాన్ని ప్రపంచవ్యాపితంగా మితవాద, ప్రతీఘాతుక పార్టీలన్నీ ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకునేందుకు అనుసరిస్తున్నాయి.

స్వీడన్

1980లకు చెందిన నయా నాజీ గ్రూపుల మూలాలున్న తీవ్ర జాతీయవాద, అతి-మితవాద పార్టీ అయిన స్వీడన్ డెమోక్రాట్స్ (ఎస్‌డి) ఎన్నికలలో విజయం సాధించటంతో, అతి-మితవాద ధోరణి యావత్ యూరోపును ఆవరించినట్లయింది. చాలాకాలంపాటు దీనికి లోబడకుండా స్వీడన్ నిలిచింది. మొదటిసారిగా తీవ్ర జాతీయవాద, శరణార్థుల వ్యతిరేక పార్టీ స్వీడన్‌ను పాలించబోతోంది.

స్వీడన్‌లో ఈ మితవాద విభాగం కీలకమైన అంశాలపై ఐక్యంగా వుంటూ 'స్వీడన్ డెమోక్రాట్స్' ఎదుగుదలను ముందుండి నడిపించింది. శాంతిభద్రతలు, శరణార్థుల సమస్య వీరు చేబట్టిన సమస్యలు. 2015లో స్వీడన్‌లో ఒక కోటి జనాభా వున్నకాలంలో, వీరిలోని 1,63,000 మంది శరణార్థులలో ఎక్కువమంది సిరియన్లు, ఇరాకీయులే.

అయితే, నూతన ఆర్థిక విధానాల కారణంగా నిరుద్యోగం గణనీయంగా పెరుగుతోంది. స్థానిక స్వీడన్ పౌరులలో నిరుద్యోగం పెద్దస్థాయిలో పెరుగుదల చూపగా, స్వీడన్ శరణార్థులలో నిరుద్యోగం స్థానిక స్వీడన్ ప్రజానీకం కంటే నాలుగురెట్లు పెరిగింది. దీనికితోడుగా స్వీడన్‌లో నేరాల తీవ్రత ముఖ్యంగా సామూహిక హింసాత్మక ఘటనలు వేగంగా పెరుగుతున్నాయి.

ఈ పరిస్థితులు మితవాద విభాగానికి జాతీయత, శరణార్థుల ప్రశ్నలను శరణార్థుల సమూహాలకు వ్యతిరేకంగా లేవనెత్తటానికి అవకాశం కల్పించాయి. శరణార్థులను 'ఇతర' ప్రజానీకంగా చూపుతూ, స్వీడన్ యొక్క ఉదార సంక్షేమ వ్యవస్థను కొల్లగొట్టటానికి వచ్చినవారిగా ప్రచారం చేశాయి.

కొంతకాలానికి స్వీడన్ డెమోక్రాట్స్ వంటి అతి మితవాద విభాగం, రాజ్యం నిర్వచిస్తున్న బహుళ సంస్కృతి అనే ఆదర్శానికి భిన్నంగా, స్వీడన్ ప్రజలకంటే కేవలం 'శ్వేతజాతీయులు'గా మాత్రమే నిర్వచించింది. దీనితో బహుళజాతుల శరణార్థుల సమూహాలు, స్వీడిష్ జాతీయ గుర్తింపు పొందలేకపోతున్నారు. ప్రజల అవ్యక్త దురభిమానాలను, ఆదుర్దాలను ప్రేరేపించి, స్వీడన్ డెమోక్రాట్లు, ఎన్నికలలో తమ గెలుపుకు ఉపయోగించుకున్నారు. వలసలను నిరోధించి, నేరస్థులను అదుపుచేయాలనే ఏకైక విద్వేష ఎజెండాతో (శరణార్థులనే నేరస్థులుగా నిర్వచిస్తూ) తీవ్ర జాతీయవాద, అతి-మితవాద స్వీడన్ డెమోక్రాట్లు స్వీడన్‌లో ప్రభుత్వాధికారాన్ని చేపట్టారు.

మనదేశంలో ముస్లిమ్ మతస్థులను 'ఇతరులు'గా వ్యవహరిస్తూ వారికి జాతీయ గుర్తింపు ఇవ్వటానికి నిరాకరిస్తూ, వారిని నేరస్థులుగా పరిగణిస్తూ, వారిపై 'ఉపా', 'ఎన్ఐఏ' చట్టాల క్రింద అనేక కేసులు బనాయిస్తూ వస్తున్న బిజెపి ఎజెండా కూడా స్వీడన్ డెమోక్రాట్ల తీవ్ర జాతీయవాద ఎజెండాకు దగ్గరగా వుండటాన్ని గమనించాలి.

సామాజిక ఉద్రిక్తతలను సృష్టించిన, అసమానతలను పెంచిన నయా ఉదారవాద ఆర్థిక విధానాల విపరిణామాలే ఇవన్నీ. ఇవి అంతిమంగా మానవత్వానికే సవాల్ విసిరే అతి-మితవాద నాయకుల, పార్టీల, తీవ్ర విలక్షణ సమూహాల పెరుగుదలకు దోహద పడుతున్నాయి.

ప్రపంచాన్ని శాసిస్తున్న నయా ఉదారవాద దుష్ఫలితంగా ప్రతీఘాత అతి-మితవాదం ప్రపంచవ్యాపితంగా పెరుగుతోంది. స్వీడన్‌లో స్వీడన్ డెమోక్రాట్ల, ఇటలీలలో 'బ్రదర్స్ ఆఫ్ ఇటలీ' విజయాన్ని కూడా ఈ దుష్పరిణామాలలో భాగంగా చూడాలి.

ప్రపంచవ్యాపితంగా విస్తరిస్తున్న ఈ ప్రమాదకర ధోరణికి వ్యతిరేకంగా ప్రగతిశీల, ప్రజాస్వామ్యశక్తులు - యావత్ మానవాళికే శాపంగా పరిణమించిన సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ వ్యవస్థకు, దాని దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరాయ పోరాటం సాగించాల్సిన అవసరముంది. ★

మనదేశ ప్రభుత్వ టెలికాం రంగపు సంక్షోభం

లెబనాన్ దేశపు అనుభవాలు

భారతదేశపు టెలికాం రంగంలో ప్రభుత్వ రంగ సంస్థలైన BSNL, MTNLలు ఇప్పుడున్న స్థితిలోనైనా పోటీలో లేకుంటే ప్రయివేటు సంస్థల గుత్తాధిపత్యం ఏర్పడడానికి ఎంతో కాలం పట్టదు. ఒక్కసారి ప్రయివేటు కంపెనీల గుత్తాధిపత్యం ఏర్పడ్డాక పరిస్థితులు ఎలా మారిపోతాయో లెబనాన్ దేశంలో ఇటీవల ఏర్పడిన టెలికాం, ఇంటర్నెట్ సంక్షోభాన్ని ఉదాహరణగా చూడవచ్చు. లెబనాన్‌లో వచ్చిన ఈ పరిస్థితులు రానున్న రోజుల్లో మన దేశంలో కూడా రావచ్చు. అలా ఏర్పడ్డ సంక్షోభం ఒక్క టెలికాం, ఇంటర్నెట్ రంగాలతోనే ఆగదు. దానితో ముడిపడివున్న సాఫ్ట్‌వేర్‌రంగం వంటి మిగిలిన సేవా రంగాలలో కూడా ఈ పరిస్థితి ఏర్పడవచ్చు.

పాలకులు దృష్టిలో BSNL కూడా IDPL వంటిదే :

ప్రభుత్వరంగ సంస్థలైన బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎల్‌లు నష్టాలలో ఉండటం అందరికీ తెలిసిన విషయమే. ఈ నష్టాలకు ఎవరు బాధ్యత వహించాలి? ఈ సంస్థల్లోని వేలాదిమంది ఉద్యోగులా? కార్మికులా? లేక పాలకులా? ఎవరు? ఖచ్చితంగా బాధ్యులు పాలకులే. ఎందుకంటే మొదట పి&టి నుంచి టెలికామ్‌ను వేరుచేశారు. తిరిగి మూడు కార్పొరేషన్లుగా విడదీసారు. అందులో విదేశాలతో నెట్‌వర్క్ కనెక్షన్ చేయగల ఏకైక సంస్థ VSNLను టాటాలకు అమ్మివేయడం వంటి విధాన నిర్ణయాలు చేసింది పాలకులే. ఎప్పుడైనా లాభ నష్టాలకు విధానాలే కీలకం కనుక విధాన నిర్ణేతలే జవాబుదారులు అవుతారు.

మిగిలిన రెండు కార్పొరేషన్లలో తీవ్ర నష్టాల్లో ఉన్న MTNLని BSNLలో కలిపి వేయాలన్న ప్రతిపాదన ప్రస్తుతానికి వాయిదా వేసినట్టు కన్పిస్తున్నది. ఢిల్లీ, ముంబై మహానగరాలలో సేవలందిస్తున్న MTNLకి నష్టాలు ఎందుకు వచ్చాయన్నది ఒక ప్రశ్న అయితే, ఇలా నష్టాలు వచ్చిన వాటిని ఇతర ప్రభుత్వ రంగాలలో విలీనం యొక్క గుణపాఠాలేమిటన్నది మరొకప్రశ్న.

ఆప్టిక్ ఫైబర్‌తో గ్రామాలను అనుసంధానం చేసే పని కోసమని BSNL నుంచి ఉద్యోగులను విడదీసి BBNL (భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్) అనే ఒక విభాగాన్ని తర్వాత కాలంలో ఏర్పరిచారు. దేశంలోని గ్రామాలన్నింటినీ ఆప్టిక్ ఫైబర్‌తో అనుసంధానించే అత్యంత ప్రాధాన్యత కలిగిన పనిగా చేపట్టారు. అంటే గ్రామాలలో ఈ రంగపు ఆధునిక మౌలిక సౌకర్యం కల్పించే పని BBNL ద్వారా చేస్తామన్నారు. అది ఎంతవరకు నెరవేరిందో, ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలకు ఏ అవసరం వచ్చిందో కానీ మళ్ళీ BSNLలోనే కలిపేస్తున్నట్టు మరొక కొత్త నిర్ణయాన్ని తాజాగా కేంద్రం ప్రకటించింది. దానితోపాటు కొన్ని ఉద్ధారక హామీలను కూడా ఇచ్చింది. ఈ హామీల అసలు ఉద్దేశ్యాలు ఏమిటి? వాటిలో ఎన్ని ఆచరణలోకి వస్తాయో చూడాలి. ప్రభుత్వ రంగానికే పెద్ద సంకేతంగా ఉన్న BSNL విషయంలో ప్రజల్లో వ్యతిరేకత రాకుండా మేము ఆ సంస్థను ఎంతగా ఆదుకోవాలని చూసినా అది నష్టాలనుంచి కోలుకోలేదనే నెపాన్ని మోపటం కోసం ముందుగానే కొన్ని తాయిలాల్ని ప్రకటిస్తున్నారు. దేశంలోని అన్ని గ్రామాల్లో ఆప్టిక్ ఫైబర్ సౌకర్యం అన్నది కేవలం BSNL ప్రయోజనాల కోసమే కాదు. ఈ మౌలికమైన సౌకర్యం నిర్మించినాక గ్రామీణ ప్రాంతాలలో కూడా ప్రైవేటు ఆపరేటర్ల స్పీడును ఎవరూ నిరోధించలేరు. సహజంగా ఆపరేషనల్ ఖర్చులు ఎక్కువగా ఉండే గ్రామాల్లో సేవలు అందించడంలో వచ్చే నష్టాలను ఇప్పటివరకూ బిఎస్ఎన్ఎల్ భరిస్తూ వచ్చింది. నెట్‌వర్క్ నాణ్యత సరిగా లేదనే ప్రచారాన్ని ఎదుర్కొంటూ వస్తున్నది. పునాది సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో వచ్చే నష్టాలను ప్రభుత్వ రంగాలకు మూటగట్టడమే ఇందులో దాగివున్న కుటిల కార్పొరేట్ నీతి.

బిఎస్ఎన్ఎల్ నష్టాలకు కారణాలేమిటి?

ప్రభుత్వరంగ బిఎస్ఎన్ఎల్ నష్టాలకు గల కారణాలను విశ్లేషిస్తే...

మొట్టమొదట భారతదేశంలో మొబైల్ సేవల కోసం (2జి) ప్రైవేటు సంస్థలకు 1995లోనే అనుమతి ఇచ్చారు. కానీ ప్రభుత్వ రంగ సంస్థలకు 2002లో అనుమతి ఇచ్చారు. అంటే 7 సంవత్సరాల తర్వాత. ప్రైవేటు సంస్థలు మొదట్లో ఇన్ కమింగ్ కాల్స్‌కి కూడా ప్రజల నుండి బిల్లులు వసూలు చేసేవి. ప్రభుత్వ రంగ సంస్థల మొబైల్ సేవలు మొదలైన తర్వాతనే ఇందులో మార్పు వచ్చింది. నిత్యం ప్రయివేటీకరణను పొగిడే వారికి ఈ వాస్తవం గుర్తుచేయాల్సి వుంది.

ప్రభుత్వరంగ సంస్థలు 2జి మొబైల్ సేవలను విస్తరించుకోవడానికి, పరికరాల కొనుగోలు కోసం 2007-2012 వరకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా జాప్యం చేసింది. అంటే ఈ 5 సంవత్సరాలు చాలా కీలకమైనవి. ఈ సమయంలోనే ప్రైవేటు సంస్థలు బాగా దూసుకెళ్ళి విపరీతమైన లాభాలను ఆర్జించాయి.

రకరకాల కారణాలతో బిఎస్ఎన్ఎల్ మాత్రం 2009-10 నుంచి నష్టాలను చవిచూడటం మొదలైంది. తిరిగి 3జి మొబైల్ సేవలు విస్తరించేటప్పుడు కూడా ప్రభుత్వం ఇలానే వ్యవహరించింది.

నేడు ప్రైవేటు సంస్థలు తమ లాభాలను పెంచుకుంటూ, విస్తరిస్తూ తాజాగా 5జి సేవలు అందించడానికి తయారుగా ఉంటే, బిఎస్ఎన్ఎల్‌ని మాత్రం ఇంకా 4జి సేవలు కూడా మొదలు పెట్టని సంస్థగా మిగిల్చారు. ఇటీవల ప్రధాని మాటల్లో కూడా 4జి అనుమతులు అయిపోయినట్టే అని చెప్పారు కానీ ఆచరణలోకొచ్చేది ఎప్పుడో? ఈ జాప్యానికి, ఫలితంగా వచ్చే నష్టాలకు కారణాలు కూడా ప్రభుత్వ నిర్ణయాలే.

49,300 3జి సెల్ టవర్లను 4జి సాంకేతికతకు మార్పు చేయడానికి ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌కు ఇప్పటివరకూ అనుమతి ఇవ్వలేదు. నిజానికి వీటికి కొత్త పరికరాల కొనుగోలు కూడా అవసరం లేదు. విపరీతమైన పెట్టుబడులతో కూడా పనిలేదు. అంతేకాకుండా 4జి మొబైల్ సేవల కోసం ఇప్పటికే మంచి టెక్నాలజీగా ఋజువుచేసుకున్న ఆధునిక సాంకేతికతను, పరికరాలను అంతర్జాతీయ సంస్థల నుండి కొనుగోలు చెయ్యడానికి బిఎస్ఎన్ఎల్‌కు అనుమతి ఇప్పటివరకు ఇవ్వలేదు. 'మేకిన్ ఇండియా'లో భాగంగా స్వదేశీ తయారీ ప్రవేటు సంస్థల నుండి మాత్రమే కొనుగోలు చేయాలని కండిషన్ పెట్టారు. అంటే మనదేశంలో ఇప్పుడిప్పుడే ఈ టెక్నాలజీని అభివృద్ధిచేసిన 'దేశీయ' TCS సంస్థ నుండి వారు ఇచ్చినంతకాలం వేచి ఉండి, వారు నిర్ణయించే ధరలకు కొనుగోలు చేయాలని కండిషన్ పెట్టారు. ఆ రకంగా 'స్వదేశీ' పేరుతో ప్రైవేటుసంస్థల ప్రయోజనాలతో ముడిపెడుతున్నారు.

ఇదే సమయంలో ప్రైవేటు సంస్థలు (జియో, ఎయిర్‌టెల్, ఐడియా) విదేశీ సంస్థల పరికరాలతో (నోకియా, శాంసంగ్, ఎరిక్సన్)

4జి సేవలను అందిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. దీనితో బిఎస్ఎన్ఎల్ మరింత నష్టాలను చవి చూడాల్సి వస్తున్నది. అంటే జియో, ఎయిర్‌టెల్‌లు 'మేకిన్ ఇండియా' విధానాన్ని అమలు చేయవు. చేయమని ఈ పాలకులు ఒత్తిడి చేయరు. వారికి దేశభక్తితో పనిలేదు. కానీ ప్రభుత్వరంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ మెడపై స్వదేశీ కత్తి వేలాడదీస్తున్నారు. కేబుళ్లు, టవర్ల నిర్మాణం, నిర్వహణ దగ్గర నుంచి, బ్యాంకులో లోన్లు తీసుకోడానికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ల దాకా సరైన సమయంలో ప్రభుత్వం అన్నిరకాల అనుమతులు ఇవ్వకపోవడం నష్టాలకు మొదటికారణం. వాటితోపాటు ప్రైవేటు ఆపరేటర్ల పట్ల చూపించే పక్షపాత విధానాలే ప్రభుత్వ రంగ సంస్థలైన BSNL, MTNLలు అభివృద్ధి చెందక పోవడానికి కారణాలు.

ఈ సంస్థల్లో నష్టాల సాకు చూపించి స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని వారనుకున్న తీరులో విజయవంతంగా అమలు చేశారు.

2020 సంవత్సరంలో ఈ పథకం కింద 55 శాతం మంది ఉద్యోగులు – అంటే సుమారు 65 వేలమంది పదవీ విరమణ చేశారు. ఫలితంగా క్రింది స్థాయి ఉద్యోగుల కొరత ఏర్పడింది. ఆ సిబ్బంది లేకపోవడంతో అన్ని సేవల కోసం కాంట్రాక్టు పద్ధతి ప్రవేశపెట్టారు. అంతేకాకుండా ఇదే సిబ్బంది కొరతను చూపించి మొబైల్ టవర్లు, ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లు, స్థలాలు, బిల్డింగుల నిర్వహణను కూడా ప్రైవేటు వారికి అప్పజెప్పడానికి సిద్ధం చేస్తున్నారు. మరొక కోణంలో చూస్తే ఈ స్వచ్ఛంద పదవీ విరమణ ఒప్పందం ప్రైవేటు టెలిఫోన్ ఆపరేటర్లకు అవసరమైన టెక్నికల్ సిబ్బందిని సరైన సమయానికి వారికి సమకూర్చి పెట్టిందన్నమాట. BSNLలో కొత్త నియామకాలు లేకుండా చేసి రిటైర్‌మెంట్ అయ్యేవాళ్ళు పోతూ ఉంటే మెల్లమెల్లగా టెలికాం రంగాన్ని మొత్తంగానే ప్రైవేటీకరణ చేయడానికి పూనుకుంటున్నారు. BSNLతో వారి అవసరం తీరిపోయినట్టుగా వ్యవహరిస్తున్నారు. ఫార్మారంగంలో IDPLని చేసినట్టు BSNL కథను కూడా ముగించాలని చూస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడలేకపోతే ఉద్యోగులు, కార్మికులు ఇళ్ల కెళ్ళిపోండని దురహంకారంతో కేంద్ర కమ్యూనికేషన్ శాఖామంత్రి బహిరంగంగా ప్రకటించడం ఇందులో భాగమే. ఇందుకుగాను రైల్వే, బిఎస్ఎన్ఎల్ వంటి రంగాలలో పైస్థాయి ఆఫీసర్లతో ఒకరకమైన ప్రచారం చేయిస్తూ, వాటిని వాట్సాప్ యూనివర్సిటీలతో ప్రచారం చేయిస్తున్నారు. ఈ రంగాలలో 10 మంది ఉద్యోగులు చేసే పనిని ప్రైవేటు కంపెనీ ఉద్యోగులైతే ఇద్దరు చేయగలరని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మిగిలిన 8 మందికి అనవసర జీతాలిస్తున్నారని అన్ని మీడియాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. శ్రమను పిండుకోవడాన్ని యాజమాన్యాల వైపు నుంచి సమర్ధించే విద్రోహపు విష ప్రచారాలను వేగవంతం చేస్తున్నారు. ఫార్మారంగంలో వచ్చినట్టు గుత్తాధిపత్యం వచ్చిన నాడు, దేశంలో ప్రైవేటు సెల్‌ఫోన్ ఆపరేటర్ల ఇష్టారాజ్యం వచ్చిననాడు ప్రజలపై నిలువుదోపిడీ పెరగక మానదు.

టెలికాం రంగం మొత్తం ప్రైవేటు సంస్థల చేతిలోకి వెళితే ఎలా ఉంటుందో నేటి లెబనాన్ దేశపు అనుభవాలు పరిశీలిస్తే అర్థమవుతుంది. అక్కడి ప్రజల పరిస్థితిని రేపటి రోజున భారతదేశ ప్రజలు కూడా అనుభవించవలసి వస్తుంది.

మొబైల్ సేవలు, ఇంటర్నెట్ సేవలు సామాన్య ప్రజలకు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లేకుండా పోతాయి. గ్యాస్ ధరలు, పెట్రోలు ధరలు, ఇతర నిత్యావసర ధరల పెరుగుదలతో పాటు మొబైల్ సేవలు కూడా మరింత ఖరీదు అయిపోతే ప్రజలు మరింత దుర్భర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది.

టెలికాం సేవల ధరల పెరుగుదల పట్ల లెబనాన్ దేశ ప్రజల తీవ్ర వ్యతిరేకత :

టెలికాం సేవల ధరలపై గత నెలలో చట్ట సవరణ చేసిన లెబనాన్ మంత్రివర్గం, కొత్త విధానం ప్రకారం "ఇకపై టెలికాం సేవల ధరలు సెంట్రల్ బ్యాంకు డాలరు మారకం రేటు ప్రకారం వసూలు చేయబడతాయి" అని తెలిపింది. డాలర్ విలువ ప్రతిరోజూ మార్పు చెందడం లాగానే ఆ పెరుగుదల కనుగుణంగా టెలికాం బిల్లులు విపరీతంగా పెరుగుతాయి. కొత్త చట్టం చేయక ముందు టెలికాం బిల్లులు 1500 లెబనాన్ పౌండ్లు / డాలర్ రేటు ప్రకారం చెల్లించేవారు. ఇప్పుడు అంటే 2022 జులై 1వ తారీఖున ఆ దేశపు సెంట్రల్ బ్యాంకు ధరల ప్రకారం ఒక డాలర్ విలువ 25,300 లెబనాన్ పౌండ్లు చెల్లించాల్సి వస్తుంది.

మూడు సంవత్సరాల క్రితం డాలర్ విలువతో పోలిస్తే ఇవాళ లెబనాన్ పౌండ్ విలువ 95 శాతానికి తగ్గిపోయింది. ఇప్పటికే ఆహారం, ఇంధనం, కరెంటు, అధిక ధరలతో సతమత మవుతున్న ప్రజలు టెలికాం బిల్లుల పెరుగుదలను ఏమాత్రం భరించే స్థితిలో లేరు. ప్రభుత్వ సబ్సిడీలు ఒక్కొక్కటి తగ్గిస్తూ ఉండటం వలన ఆరోగ్యానికి మందులు, ఇంధన ధరలు ఇప్పటికే సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి.

లెబనాన్‌లో ఇక టెలికాం సేవలను ఎగువ తరగతి, ఆపై వారు తప్ప సామాన్య ప్రజలు ఉపయోగించుకోలేని పరిస్థితి వచ్చింది. కనీసం ఐదు రెట్లకు పైగా టెలికాం ధరలు పెరిగాయి. దీనివల్ల ఇకపై ఎక్కువ శాతం ప్రజలు ఇంటర్నెట్ సేవలను తక్కువగా ఉపయోగించడం లేదా ఆపివేయడం జరుగుతుంది. టెలికాం రంగంలో మెరుగైన మౌలిక సదుపాయాలను మరింతగా విస్తరించి ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చేయకుండా – ధరలు పెంచి కామధేనువు లాగా వాడుకోవాలని చూస్తున్నారు. ఇటువంటి మాఫియా ప్రభుత్వాల వలన తమ దేశంలో ఎటువంటి మార్పు రాదని ఈ ధరల పెరుగుదల పట్ల లెబనాన్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేకచోట్ల ఆందోళనలు చేస్తున్నారు.

కనుక లెబనాన్‌లో అయినా భారతదేశంలో అయినా పాలకులు బహుళజాతి కంపెనీల ఫైనాన్స్ పెట్టుబడుల వత్తిడులకు తలవొగ్గి దళారీ విధానాలు అమలుచేస్తున్నంత కాలం స్వదేశీ పరిశ్రమల, ప్రభుత్వ రంగాల మనుగడ కష్టంగానే ఉంటుంది. పారిశ్రామిక అభివృద్ధిని, అందులో టెక్నాలజీ అభివృద్ధిని ఏమేరకు అనుమతించాలో, ఎక్కడ నిరోధించాలో సామ్రాజ్యవాదం నిర్ణయిస్తుందని ఈ ఉదాహరణలు చెబుతున్నాయి. ఈ విదేశీ అనుభవాలను కూడా మనదేశ ప్రజలంతా అర్థం చేసుకుంటే తప్ప బిఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ రంగాలను పూర్తిగా నాశనం కాకుండా గట్టి పోరాటాలతో కాపాడుకోవడం సాధ్యం కాదు. కార్మికవర్గ చైతన్యంతో దోపిడీ వ్యవస్థను సమూలంగా మార్చే లక్ష్యంగా జరిగే నిర్మాణాత్మక పోరాట కృషి మాత్రమే బహుళజాతి కంపెనీల దోపిడీని, దళారీ పాలకుల విధానాలను సవాలు చేయగలదు. ✱

భారతదేశంలో తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం
దుర్భరం అవుతున్న పీడిత ప్రజల బ్రతుకులు

ప్రొ॥ తోట జ్యోతిరాణి

కోవిడ్ విపత్తు వల్ల మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం ఎంత తీవ్రంగా వున్నదో స్పష్టంగా బయటపడింది. దీనితో సమస్త దేశాల సాధారణ అభివృద్ధి క్రమంలోని డొల్లతనం తేటతెల్లమైంది. వర్ధమాన దేశాలలో దుర్భరమైన ఈ అభివృద్ధి నమూనా మానవ సంక్షోభంతో ముడిపడి వున్న వాస్తవమని తేలింది. భారతదేశంలో వికృతంగా జనజీవితం అస్తవ్యస్తం కావడంతో అభివృద్ధి పట్ల ఎక్కువమందిలో ఉన్న భ్రమలు తొలిగాయి. సామ్రాజ్యవాద దోపిడీ నిరాటంకంగా కొనసాగటానికి బలంగా అమలవుతున్న నయా ఉదారవాద విధానాలే కారణమని ప్రపంచ అసమానతల నివేదిక, 2022 తేల్చి చెప్పింది. ఈ విధానాల రద్దు అవసరమని సూచించింది.

సంక్షోభం ఏదైనా, అది కూడా గుత్త పెట్టుబడుల సంపదను పెంచే సాధనం అవుతుంది. దోపిడీని తీవ్రం చేస్తుంది. ఇందుకు కరోనా సంక్షోభం మినహాయింపు కాదు. దీనికి తోడు, కుబేరుల సంపదను పెంచడమే లక్ష్యంగా మన ప్రభుత్వాలు చట్టాలను సవరిస్తున్నాయి, కొత్త చట్టాలను రూపొందిస్తున్నాయి, విధానాలను అమలు పరుస్తున్నాయి. కేంద్రం ఈ లక్ష్యాల సాధన పేరుతో మెజారిటీ ప్రజల జీవన విధ్వంసాన్ని "సబ్ కా ప్రయాస్" అంటూ అభినందిస్తుంది.

కోవిడ్ విపత్తుకి పూర్వం ఆర్థిక సంక్షోభం :

2029 నాటికే CMIE నివేదికల ప్రకారం మనదేశంలో అత్యధిక నిరుద్యోగిత రేటు నమోదయింది. గత రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉద్యోగరహిత అభివృద్ధి క్రమంగా ఉద్యోగాలు కోల్పోయే అభివృద్ధిగా పరిణమించింది. రెగ్యులర్ ఉద్యోగాలు కాలం చెల్లినవైనాయి. క్యాజువల్ లేబర్, కాంట్రాక్టింగ్ ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలే. వీటిలో ఎటువంటి భద్రత, హక్కులు వుండవు. సమస్త ప్రభుత్వరంగ సంస్థలను, మొత్తం రవాణా, కమ్యూనికేషన్ రంగాలను, బొగ్గు గనులను, ఖనిజాల తవ్వకాలను, బ్యాంకులను ప్రైవేటీకరించడంతో ఉద్యోగాలను కోల్పోవటం తీవ్రమైంది.

మెజారిటీ శ్రామికులు దుర్భరమైన, అపాయకరమైన పరిస్థితులలో పనులు చేస్తున్నారని, వీటిని మెరుగుపరచవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని గత దశాబ్దిగా అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ILO) హెచ్చరిస్తూనే వున్నది. కాగా, శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించుకుంటున్నది. 2021లో గ్లోబల్ ఆకలి సూచిక ప్రకారం 116 దేశాలలో మన స్థానం 101. మహిళల్లో దీర్ఘకాలిక శక్తిహీనత, పౌష్టికాహార లోపం వల్ల పిల్లల ఎదుగుదలలో వికృతి ఆధారంగా మనదేశంలో గ్రామీణ ప్రాంతాలలో 83 శాతం, పట్టణ ప్రాంతాలలో 57 శాతం పేదరికంలో బతుకుతున్నారని నేషనల్ శాంపిల్ సర్వే గత కొద్ది సంవత్సరాల నుండి చెబుతూనే వున్నది.

2019 నాటికే ఆటోమొబైల్ రంగంలో అమ్మకాలు తీవ్రంగా పడిపోవడంతో మొదలైన మాంద్యం, ఇతర అనుబంధ రంగాలకు విస్తరించి, పెద్దఎత్తున ఉపాధులను కోల్పోవటం ముమ్మరమైంది.

వ్యవసాయ సంక్షోభం బలపడింది. రైతుల ఆత్మహత్యలు తీవ్రమైనాయి, కొనసాగుతూనే వున్నాయి. గ్రామాలలో ఉపాధి అవకాశాలు క్రమంగా అదృశ్యమవడం వల్ల గ్రామీణ సంక్షోభం తీవ్రమవుతూనే వున్నది. అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట అడవులను నరికి వేయటం వల్ల ఆదివాసీలు బతుకుతెరువు కోసం వెళ్లిపోవాల్సిందే. అడవుల సంరక్షణ పేరిట కూడా అడవుల నుండి ఆదివాసీలను తరిమి వేస్తున్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్లు, కార్బన్ అడవుల జోరు మెజారిటీ ప్రజలను తమ గ్రామాల నుండి గెంటివేస్తున్నాయి. 2001 నాటికే 30 కోట్ల 90 లక్షలమంది వలస వెళ్లారని అంచనా. కొనసాగుతున్న విధ్వంస ఆర్థిక నమూనా వల్ల 2001-11 మధ్యకాలంలో అదనంగా 2 కోట్ల 20 లక్షలమంది వలసలు వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక 2020 కరోనా లాక్‌డౌన్ నాటికి 35 కోట్లమంది వలస కూలీలు వుంటారని అంచనా.

దీనికితోడు, విద్య, వైద్యం, రవాణారంగాల కార్పొరేటీకరణతో మెజారిటీ ప్రజల జీవన ప్రమాణాలు మరింత కుంచించుకుపోయినాయి. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (GST) భారం వల్ల ఉపాధిని అధికంగా కల్పించే MSME రంగం ఖాయిలా పడింది. ఇదే అదనుగా ప్రభుత్వం కనీస వేతనాన్ని 176 రూ॥ల నుండి 2 రూ॥లు కలిపి 178 రూ॥లకు పెంచింది. ఇది, ఉపాధి హామీ పథకం (MGNREGA) వేతనం 182 రూపాయల కంటే తక్కువ. పైగా ప్రభుత్వం తానే స్వయంగా నియమించిన సత్ పత్ కమిటీ సిఫార్సు చేసిన 375 రూపాయల కనీస వేతనాన్ని తిరస్కరించటం పెట్టుబడిదారుల లాభాల కోసమే. అందువల్లనే గత పది సంవత్సరాలుగా అంటే 2010-21 మధ్యకాలంలో మన దేశంలో మానవాభివృద్ధి సూచిక విలువలో తీవ్రమైన తగ్గుదలను గమనించవచ్చు. మానవాభివృద్ధి నివేదిక 2021-22 ప్రకారం గ్లోబల్ ర్యాంకింగులో మనదేశ విలువ 2020లో 130 వుండగా, అది మరింత దిగజారి 2021లో 132కి పడిపోయింది. ఆశ్చర్యకరంగా, మన ఇరుగుపొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, చైనాలో మనకంటే మెరుగ్గా వున్నది. "వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం" అన్నది ఎంత బూటకమో స్పష్టమైంది. మెజారిటీ ప్రజల జీవన సంక్లిష్టత స్పష్టంగా మన దేశ ఆర్థిక అస్థిరతనే సూచిస్తుంది.

2022 పంద్రాగస్టు స్వాతంత్రం ఏ 75, కాబట్టి 'ఆజాదీ కా అమృత కాల్ మహోత్సవ్' అంటూ ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగరటంతో దేశభక్తి వ్యక్తమవుతుందని ఆర్భాటంగా ప్రచారం చేసిన ప్రభుత్వం మెజారిటీ ప్రజల జీవన విధ్వంసానికి పరిష్కారంగా ఏం చేసింది అన్నది ప్రశ్న. 2019-20 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టంగా, దాపరికం లేకుండా లక్ష్య ప్రకటన చేసింది. కార్పొరేట్ శక్తులే సంపద సృష్టికర్తలని, అందుకే సప్లై గొలుసును ప్రోత్సహిస్తామని, 2024-25 నాటికి మన ఆర్థికవ్యవస్థ విలువ 5 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు అంటే 400 లక్షల కోట్ల రూ॥ల విలువను సాధిస్తామని ప్రకటించింది. ఇంకా ప్రస్తుతం వున్న 959 కుబేరుల సంఖ్యను మూడు రెట్లు పెంచుతామని చెప్పింది. సంపన్నుల సంఖ్యను, వాళ్ళ సంపదను పెంచడమే ప్రభుత్వం లక్ష్యం అని తేలిపోయింది. మెజారిటీగా వున్న పీడిత ప్రజల తిండి గోల ఎప్పుడు ఉండేదే. ప్రపంచ కుబేరులలో మన అంబానీలు, ఆదానీలు స్థానం సంపాదించుకోవటమే ముఖ్యం. అందుకు ప్రభుత్వం నిక్కచ్చిగా, చట్టబద్ధంగా, చట్టాలను సవరించి అయినా దేశ సమస్త సంపదను, సహజ వనరులను, శ్రమశక్తిని శక్తివంచన లేకుండా గుత్త పెట్టుబడులకు అప్పచెబుతూనే వున్నది. ఇందుకు మెజారిటీ ప్రజల బతుకు బలికావాల్సిందే. తప్పదు మరి.

కోవిడ్ - 19 ప్రభావం :

మార్చి 2020లో కేవలం నాలుగు గంటల ముందస్తు హెచ్చరికతో సడన్ లాక్‌డౌన్ ప్రకటిస్తే, అడ్డా మీద కూలీలుగా పనిచేస్తున్న 35-40 కోట్ల మంది వలస కార్మికులు, వాళ్ళ కుటుంబాలు ఏం కావాలి? పనికి భద్రత లేదు. రోజు కూలీ దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. ఏ యజమానికీ వీళ్ళ పట్ల ఎలాంటి బాధ్యతా లేదు. ఈ స్థితి గత రెండు దశాబ్దాలుగా స్థిరపడి, బలపడింది. కరోనా వల్ల తట్టా, బుట్టా నెత్తి మీద పెట్టుకొని కుటుంబాలు, మొత్తంగా ముసలివాళ్లు, రోగులు, గర్భిణీ స్త్రీలు, పిల్లలు వందల, వేల కిలోమీటర్లు నడుస్తూ సొంత వూళ్లకు బయలుదేరిన హీనస్థితిని మనమందరమూ చూసాం. దారిపొడవునా ఆదుకున్నది ప్రజలు, ప్రజాసంఘాలే. ప్రపంచమంతా విస్తుపోయి చూసిన ఈ దయనీయస్థితి ప్రభుత్వానికి కనిపించలేదని పార్లమెంటులో ప్రకటించడం దేనిని సూచిస్తుంది? పీడిత ప్రజల జీవన సంక్షోభాన్ని ప్రభుత్వం చూడడానికే నిరాకరించిన తీరు ఇది.

ప్రారంభంలో అరకొర వసతులతో వున్న ప్రజారోగ్య వ్యవస్థే కోవిడ్ రోగులకు చికిత్సను అందించింది. క్రమంగా చికిత్స లేని ఈ అంటువ్యాధిని శక్తివంతమైన వాణిజ్యసరుకుగా కార్పొరేట్ వైద్యం మలుచుకున్నది. లక్షలకు లక్షలు భారీగా వసూలు చేసి, మధ్యతరగతి వర్గాన్ని కూడా పేదరికంలోకి నెట్టిన వాస్తవాన్ని కూడా అందరమూ చూశాం.

189 మిలియన్ల క్యాజువల్ శ్రామికులు ఉపాధిని కోల్పోయారు. అసంఘటిత రంగంలో 400 మిలియన్ల మంది ఉపాధులు ప్రమాదంలో పడ్డాయి. చిన్న, మధ్యతరహా సంస్థలు భారీఎత్తున మూతపడ్డాయి. ప్రైవేట్ విద్యాసంస్థలు, వాటికి అనుబంధంగా వున్న అనేక సంస్థలలో పనిచేసే ఉద్యోగులు బజారున పడ్డారు. స్కూల్ టీచర్లు కూరగాయలమ్ముకున్నారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో పని చేసే అధ్యాపకులు కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. నిరుద్యోగిత భారం, ఉద్యోగాలను కోల్పోవటంలో మహిళలే అధికం అని అజీమ్ ప్రేమ్ జీ, తదితర అధ్యయనాలు వెల్లడిచేశాయి. మహిళల మీద ఇంటి పని భారం పెరిగింది. గృహహింసతో పాటు సకల హింసలు తీవ్రమైనాయి. మహిళలు 135 సంవత్సరాలు వెనక్కి నెట్టబడ్డారు. కోవిడ్ విపత్తు వల్ల 35-65 శాతం మంది అదనంగా పేదరికంలోకి నెట్టబడ్డారు. ప్రపంచ అసమానతల నివేదిక, 2022 ప్రకారం 2019తో పోల్చితే ఆకలి సమస్యలో పెరుగుదల 82 శాతం. కోవిడ్ విపత్తు పూర్వం వున్న సంక్షోభ స్థితికైనా రావటానికి మెజారిటీ ప్రజలకు ఎన్ని దశాబ్దాలు పడుతుందో తెలియని స్థితి. ఆశ్చర్యకరంగా కోవిడ్ విపత్తు సంక్షోభం నుండి కార్పొరేట్ శక్తులు కేవలం 5 నెలల్లోనే కోలుకున్నాయి. సంక్షోభాన్ని సంపదగా మార్చుకోగల ప్రావీణ్యం వల్ల సంపన్నుల సంపద అనూహ్యంగా పెరిగింది. ప్రైవేట్ జెట్‌లలో విదేశీ ప్రయాణాలు ముమ్మరమైనాయి. అంతరిక్ష విహారయాత్రలు ప్రారంభమైనాయి. అందువల్లనే UN సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, మనం అందరమూ ఒకే నావలో ప్రయాణం అన్నది శుద్ధ అబద్ధం అని కోవిడ్ విపత్తు రుజువు చేసిందంటాడు. సూపర్ యాట్స్‌లో విలాసవంతంగా కొద్దిమంది విహరిస్తుంటే, శిథిలాల దిబ్బలో మెజారిటీ ప్రజలు దుర్భరస్థితిలో ఉండటమే పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ ప్రాథమిక లక్షణం.

ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ :

మే 12, 2020న 20 లక్షల 97 వేలకోట్ల ప్యాకేజీతో కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌ని ప్రకటించింది. ఉపాధుల పునరుద్ధరణ, భద్రత, ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయటం, ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేయటం గురించి ఈ ప్యాకేజీలో ప్రస్తావన కూడా లేదు. తెల్ల రేషన్ కార్డు వున్న వాళ్లకు నెలకి ఐదు కిలోల బియ్యం, ఒక కిలో పప్పు మూడు నెలలు ఉచితంగా ఇస్తామని, తెల్లకార్డు లేని వలస కూలీలకు ఇదే రేషన్ రెండు నెలలు ఇస్తామని చేతులు దులిపి వేసుకున్నది. ఇక ఉపాధి హామీ పథకంలో వేతనం 182 రూ॥ల నుండి 202 రూ॥లకు పెంచింది. అంటే 20 రూ॥లు. కానీ సంవత్సరానికి 100 రోజులు ఈ ఉపాధిని కూడా ఇవ్వలేకపోవటం విమర్శలకు గురైంది. నిజానికి అభివృద్ధి క్రమంలో భాగంగా ప్రజలందరికీ గౌరవప్రదమైన ఉపాధి లభించాలి. ఇందుకు వ్యతిరేకంగా పరిస్థితి ఉండటం వల్ల తాత్కాలిక చర్యగా 1975లో పనికి ఆహార పథకాన్ని ప్రారంభించారు. అభివృద్ధి క్రమంలో ఈ వక్రీకరణ తీవ్రమైంది. తాత్కాలిక పథకాలు శాశ్వతమైనాయి. అధికారంలోకి రావడానికి ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలకు ఇది ఒక సాధనమైంది.

గత ఐదు సంవత్సరాల్లో ఐదు లక్షల కంపెనీలు మూతపడ్డాయని, లక్షల మంది ఉపాధిని కోల్పోయారని ఇటీవల కాలంలో ప్రభుత్వమే పార్లమెంటులో చెప్పటం చిన్నచితకా పరిశ్రమల స్థితిని, నిరుద్యోగ తీవ్రతను తెలియ జేస్తుంది. కాగా ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో MSME నిర్వచనం మార్చడం వల్ల ప్లాంట్, మిషనరీలో 50 కోట్ల పెట్టుబడి వున్న సంస్థలు, వార్షిక టర్నోవర్ 250 కోట్ల రూ॥లు వున్న సంస్థలన్నీ MSMEలో భాగం అవుతాయి. కార్పొరేట్ సంస్థలలో క్రిందిస్థాయి సంస్థలు ప్రభుత్వాలు ఇచ్చే ప్రయోజనాలను పొందుతాయి. ఇక నిజమైన చిన్న పరిశ్రమలు మూతపడతాయి.

సరఫరా గొలుసు ప్రోత్సాహకాలు అంటూ 2014-19 మధ్య కార్పొరేటు శక్తులకిచ్చిన పన్ను రాయితీలు 5.76 లక్షల కోట్ల రూపాయలు. ఇంకా 5 లక్షల కోట్ల రూ॥ల ఋణాల్ని రద్దు చేశారు. కేవలం కరోనా లాక్‌డౌన్ కాలంలో విజయ్ మాల్యా, రాందేవ్ బాబా మొదలగు దిగ్గజాల 68 వేల కోట్ల రూపాయల ఋణాన్ని రద్దు చేశారు.

ఆత్మనిర్భర భారత్ అభియాన్ చివరి భాగంలో కంపెనీ చట్టంలోని క్రిమినల్ భాగాలను తొలగిస్తామన్నారు. ఇక కార్పొరేట్ శక్తులు నేరాలను యధేచ్ఛగా చేసుకోవచ్చు. 2021 నాటికి 25,000 చట్టాలను తొలగించారు. 1486 కేంద్ర చట్టాలను రద్దు చేశారు. పర్యావరణ పరిరక్షణ చట్టాలను సరళీకరించారు లేదా రద్దు చేశారు. ఇంకా 2022-23 కేంద్ర బడ్జెట్‌లో బహుళజాతి సంస్థలు సులభంగా నిష్క్రమించడానికి చట్ట సవరణలు చేశారు. పైగా ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు తోడుగా బొగ్గు తవ్వకం, ఖనిజాలు, రక్షణ, వాయు రవాణా, అంతరిక్షం, విద్యుచ్ఛక్తి, పంపిణీ, అణు విద్యుత్తు, మొదలగు సమస్త రంగాలను ప్రైవేటీకరించటమే లక్ష్యమని ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లోని నాలుగవ భాగం చెబుతుంది. బొగ్గు తవ్వకాలలో ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని రద్దు చేస్తామనటం, బాక్సైట్, అల్యూమినియం, మొదలగు విలువైన ఖనిజాలకు చెందిన 500 బ్లాకులను వేలం వేయటం, రక్షణ రంగంలో ఆటోమేటిక్ రూట్ ద్వారా విదేశీ పెట్టుబడుల వాటాను 49 శాతం నుండి 74 శాతానికి పెంచటం, గుత్త పెట్టుబడులు గగన తలాన్ని వాడుకోవటానికి అనుమతినివ్వటం, ఇస్రో ఇకముందు ప్రైవేట్ రంగంతో కలిసి పనిచేయాలని చెప్పటం, ఇవన్నీ ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో ముఖ్యమైన భాగం. ఇట్లా, గుత్త పెట్టుబడులకు సమస్త సంపదను అప్పగించే ప్రక్రియ స్వావలంబన పేరుతో ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌తో వేగవంతమైంది.

ఆ తర్వాత ప్రభుత్వం ఏం చేసింది?

కరోనా విపత్తు, లాక్‌డౌన్‌లతో ఇళ్లకు వెళ్లిన కోట్లమంది వలస కార్మికులను, వాళ్ళ కుటుంబాలను బతికించుకున్నది సంక్షోభంలో వున్న గ్రామాలు, వ్యవసాయరంగమే. ఈ రంగానికి ఉన్న అద్భుత శక్తిని మరొకసారి గమనించిన గుత్త పెట్టుబడులకు సాగు భూమిని స్వాధీనం చేసుకోవాలన్న కోరిక మరింత తీవ్రమైంది. అందుకనుగుణమైన చట్టాలను రూపొందించడానికి ప్రభుత్వం సిద్ధంగానే

వున్నది. అందువల్లనే జూన్, 2020లోనే నల్ల సాగు చట్టాలకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను జారీచేసింది. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా రైతాంగం - ప్రధానంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రైతులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఆ నిరసనల మధ్య సెప్టెంబర్, 2020లో ఈ నల్ల సాగు చట్టాలు పార్లమెంటులో ఆమోదం పొందటం అతి పెద్ద విషాదం. భూసంస్కరణలు కాలం చెల్లినవని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. రైతాంగం తీవ్ర నిరసనల మధ్యనే డిసెంబర్ 6, 2020న రాష్ట్రపతి సంతకం పెట్టాడు.

ఈ చట్టాల వల్ల ఇక అంతంతమాత్రంగా పనిచేసే రెగ్యులేటెడ్ మార్కెట్లు ఉండవు. కంటితుడుపు చర్యగా ఉన్న కనీస మద్దతు ధర వుండదు. “ఒకే దేశం, ఒకే మార్కెట్” - రైతు దేశంలో తన పంటను ఎక్కడైనా అమ్ముకోవచ్చు అంటూ నినాదం. వ్యవసాయం చేసేది 80 శాతం పైగా చిన్న, సన్నకారు కౌలు రైతులే. ఊళ్లో కిస్తీ వ్యాపారులకే తమ పంటను అమ్ముకుంటారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గ్రామాల్లోని రైతులు మధ్యప్రదేశ్‌కో, ఢిల్లీకో పంటను పట్టుకొని వెళ్తారా? దేశంలోని ఏ ప్రాంతంలోనైనా కార్పోరేట్ శక్తులు పంటను కొనుక్కోవటానికి ఇది అవకాశంగా వుంటుంది. కనీస మద్దతు ధర కూడా వుండదు. డిమాండ్, సరఫరాల పేరుతో మరింత చౌకగా పంటను కొనుక్కుంటారు. కొన్న పంటను నిల్వ చేసుకోవటానికి వీలుగా చట్టాలను సవరించారు. 2020లో ఈ చట్టం వచ్చినా దీనికి ప్రాతిపదిక 2005లోనే మొదలైంది. అదానీకి 700 కోట్ల రూ॥ల ఋణాలను ఇచ్చి, గిడ్డంగుల నిర్మాణంలో ప్రవేశానికి అనుమతులు ఇచ్చారు. దీనితో 7 రాష్ట్రాల్లో 8.75 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వకు, అదనంగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాల నిల్వల కోసం గిడ్డంగుల నిర్మాణం జరిగింది. నిల్వచేస్తున్న ధాన్యాన్ని అమ్మటం కోసం 2005లోనే చిల్లర వర్తకంలో గుత్తపెట్టుబడుల ప్రవేశానికి చట్టం చేశారు. నెస్లే, మోన్‌శాంటో, పెప్సీ, ఐటిసి, రిలయన్స్, టాటా, అదానీ, మహేంద్ర, రాలీస్, హిందుస్థాన్ లీవర్ మొదలైన కార్పొరేటు దిగ్గజాలు ఆహార తయారీ పరిశ్రమలో బలపడ్డాయి. RBI అంచనాల ప్రకారం ఈ రంగంలో లాభం రేటు 140 శాతం.

రైతు తన సాగుభూమిలోనే కూలీగా పనిచేస్తూ గుత్త పెట్టుబడులు చెప్పిన పంటను పండించడానికి కాంట్రాక్టు సాగు చట్టం రూపొందింది. వ్యవసాయ రంగంలో రైతు వద్ద మిగిలి వున్నది కేవలం సాగుభూమే. ఈ చట్టాలతో రైతు తన సాగుభూమి నుండి చట్టబద్ధంగా పరాయీకరించబడటం ఖాయం. మొత్తంగా చూసినపుడు పార్లమెంటులో 3 రైతుచట్టాలు రద్దుచేసినట్టు కనిపిస్తున్నా ఆచరణలో అవి అనేకరూపాలలో అమలులోకి వస్తున్నట్టే.

సామాన్య జనం మీద పన్నుల భారం, కార్పోరేట్ దిగ్గజాలకు రాయితీలు :

దేశమంటే ప్రజలు కాదు, దేశమంటే కుబేరులే అన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వాలకు సామాన్య జనం ఆకలికేకలతో పన్నులు కట్టాల్సిందే. రాయితీలు పొందుతున్న సంపన్నవర్గం ప్రపంచ కుబేరుల స్థానాల్లో దూసుకుపోతుంటే, చస్తూ బతుకుతున్న జనం దేశభక్తితో మురిసి పోవాల్సిందే. సామాన్య జనం మీద అధికభారాన్ని మోపే వస్తుసేవల పన్ను (GST) ఇక తిరోగామి పన్నుగా వుంటుంది. నిత్యావసర వస్తువుల మీద అధిక శాతం, సంపన్నవర్గం ఉపయోగించే డైమండ్స్ మీద, బంగారం మీద తక్కువ శాతం పన్ను విధింపు వుంటుంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాసు నిత్యావసర వస్తువులే. వీటి ధరలు కొన్ని వందలసార్లు పెరిగాయి. అంతర్జాతీయ ధరలతో, ముడిచమురు ధరలతో సంబంధమే లేదు. చిన్నా చితక వ్యాపారాలు చేసుకునే వాళ్లకు ఏదో ఒక వాహనం కావాల్సిందే. పెట్రోల్, డీజిల్ కొనాల్సిందే. వంట చేసుకోవాలంటే వంటగ్యాస్ తప్ప ప్రత్యామ్నాయం లేని స్థితి. ఏ ధరకైనా కొనాల్సిందే. 2021-22లో వస్తుసేవల పన్ను 67 శాతం అధికంగా వసూలైందని సంతోషాన్ని వ్యక్తం చేసిన బడ్జెట్ ప్రసంగానికి, అవి బతుకు గోసతో కట్టిన పన్నులని అర్థం కాలేదన్నది ఎంతటి క్రూరత్వం!? అభివృద్ధి కోసం 'సబ్ కా ప్రయాస్' అవసరం అంటూ స్వాతంత్ర్యం@100 వరకు వున్న 'అమృత్ కాల్‌'లో పరిస్థితి, విధానాలు కొనసాగుతాయని ఆర్థికమంత్రి ప్రకటించటం సామాన్యులకు ఇక గడ్డు రోజులేనన్నది స్పష్టం.

సప్లై గొలుసు ప్రోత్సాహం పేరిట గుత్త పెట్టుబడులకు రాయితీలు :

మనదేశ కార్పొరేట్ పన్ను ప్రపంచంలో కనిష్టంగా వుంది. ఉదాహరణకు 2020లో వార్షిక లాభాలు 500 కోట్ల రూ॥లకు మించిన సంస్థలపై తక్కువ పన్ను రేటు వుంది. కాగా, వార్షిక లాభాలు 10 కోట్ల రూ॥ల కంటే తక్కువగా వున్న సంస్థల మీద పన్ను రేటు అధికంగా వుంటుంది. గుత్త పెట్టబడులను వెతికి వెతికి రాయితీలు, పన్ను మినహాయింపులు ఇవ్వటం కేంద్ర బడ్జెట్‌లో స్పష్టంగానే వున్నది. ఇటీవలి కాలంలో నీలాంచల్ ఇస్పత్ నిగమ్ లిమిటెడ్‌కు వ్యూహాత్మక భాగస్వామిని గుర్తించామని, ఎయిర్ ఇండియాను ప్రైవేటుకు బదిలీ చేసామని ప్రభుత్వం గర్వంగా చెప్పుకున్నది. 36 లక్షల కోట్ల రూ॥ల ఆస్తులతో, 40 కోట్ల మంది పాలసీదారులతో ప్రభుత్వానికి 30 కోట్ల రూ॥ల డివిడెంట్‌ను చెల్లించిన జీవిత బీమా సంస్థను ప్రైవేటీకరించే ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వరంగ సంస్థలను త్వరత్వరగా ప్రైవేటీ కరించాలని నీతీ ఆయోగ్ సూచిస్తున్నది. ప్రభుత్వ/ప్రజల సంపదను త్వరత్వరగా గుత్త పెట్టుబడులకు అప్పజెప్పాలి. వీటన్నింటి ఫలితంగా స్థూల జాతీయాదాయానికి ప్రైవేటు సంపద నిష్పత్తి 1980లో 290 శాతం వుండగా, 2020లో అది 560 శాతానికి పెరిగింది.

ఆదాయ, సంపద పంపిణీలలో అసమానతలు తీవ్రమైనాయి. ప్రపంచ కుబేరులలో స్థానం సంపాదించుకున్న మన కుబేరుల ఆదాయం కోవిడ్ విపత్తు రెండేళ్లలో రోజుకి 10,400 కోట్ల రూ॥లు, సెకనుకు 1 లక్ష 20 వేల రూపాయలు. IIFL వెల్త్ హ్యూరన్ ఇండియా రిచ్ లిస్ట్ ప్రకారం ఆగస్టు, 2022 నాటికి 1000 కోట్ల రూ॥లకు పైగా ఆస్తి కలిగిన సంపన్నులు 1,103 మంది. వాళ్ళ మొత్తం ఆస్తి విలువ 100 లక్షల కోట్ల రూ॥లు కాగా, మెజారిటీ ప్రజల ఆకలి సమస్య తీవ్రం అయింది. పేదలు ఆకలితో అల్లాడే పరిస్థితి పెరిగితేనే వారికి లాభాలు పెరుగుతున్నాయన్నది స్పష్టం.

దేశ ప్రజల సంపదను గుత్త పెట్టుబడులకు అప్పజెప్పటంలో నవ కల్పనలు :

లీజు పేరుతో మౌలిక సదుపాయాలను గుత్త పెట్టుబడులకు అప్పచెప్పే ప్రక్రియను 'ఆస్తుల నగదీకరణ' అంటూ ఆగస్టు 23, 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇదొక నవకల్పనగా ప్రచారం అయింది. నిజానికి ఈ ప్రక్రియకు 2014లో ఏర్పాటు చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టుతో పునాదులు పడ్డాయి. 2015లో ఆస్తుల నగదీకరణను కేల్కర్ కమిటీ సూచించడంతో సైద్ధాంతిక ప్రాతిపదికలు ఏర్పరచుకున్నారు. 2019లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టు ఏర్పాటయింది. ఈ రెండు ట్రస్టులు షేర్ల ద్వారా నిధులను సమీకరించుకొని మౌలిక సదుపాయాలను తీసుకుంటాయి. ఇవి జూలై, 2021 నాటికి సమీకరించిన నిధులు 80 వేల కోట్ల రూపాయలు. ఈ ట్రస్టులకు క్యాపిటల్ గెయిన్ పన్ను మినహాయింపు వున్నది. దివాళాకు ఆప్షన్ వున్నది. ఈ ట్రస్టులకు సేఫ్టీ, లాభాలకు గ్యారెంటీ ఉండాలన్నదే ప్రభుత్వాల లక్ష్యం. అంతే కాకుండా మౌలిక సదుపాయాలను

లీజుకి ఇచ్చే ప్రక్రియ 2006 లోనే ఆపరేట్ - మెయింటైన్ - డెవలప్ పేరుతో ఢిల్లీ, ముంబై ఎయిర్‌పోర్టులను 30 సంవత్సరాలకు లీజుకి ఇచ్చారు. మొదటి విడతగా 2021-25 మధ్య కాలంలో గబగబా ఆకర్షణీయంగా వున్న మౌలిక సదుపాయాలను గుర్తించి 30 సంవత్సరాల లీజుకు ఇవ్వటం ద్వారా 6 లక్షల కోట్ల రూ॥లను రాబట్టాలన్నది లక్ష్యం.

ప్రభుత్వం అప్పులు చేసి గ్రీన్ ఫీల్డ్ మౌలిక సదుపాయాలను నిర్మిస్తుంది. అప్పుడు అవి బ్రౌన్ ఫీల్డ్ ఆస్తులు అవుతాయి. వాటిని కార్పొరేట్ శక్తులకు లీజుకు ఇస్తుంది. 2019-25 మధ్యకాలంలో 11 లక్షల కోట్ల రూపాయల మౌలిక సదుపాయాలను నిర్మించాలన్నది జాతీయ మౌలిక సదుపాయాల పైప్‌లైన్ లక్ష్యం. 2016-40 మధ్య 8 వందల లక్షల కోట్ల రూపాయల విలువగల గ్లోబల్ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించాలని, అందులో 50 శాతం వాటా ఇండియాదేనని చెప్పిన గ్లోబల్ ఇన్‌ఫ్రా అవుట్‌లుక్ - 2017లో భాగంగానే ఆస్తుల నగదీకరణ కార్యక్రమం మొదలైంది. రోడ్లు, పవర్ జనరేషన్, ట్రాన్స్‌మిషన్, ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాలు, టెలికాం టవర్లు, రైల్వే స్టేషన్లు, ట్రాక్‌లు, సహజ వాయువు పైప్‌లైన్లు, పెట్రోలియం పైప్‌లైన్లు, గిడ్డంగులు, స్టేడియంలు, మొదలగునవన్నీ మౌలిక సదుపాయాలే. వీటితోపాటు కేంద్ర ప్రభుత్వ భూమి 72 పార్శిళ్లుగా, 15,531 చదరపు కిలోమీటర్లు వున్నదని, అందులో మూడవ వంతు వృథాగా వున్నదని, ఆ భూమిని అద్దెకివ్వాలి అన్న నిర్ణయం తీసుకున్నారు. డ్రోన్ సర్వేల ద్వారా గ్రామాలలో కామన్ ల్యాండ్‌ను గుర్తిస్తున్నారు. ఇకముందు మనదేశంలో సమిష్టి ఆస్తి వనరులు - భూమి కానీ, అడవులు కానీ, ఖనిజ సంపద కానీ ఏవీ ఉండవిక. కడు దరిద్రంతో ప్లాట్‌ఫారాల మీద వున్న బతుకులు, రోడ్లమీద, రైళ్లలో చిల్లర వ్యాపారంతో బ్రతుకుతున్న కోట్లాది ప్రజల జీవితాలు, జీవనోపాధులు ఏమవుతాయి? ఇంకా నికృష్ట స్థితిలోకి వాళ్లను నెడుతుంది. గుత్త పెట్టుబడులకు ఆస్తులను అప్పగించడం వల్ల ప్రభుత్వ ఋణం తగ్గదు కదా! స్థూలదేశీయోత్పత్తిలో ప్రభుత్వ ఋణం నిష్పత్తి 61.7 శాతంగా వుంది.

రూపాయి విలువ తగ్గుదల -సామాన్య జనంపై భారం :

క్రమంగా రూపాయి మారకం రేటు తగ్గుతూనే వున్నది. ప్రస్తుతం ఒక అమెరికన్ డాలర్‌కు 80 రూపాయలు పైననే ఉన్నది. చాలా దేశాలకు మన చెల్లింపులు డాలర్లలోనే వుంటాయి. కాబట్టి చెల్లింపు భారం పెరుగుతుంది. మన ఎగుమతుల డిమాండ్ వ్యాకోచత్వం తక్కువ. ధర తగ్గినా డిమాండు పెరగదు. కానీ అవే డాలర్లకు ఎక్కువ మొత్తంలో వస్తువులను ఇవ్వాలి. ఇది మనపై శ్రమ దోపిడీని తీవ్రం చేస్తుంది. మన దిగుమతుల స్వభావం అవ్యాకోచత్వ డిమాండు, ధర పెరిగినా డిమాండు తగ్గదు. మన కరెన్సీ మారకం రేటు క్షీణించడం వల్ల ఒకవైపు శ్రమదోపిడీ తీవ్రమవుతుంది, మరొకవైపు ధరలు కూడా పెరుగుతాయి. సామాన్య ప్రజల బ్రతుకు మరింత దుర్భరం అవుతుంది. పైగా విదేశీ మారక కరెంట్ అకౌంట్‌లో లోటు నిరంతరాయంగా పెరుగుతూనే వుంటుంది. దీనికి పరిష్కారంగా ప్రపంచబ్యాంకు ఎగుమతి ఆధారిత విధానాన్ని అనుసరించాలని ఒత్తిడి చేస్తుంది. శ్రమదోపిడీ తీవ్రత మరింత పెరుగుతుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి, దేశం నుంచి పారిపోకుండా నిలుపుకోవడానికి మరిన్ని రాయితీలు, ప్రోత్సాహకాలు, చట్ట సవరణలు చేశారు. ఫలితంగా మన ఆర్థిక వ్యవస్థ మొత్తంగా గుత్త పెట్టుబడుల గుప్పిట్లో వుంటుంది. విదేశాలలో కార్పొరేట్ శక్తుల అవసరాలకు అనుగుణంగా మన యువత నైపుణ్యాలు నేర్చుకొని, ఆయా దేశాలకు వలస వెళ్లాలని ప్రభుత్వ లక్ష్యం. దీనివల్ల మనదేశ అవసరాల కోసం మన యువత నైపుణ్యాలు ఉండాలన్న భావన పూర్తిగా అభావమవుతుంది.

కరెన్సీ మారకం రేటును, ధరలను, విదేశీ రుణాలను, విదేశీ పెట్టుబడులను అదుపు చేయగల శక్తి ఏ వర్ధమాన దేశానికి, భారత దేశానికి కూడా వుండదు. గ్లోబల్ వాణిజ్యంలో 80 శాతం, రిజర్వులో 65 శాతం, ఫారెక్స్ వ్యాపారంలో 90 శాతం వాటాను కలిగి ఉన్న అమెరికన్ డాలర్‌కు డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది. సప్లైలో 65 శాతం ఇతర దేశాలలో చలామణి అవుతుంది. అందుకే అది గ్లోబల్ కరెన్సీ.

IOU అంటూ ఏ మొత్తంలోనైనా డాలర్లను ప్రింట్ చేసి అమెరికా తన మిలటరీ వ్యయాన్ని, ఉత్పత్తులను పెంచుకుంటుంది. ప్రపంచంలో యుద్ధాలను రెచ్చగొడుతుంది. యుద్ధ భయాన్ని సృష్టిస్తుంది. ఆంక్షలను విధిస్తుంది. వడ్డీ లేకుండా తమ దేశాల కార్పొరేట్ శక్తులకు అప్పులనిస్తుంది. IMF, IBRDలను గుప్పెట్లో పెట్టుకుంటుంది. ఎన్నో ఆంక్షలతో వర్ధమాన దేశాలకు అప్పులిచ్చి అప్పుల ఊబిలోకి నెడుతుంది. అమెరికాలో వడ్డీ రేటు మనదేశంలోని విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని నిర్ణయిస్తుంది. అక్కడ వడ్డీ రేటు పెరిగితే మన దేశంలో ఉన్న విదేశీ పెట్టుబడులు కట్టకట్టుకుని అమెరికాకు తరలి వెళ్తాయి. దీని దుష్ప్రభావం మన ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రంగా ఉంటుంది. వాటిని నిలుపుకోవడానికి ఇచ్చే అదనపు రాయితీల వల్ల మనదేశంలో శ్రమదోపిడీ, పర్యావరణ దోపిడీ తీవ్రం అవుతూనే ఉంటాయి.

విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడి (FPI) అనిశ్చితి వల్ల మన స్పెక్యులేషన్ మార్కెట్‌లో తీవ్రమైన ఒడిదుడుకులు వస్తుంటాయి. ప్రస్తుతం మన దేశ పొదుపులో అధికభాగం ఈ మార్కెట్లలోనే వుంటున్నది కాబట్టి ఒడిదుడుకుల ప్రభావం జనం మీద తీవ్రంగా వుంటుంది. అమెరికా డిపాజిట్లను అందరూ ఎగబడి కొంటారు. విదేశీ పెట్టుబడులు ఎప్పుడైనా ఉనికిలో ఉన్న సంస్థలనే కొంటాయి. దీనివల్ల కొత్త పరిశ్రమల స్థాపన జరగదు. దేశీయ పెట్టుబడిని తరిమి వేస్తుంది. ఫైనాన్స్ పెట్టుబడి మన వ్యవస్థను శాసిస్తుంది. మన కరెన్సీ విలువ ఎప్పటికీ పెరగదు. పకడ్బందీ అధీన వ్యవస్థగా రూపొందుతుంది.

పెట్టుబడిదారీవ్యవస్థ ఉన్నత దశే సామ్రాజ్యవాదం అనుకుంటే అది ఇంకా, ఇంకా బలపడినప్పుడు ఫైనాన్స్ మూలధనం ఆధిపత్యం ఇప్పుడున్నట్టు పరాకాష్ట దశలో ఉంటుంది. ఈ అంశాన్ని 1916 లోనే లెనిన్ 'ఇంపీరియలిజం - ది హయ్యెస్ట్ స్టేజ్ ఆఫ్ కాపిటలిజం'లో స్పష్టంగా చెప్పారు. సి.టి కురియన్ ప్రకారం 1990 నాటికే 90 శాతం ఫైనాన్షియల్ లావాదేవీలకు వస్తు సేవలతో సంబంధమే లేదు. అందువల్లనే 2021లో గ్లోబల్ ఫారెక్స్ మార్కెట్ విలువ 1920 కోట్ల లక్షల కోట్ల రూపాయలు.

మనదేశంలో, అసలు వర్ధమాన దేశాలలో ప్రజల జీవన విధ్వంసం, నిరుద్యోగిత, పేదరికం, ద్రవ్యోల్బణం, తగ్గుతున్న కరెన్సీ విలువ అన్నింటిని నిర్ణయించేది లెవియథాన్ ఆకారంలో ఉన్న ఫైనాన్స్ క్యాపిటల్, కొనసాగుతున్న సామ్రాజ్యవాద దోపిడీ, అందుకు నయా ఉదారవాద విధానాల ద్వారా మన ప్రభుత్వం అందిస్తున్న బలమైన మద్దతు. ఈ కారణాలతో మెజారిటీ ప్రజల జీవితాలే అభావం అవుతున్నాయి. అందుకే ఈ దోపిడీ క్రమాన్ని అభావం చేయాలి. అదే నెగేషన్ ఆఫ్ నెగేషన్ అనే దోపిడీ రూపాన్ని రద్దుచేసుకునే గతితార్కిక సూత్రం. అందరూ గౌరవంగా, హుందాగా జీవించగల పరిస్థితుల కోసం వ్యవస్థలో నిజమైన విప్లవ శక్తులు సంఘటితంగా బలమైన పోరాటాలను నిర్మించాలి. దోపిడీ వ్యవస్థను అంతమొందించాలి. ఇందుకు దగ్గర దారి లేదు. పోరాట మార్గం జటిలంగా, సంక్లిష్టంగా ఉంటుంది. అయినా మరొక ప్రత్యామ్నాయ మార్గం లేదు. ★

భారతదేశ అర్ధవలస, అర్ధభూస్వామ్య రాజ్య స్వభావం సామాజికార్థిక రాజకీయ విశ్లేషణ

*(ఈ పత్రాన్ని రెండేళ్ళ క్రితం సిపిఐ (ఎం-ఎల్) కామ్రేడ్ ఒకరు రాసారు. దీన్ని ఉపయోగకరమైన మంచి ప్రయత్నంగా మేము భావిస్తున్నాము. కా॥ తరిమెల నాగిరెడ్డి ప్రసిద్ధ పుస్తకం 'తాకట్టులో భారతదేశం' మరియు కొన్ని సర్వేల నివేదికల నుంచి సేకరించిన వివిధ వాస్తవాలు, గణాంకాలు, విశ్లేషణలను సంక్షిప్తీకరించి ఈ పత్రం రాసారు. **2022** జూలై సంచికలో ఒకటవ భాగం, ఆగస్టు సంచికలో రెండవ భాగం, సెప్టెంబర్‌లో సంచికలో మూడవ భాగం ప్రచురించాం. ఇది నాల్గవ భాగం.)*

(ఎఫ్) భూస్వామ్యము-భూసంస్కరణలు

భారతదేశం గ్రామాల సముదాయంతో కూడిన ఒక ఖండం. జనాభాలో 80%కు పైగా గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్నారు. ఈ జనాభాలో 70% ప్రత్యక్షంగా వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారు. గ్రామీణ ప్రజల పేదరికం దేశ పారిశ్రామికాభివృద్ధికి పెద్ద ఆటంకంగా ఉంది. పారిశ్రామికాభివృద్ధికి దేశీయ మార్కెట్ అభివృద్ధి కావడం ఒక ప్రాథమిక అంశం. ఈ ప్రాథమిక కారణం వల్లనే బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలన్నీ ప్రాథమికంగా ఫ్యూడల్ వ్యతిరేక వ్యవసాయక విప్లవాలుగా ఉంటాయి. సామ్రాజ్యవాద కాలంలో ఏ విముక్తి విప్లవమైనా అది ఏకకాలంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక విప్లవమైతే తప్ప సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ప్రజాతంత్ర కర్తవ్యాలను నిర్వహించలేదు. అలాంటి సమగ్ర జాతీయ విముక్తి యుద్ధానికి బూర్జువావర్గం నాయకత్వం వహించజాలదని మనం ఇంతకు ముందే గమనించాము.

ప్రారంభకాలం నుండీ భారత బూర్జువా వర్గం ఫ్యూడల్ శక్తులతో సన్నిహితంగా ముడిపడి వుంటూ వచ్చింది. బిర్లాలాంటి అనేక కుటుంబాలకు స్వంతంగా విస్తారమైన వ్యవసాయ క్షేత్రాలున్నాయి. తమ పారిశ్రామికాభివృద్ధి ప్రారంభకాలం నుండీ టాటా లాంటి అనేక పారిశ్రామిక కుటుంబాలకు ఫ్యూడల్ సంస్థానాధీశులతో సన్నిహిత సంబంధాలున్నాయి. జాతీయోద్యమానికి నాయకత్వం వహించిన వల్లభాయ్ పటేల్, రాజేంద్రప్రసాద్ లాంటి జాతీయ నాయకులు భూస్వామ్యవర్గం నుండి వచ్చినవారే. రాష్ట్రాలలోని నాయకత్వానికి భూస్వామ్య వర్గంతో మరింత సన్నిహిత సంబంధాలున్నాయి. దీని పర్యవసానంగానే జాతీయ కాంగ్రెస్ భూసంస్కరణల గురించి (తరచుగా) చిలక పలుకులు వల్లించినప్పటికీ అవి ప్రధానంగా అతివాదశక్తుల ప్రభావాన్ని చెల్లాచెదురు చేయటానికే ఉద్దేశించబడ్డాయి. అంతేగాని జాతీయ పోరాటంలోకి రైతాంగాన్ని సమీకరించటం గురించి జాతీయ కాంగ్రెస్‌కి ఎప్పుడూ ఆసక్తి లేదు. సంస్థానాలలో నిత్యమూ అభివృద్ధి చెందుతున్న ప్రజాపోరాటాలను జాతీయ కాంగ్రెస్ ప్రారంభం నుండీ అవహేళన చేస్తూ నిందిస్తూ ఉండేది.

ఈ నాయకత్వం ఫ్యూడల్ వ్యతిరేక సంస్కరణలను కొంతైనా అమలు జరుపుతుందని ఆశించడం ఒట్టి అవివేకం మాత్రమే. జమీందారీ విధానం రద్దు కోసం తీసుకొన్న చర్యలు కూడా ఒట్టి కన్నీటితుడుపే. 'ఏషియన్ డ్రామా' అనే తన గ్రంథంలో గున్నార్ మిర్డాల్ వివరించినట్లుగా ఈ "చర్యలు ఆస్తి సంబంధాలలో ఎలాంటి మౌలిక మార్పునూ తీసుకొని వచ్చాయని చెప్పటానికి వీలులేదు. జమీందారీ విధానం రద్దువల్ల ఈ దళారీలకు ఆదాయపు వనరులలో మార్పు మాత్రమే జరిగింది. ప్రత్యేకించి పెద్ద ఆదాయాలుగల జమీందారులకు మాత్రం ఆదాయం పరిమాణం కొంత తగ్గింది". ఈ సంస్కరణల వలన దళారీలకు మాత్రమే కొంత నష్టం వాటిల్లింది. అంతేగాని భారతదేశంలో అపరిమితమైన యాజమాన్యపు హక్కులు కల్గిన భూస్వాములను ఈ సంస్కరణలు అసలు ముట్టుకోనేలేదు. 'స్వంత భూఖండాలు' అనే పేరిట సాధ్యమైనంత భూమిని ఈ ఫ్యూడల్ భూస్వాములు ఉంచుకోడానికి అనుమతించబడింది. "సిర్‌ఖుద్‌కష్ (అంటే స్వంత సాగు) కలిగిఉండే హక్కును జమీందార్లు "స్వంత సేద్యం" పేరు చెప్పి పెద్ద ఎత్తున ఆ భూములపై ఆక్రమణ కౌలుదార్లను (occupancy tenants) బేదఖలు చేయడానికే వినియోగించుకున్నారు. ఇటీవలి మాసాలలో లక్షలాది ఎకరాల భూమి ఈవిధంగా జమీందార్ల హస్తగతమైంది." (హర్షదేవ్ మాలవీయ - భారతదేశంలో భూసంస్కరణలు -పేజి 452). ఈ భూములపై ఉపకౌలుదార్లుగా ఉన్నవారికి (వీరే అసలు కౌలుదార్లు)-అంటే అసలు భూమి దున్నేవారికి ఈ చట్టం వలన ఏమీ ప్రయోజనం కలగకపోగా అత్యధిక సందర్భాలలో అసలు భూముల నుండే వీరు నెట్టబడ్డారు. ఈ విధంగా "స్వంత సేద్యం" పేరిట జమీందారులు భూములను హస్తగతం చేసుకోవటంతో ఈ భూములపై ఆధారపడిన అసంఖ్యాకమైన సాగుదార్లు - చివరికి మధ్యతరగతి రైతు వర్గానికి చెందిన వారు కూడా సామాజికంగా, ఆర్థికంగా కృంగిపోయారు. బేదఖళ్ళ మూలంగా వీరిలో చాలామంది వ్యవసాయ కూలీలుగా దిగజారిపోయారు.

ఆ విధంగా జమీందారీలను రద్దు చేయడం వలన ప్రధానంగా భారతదేశపు సామాజిక ఆర్థిక పునాదిలో ఎలాంటి ప్రాథమిక మార్పులూ సంభవించలేదని స్పష్టమవుతోంది. గున్నార్ మిర్డాల్ చెప్పినట్లు "మోటుగా చెప్పాలంటే భారత పాకిస్తాన్‌లలో దళారీల రద్దుకోసం తీసుకొన్న చర్యలు వాస్తవంగా దున్నేవానికే భూమి ఇవ్వడానికి ఏ మాత్రం ఉద్దేశించబడినవి కావు. **(పేజి-1309)**

భూసంస్కరణల చట్టాలు

ఫ్యూడల్ భూమి సంబంధాలు స్వదేశీ మార్కెట్టు అభివృద్ధిని ఆటంకపరుస్తాయి. కాగా బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో భూసంస్కరణలు సరుకుల ఉత్పత్తిని, వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలను త్వరితపరుస్తాయి; వినియోగ పడతాయి.

బానిసత్వం, వెట్టిచాకిరీ, ధాన్యం రూపంలో కూలీ చెల్లింపు, శాశ్వత చాకిరీ, కూలీలు తమకు పూర్తిగా లోబడి ఉండేటట్లుగా అత్యధిక ధరలకు తిండి గింజలను అప్పుపెట్టటం ఇలాంటి అనేక రూపాలతో కూడిన కౌలుదారీ వ్యవసాయ పద్ధతులు, మధ్యయుగాలనాటి భూస్వామ్య విధానపు పద్ధతులు అసంఖ్యాకంగా నేటికీ భారతదేశమంతటా అమలులో ఉన్నాయి. ఈ ఫ్యూడల్ దోపిడీ క్రింద చితికిపోతున్న రైతాంగ ప్రజానీకం శిథిలమైపోతున్నది.

సాధారణంగా 10 శాతంగా ఉన్న భూస్వాముల చేతులలో పెద్దయెత్తున కేంద్రీకృతమై ఉన్న భూముల్ని స్వాధీనం చేసుకొని; ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయగల, స్వేచ్ఛగా కష్టపడి పనిచేయగల రైతాంగాన్ని, ఫ్యూడల్ భూస్వాముల మధ్య యుగాలనాటి దోపిడీ రూపాలనుంచి పూర్తిగా విముక్తి అయిన, వ్యవసాయాభివృద్ధిని పెంపొందించగల రైతాంగాన్ని సృష్టించటమే భారతదేశంలో భూసంస్కరణల సారాంశంగా ఉండాలి. అందువలన, పెద్ద పెద్ద ఎస్టేట్ల క్రిందున్న భూములు, వీటితోపాటుగా దేవాలయాల క్రింద, ట్రస్టుల క్రింద, పంచదార ఫ్యాక్టరీలు లాంటి పరిశ్రమల క్రింద ఉన్న భూములు భూపంపకానికి ప్రాతిపదికగా ఉంటాయి.

లెనిన్ వివరించినట్లుగా, "వర్తమానం నుంచి భవిష్యత్తును వేరుచేసేది యాజమాన్యం విషయంలో పోల్చటానికి వీలులేనంతగా ఏర్పడే మరింత 'సమానత్వం', నూతన భూమి పంపిణీ మరింతగా 'శ్రమసూత్రం'కి అనుగుణంగా ఉంటుంది. అయితే ఇది యాదృచ్ఛికం కాదు. రైతాంగ దేశంలో ఇంతకన్నా భిన్నంగా ఉండజాలదు; బూర్జువా అభివృద్ధి దీనిని అర్ధబానిసత్వం నుండి విముక్తి చేస్తుంది". పాత నిరంకుశ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ప్రత్యేకించి పాతఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో సమానత్వ భావన అత్యంత విప్లవకరమైన భావనగా ఉంటుంది". అందువలన భారతదేశంలో ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి ప్రత్యక్షంగా అత్యంత ఆటంకంగానున్న ఫ్యూడల్ భూస్వామ్య విధానాన్ని పూర్తిగా ధ్వంసం చేయటమే మన పోరాటానికి ఇరుసుగా ఉంటుంది.

భారతదేశంలో పాలకవర్గాలు అమలు చేస్తున్న భూసంస్కరణలు ఈ లక్షణానికి ఏ మాత్రమైనా అనుగుణంగా ఉన్నాయా? సహజంగానే అలాలేవు. భూసంస్కరణల గురించి రాజకీయ నాయకత్వం అస్పష్టమైన రీతిలో పదేపదే వల్లించినప్పటికీ, అవి భూస్వామ్య విధానాన్ని బద్దలుకొట్టేవిగా లేవు. యుద్ధానంతర కాల రైతాంగ తిరుగుబాట్ల వెల్లువలో ఆ తిరుగుబాట్లను రక్తపుటేరుల్లో ముంచెత్తటానికి అత్యంత తీవ్రమైన అణచివేత పద్ధతులు అవలంబించటంతోపాటుగా, భూములపై గరిష్ట పరిమితి విధించటం గురించి, "దున్నేవానికే భూమి"ని పంపిణీ చేయటం గురించి బూర్జువా వర్గం, దాని ప్రభుత్వం ప్రచారం చేశాయి. పోరాటం సాగిస్తున్న ప్రజానీకాన్ని ప్రక్కదారులు పట్టించటానికి, రక్తపుటేరుల్లో ముంచటానికీ "ప్రలోభ, దండనోపాయాలతో కూడిన విధానాన్ని అనుసరించారు. భూసంస్కరణల కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి. ఆ కమిటీల నివేదికలు ప్రచురించి చర్చించారు. తీర్మానాలు ఆమోదించారు. ఇవన్నీ గ్రామీణ ప్రజానీకం చేస్తున్న ఆందోళనలను తాత్కాలికంగా ఆపుచేయడానికి మాత్రమే పాలకపార్టీ తన వాగ్దానాల ద్వారా రైతాంగాన్ని నమ్మించి, వారిని ఆందోళన నుంచి ప్రక్కదారి పట్టించి, తద్వారా రైతాంగం యొక్క తీవ్రమైన ఆగ్రహాన్నుండి గ్రామీణ భూస్వాములను రక్షించడానికే ప్రధానంగా ఈ చర్యలన్నీ తీసుకున్నది. చివరికి భూగరిష్ట పరిమితి చట్టాలు వచ్చాయి.

అయితే ఈ భూగరిష్ట పరిమితి చట్టాలలో పచ్చికబయళ్లను, తోట భూములను, చెరకు తదితర వ్యాపార పంటల క్రింద ఉన్న భూములను, యంత్రాలతో సాగుచేయబడుతున్న భూములను ఇంకా తదితరమైన భూములను మినహాయించి ఒక్కొక్క కుటుంబానికి ఉండదగు భూగరిష్ట పరిమితి చాలా హెచ్చుస్థాయిలో నిర్ణయించారు. అంటే ప్రభుత్వానికి ఈ చట్టాన్ని అమలుపర్చవలసిన అవసరమే కలుగని విధంగా ఈ చట్టం రూపొందించబడింది.

భూచట్టాలను సమగ్రంగా ఇక్కడ పరిశీలించక పోయినప్పటికీ కొన్ని ముఖ్యాంశాలను మాత్రం అర్థం చేసుకోవటం చాలా అవసరం. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలను పరిశీలిద్దాం.

ఢిల్లీ నుండి వెలువడుతున్న 'మెయిన్‌స్ట్రీమ్' ఇంగ్లీషు వారపత్రికలో ఒక రచయిత ఆంధ్రప్రదేశ్ గరిష్ట పరిమితి క్లాజులను పరిశీలిస్తూ ఇలా వ్రాశాడు:

"భూసారాన్ని బట్టి 6 నుంచి 12 ఎకరాల వరకు మాగాణి భూమిని ఒక కుటుంబ కమతంగా నిర్ణయించారు. ఈ కుటుంబ కమతానికి 6 రెట్లు భూమిని గరిష్ట పరిమితిగా నిర్ణయించారు. వారసత్వ చట్టం ప్రకారం కుటుంబంలోని ప్రతివ్యక్తిని ఒక కుటుంబంగా పరిగణించటం వలన, ఐదుగురు సభ్యులు గల కుటుంబానికి గరిష్టపరిమితిగా 180 నుండి 360 ఎకరాల మాగాణి భూమిని ఉంచుకోవచ్చు. మెట్టభూములకు సంబంధించి ఈ గరిష్ట పరిమితి 1080 నుండి 2160 ఎకరాల వరకు ఉండవచ్చు. అన్ని దేవాలయ భూములు, చెరకు, కాఫీ, తేయాకు, రబ్బరు తదితర తోటల క్రింద ఉంటూ ఫ్యాక్టరీలకు అనుబంధించబడిన భూములు ఈ గరిష్ట పరిమిత చట్టం నుండి మినహాయించబడ్డాయి". **(మెయిన్‌స్ట్రీమ్-1970 ఫిబ్రవరి 28)**

గున్నార్ మిర్థాల్ వ్యాఖ్యానించినట్లుగా నిజమైన అర్థంలో రాజకీయ కార్యకలాపాలు కొద్దిభాగంగానున్న పై వర్గాలకు మాత్రమే పరిమితమై ఉన్నాయనే వాస్తవాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు మేలిముసుగు మరుగుపర్చజాలదు". **(ఏషియన్ డ్రామా-పేజి 776)**

రాజకీయ ప్రజాస్వామ్యం మేలిముసుగు క్రింద చలామణి అవుతున్న ఈ భూసంస్కరణల తతంగం "ప్రజల ముందు ప్రదర్శనకు మాత్రమే వినియోగపడే నిరుపయోగమైన చట్టం తప్ప వేరు కాదు". **(ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ-1960 మార్చి 19)**

చట్టపు బూటకత్వాన్ని తెలియజేయడానికి భూపరిమితి చట్టంలోని ఈ ఒక్క క్లాజు చాలు.

అంతేగాక పై వర్గాలకు ప్రాతినిధ్యం వహించే పరిపాలనా యంత్రాంగంలోని అధికారులు "ఈ చట్టం అమలు పరచటానికి ఉద్దేశించబడినది కాదనే పద్ధతిలో (లాడిజిన్‌స్కీ మాటలివి) వ్యవహ రిస్తారని", "రెవిన్యూ అధికారులు అనాలోచితంగానే వ్యతిరేక దృక్పథం అనుసరిస్తున్నారని" ప్లానింగ్ కమీషన్ నియమించిన భూసంస్కరణల సంఘం చెప్పున్నది.

కనీసం కౌలుదారీ చట్టమైనా ఇంతకన్నా మెరుగ్గా ఉందా? కౌలుదారీ చట్టం గురించి

స్వయంగా ప్లానింగ్ కమీషన్ తన నివేదికలో ఇలా చెప్పవలసి వచ్చింది:

"ఈ చట్టంలో నిర్వహించబడిన విధంగా తమ హక్కులను రక్షించుకోగోరిన కౌలుదార్లకు నిరాఘాటంగా ఉద్వాసన చెప్పేందుకు ఈ చట్టం అనుమతించింది. ఆ విధంగా ఈ చట్టం తమకిచ్చిన హక్కుల గురించి ఉదాసీన వైఖరి వహించే పరిస్థితికి కౌలుదార్లను నెట్టివేసింది. మరోవైపు కౌలు చెల్లించడంలో ఏ కొద్దిపాటి ఆలస్యం జరిగినా కౌలుదార్లను భూముల నుండి వెళ్ళగొట్టడానికి భూస్వాములకు ఈ చట్టం అవకాశమిచ్చింది. అందువలన భారీ ఎత్తున కౌలుదార్లు వెళ్ళగొట్టబడుచున్నారు. కౌలుదార్లయినా సాహసించి న్యాయంకోసం కోర్టులకు వెళితే తగిన రికార్డులు లేకపోవడం వలన, వాటిని పరిశీలించే యంత్రాంగం లేకపోవటం వలన కౌలుదారు, భూస్వామి సంబంధాన్ని నిర్ణయించడానికి కోర్టుకి కూడా కష్టమైంది". ఈ విధంగా చట్టంలోని అంశాలు నిరుపయోగం చేయబడ్డాయి. తత్ఫలితంగా కోరుకున్న మార్పులు సాధించ బడలేదు".

పైన క్లుప్తంగా పరిశీలించిన ఈ రెండు చట్టాల నిష్ప్రయోజకత ప్రభుత్వానికి సైతం పూర్తిగా తెలుసు. అలాంటప్పుడు దేశంలో గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయరంగంలో పెరుగుతున్న అసంతృప్తి యొక్క ఉధృతిని చూసి ఆశ్చర్యపడడం ఎందుకు? అందువల్లనే దేశవ్యాపితంగా గ్రామీణ ప్రాంతాలలో ఈనాడు ఉద్రిక్తతలు, సాయుధ సంఘర్షణలు సర్వసామాన్యమైపోయాయి. దేశమంతటా భూమి తగాదాల సందర్భంగా గ్రామాలలో హరిజనులను హత్యచేయడం నిత్యకృత్యమైపోయింది. ఇలాంటి సంఘటనలను చాలా అరుదుగా మాత్రమే ప్రచురించే దినపత్రికల్లో సైతం ఇవి చాలా మామూలు వార్తలైపోయాయి. పంచాయితీరాజ్ సంస్థలు ప్రారంభమయ్యాక గ్రామస్థాయిలలో సైతం రూపొందిన రాజకీయాధికారం ద్వారా తమ ఆర్థికపెత్తనాన్ని సుస్థిరం చేసుకోవడం వల్ల, గ్రామీణ జీవితంపై బడా భూస్వాముల పట్టు మరింత బలపడింది.

భూస్వామ్య పునాదిని బలీయం చేస్తున్న భారత బడాబూర్జువా భూస్వామ్య ప్రభుత్వం

ప్రభుత్వం అమలుచేసిన ప్రతి నిర్దిష్ట చర్యా గ్రామీణ ప్రాంతాలలో భూస్వామ్య విధాన పునాదిని బలీయం చేయడానికే వినియోగపడింది.

గ్రామీణ దృశ్యాన్ని పరివర్తన చేసే కార్యక్రమంలో ప్రభుత్వం ప్రప్రథమ చర్యగా 1950 దశాబ్దపు మొదటి సంవత్సరాలలో "కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు" (సమాజ వికాస అభివృద్ధి పథకం) అనే చారిత్రాత్మక పథకాన్నొకదాన్ని అమలు చేసింది. దీన్నే జవహర్‌లాల్ నెహ్రూ విప్లవాత్మక చర్యగా వర్ణించాడు. "పంచవర్ష ప్రణాళికలను విజయవంతంగా అమలు చేయడానికి చోదక శక్తిని అందించే డైనమో అని నెహ్రూ కీర్తించిన ఈ సమాజ వికాస పథకం అత్యుత్సాహంతో పెద్ద అట్టహాసంతో ప్రారంభించబడింది. ఈ పథకం క్రింద రహదార్ల నిర్మాణం, చిన్ననీటి పారుదల వసతులు, ప్రాథమిక విద్య, రుణ వసతులు కల్పించే సహకార సంఘాల అభివృద్ధి తీవ్రతరం చేయబడింది. అయితే "వీటి ఫలితాలు విస్తృత ప్రజా బాహుళ్యానికి మాత్రంకాక భూస్వామ్య వర్గానికి, వడ్డీ వ్యాపారస్తులకు మాత్రమే దక్కాయి" (ఏషియన్ డ్రామా-పేజి 871). భూమిని గరిష్ట స్థాయి మేరకు వినియోగంలోకి తేవడానికీ, మరిన్ని ఫలితాలను సాధించడానికి వ్యవసాయదారుల వనరుల అభివృద్ధి కొరకూ సహకారోద్యమానికి హెచ్చు ప్రాధాన్యత ఇవ్వబడింది. అయితే ఈ సహకారోద్యమం సైతం భూస్వామ్య ఆర్థికవ్యవస్థను బలీయం చేయడానికే వినియోగపడింది.

"క్వయట్ క్రైసిస్ ఇన్ ఇండియా" (భారతదేశంలో నిశ్శబ్ద సంక్షోభం) అనే తన గ్రంధంలో శ్రీ కాన్ లూయిస్ ఇలా వ్రాశాడు:

"చివరికి ఫలితం సాధారణంగానూ, స్పష్టంగాను ఇలా ఉండి గ్రామీణ సహకార సంఘాలను ఇప్పటికే చాలా వరకు సాంప్రదాయకంగా వడ్డీవ్యాపారం, వ్యాపారం చేస్తూ ప్రత్యేక హక్కులననుభవిస్తున్న గ్రామ ముఠాల చేతుల్లో పెట్టటమే అయింది. సంస్కరణవాద శక్తులు దేశీయ పునాది ఉన్నట్లు కనపర్చాలని పట్టుబడుతూ గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమాలను ప్రతిఘటించ ప్రయత్నించే ఈ గ్రామ ముఠాలకే సహకార సంఘాల పాలనను అప్పగించేశాయి. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేక హక్కులను ఇనుమడింపచేసేందుకు ప్రాథమిక సహకార సంఘం ఒక సాధనమయ్యింది. ఈ వర్గాలకు రిజర్వుబ్యాంకు రుణాలు నేరుగా అందే అదనపు సౌకర్యం ఒకటి కల్పించబడింది". **(పేజి -164)**

ఈవిధంగా ఒక వైపున పెద్ద వ్యవసాయ దారులకు తమ కార్యకలాపాలను విస్తృత పరచు కోవడానికి తగ్గింపు వడ్డీరేట్లపై రుణ సదుపాయాలు కలుగజేయడం మూలంగా వారు మరింతగా లాభాలను, సంపదలను కూడబెట్టుకోవడానికి అవకాశం చిక్కింది. మరోవైపున పేద, చిన్నతరహా వ్యవసాయదారులు, వ్యాపారస్తుల, వడ్డీ వ్యాపారస్తుల, భూస్వాముల ధృతరాష్ట్ర కౌగిలిలోకి నెట్టబడ్డారు. ఈ విధంగా విశేష ప్రచారం చేయబడిన సహకారోద్యమం ఆదాయాలలో తారతమ్యాలను మరింత తీవ్రతరంచేసి, ధనికులను మరింత ధనికులుగా, పేదలను మరింత పేదలుగా చేయడంలో ఆశ్చర్యమేముంది?

"దేశంలోని అన్ని రాష్ట్రాలలో విస్తరించి ఉన్న అన్ని రకాలకు చెందిన 117 సహకార సంఘాలను సందర్శించే అసాధారణ అవకాశం" లభించిన శ్రీ డేనియల్ తోర్నర్ తన 'భారతదేశంలో వ్యవసాయ సహకార సంఘాలు' అనే నివేదికలో "సాధారణంగా సహకార సంఘాలలోని ముఖ్యులంతా గ్రామాలలోని ధనవంతులే. సహకార సంస్థలతోబాటు అనేక ద్రవ్య వనరులు వీరి చేతులలో ఉన్నాయ"ని పేర్కొన్నాడు. **(పేజి-3)**

సహకార సమష్టి వ్యవసాయ క్షేత్రాలు "గ్రామంలోని ఒక భూస్వామి దాదాపు తన కుటుంబానికి చెందిన భూమిమీదే నిర్వహించే ఒక కుటుంబ వ్యవహారంగా" ఉన్న సందర్భాన్ని గూర్చి ఆయన పేర్కొన్నాడు. మరొక బహుళార్ధక సాధక సహకార సంఘంలో "మొత్తం స్వల్పకాలిక రుణాలు రూ. 1,91,000లోనూ సగభాగం (రూ.95,000) 11మంది సభ్యులే చేజిక్కించుకొన్న" దృష్టాంతాన్ని చూపించాడు. **(పేజి-4)**

నెల్లూరుజిల్లాలో "పెద్ద భూస్వాములు తమ అధికారాన్నీ, ప్రయోజనాలను ముందుకు తీసుకొనిపోయేందుకు సహకార సంస్థలలో తమ స్థానాన్ని వినియోగించుకొన్న అత్యంత ఘోరమైన దృష్టాంతాన్ని" ఆయన పేర్కొన్నాడు (పేజి-5). "వడ్డీ వ్యాపారులు (షావుకారీ), ప్రభుత్వం (సర్కారీ), సహకార సంఘాలు (సహకారీ)" సంపూర్ణ సమన్వయంతో పరస్పరం సహకరించు కొంటున్నాయని ఆయన ఫీల్డ్‌రిపోర్టు స్పష్టం చేస్తున్నది. "బరోడా, సౌరాష్ట్ర, హైద్రాబాదు, రాజస్థాన్ ప్రాంతాలలోని సహకార సంఘాలలో కొంతమేరకు వడ్డీ వ్యాపారం కూడా చేసే వ్యవసాయదారులు ప్రముఖంగా ఉన్నారు. సౌరాష్ట్ర, మైసూరు, నీలగిరి, నెల్లూరు, కాశ్మీరు ప్రాంతాలలోని

సహకార సంఘాలలో వడ్డీ వ్యాపారస్తులైన వ్యాపారులు ప్రథమ స్థానమాక్రమిస్తున్నారు. మైసూరు, కోస్తా ఆంధ్రాలలో వ్యవసాయం, వడ్డీ వ్యాపారం, వ్యాపారం-ఈ మూడు అత్యంత శక్తివంతమైన సమ్మేళనం. ఈ రంగంపై ప్రాబల్యం వహిస్తున్నద"ని ఆయన పేర్కొన్నాడు. **(పేజి-8)**

అందువల్ల "ఆర్థికాభ్యుదయానికి సామాజిక మార్పే నిర్ణయాత్మక అంశం అయిన దేశంలో కేవలం సహకార సేవల ఏర్పాటే పరిస్థితిని చక్కబరచలేదు. అది యథాతథ స్థితిని శాశ్వతం చేయవచ్చు కూడా. ఇలాంటి పరిస్థితులలో సహకార వ్యవస్థ ధనికులు మరింత ధనికులుగా, పేదలు సాపేక్షికంగా మరింత పేదలుగా తయారయ్యే క్రమాన్ని త్వరితపరచవచ్చును కూడా". **(పేజి-34)**

గ్రామాలలోని ధనికులు గ్రామీణ ప్రాంతాలలో తమ కార్యకలాపాలను వివిధ రంగాలకు విస్తరింపజేసేందుకు సహకార సంఘాల రుణాలు పనికత్తెలుగా వినియోగ పడుతున్నాయి. "గ్రామీణ ప్రాంతాలలో అమలు చేయబడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు అదృష్ట వంతులైన పెద్ద వ్యవసాయదారులు, ప్రభుత్వ కాంట్రాక్టులు చేపట్టడానికి" తమ కార్య కలాపాలను ఇతర విధంగా విస్తరించుకోవడానికి మంచి అవకాశాన్ని కల్పిస్తున్నాయి. "అతిచౌకగా లభిస్తున్న సహకార సంఘాల ద్వారా రుణాలు - ప్రధానంగా పెద్ద వ్యవసాయ దారుల చేతుల్లోకే చేరుతున్నాయని; వీరు రుణాలను ఆహారధాన్యాల వ్యాపారానికి, ప్రభుత్వ కాంట్రాక్టులను పొందటానికి, వాణిజ్య వ్యాపార కార్యకలాపాలకు రుణాలివ్వడానికి దుర్వినియోగం చేస్తున్నట్లు భయం వ్యక్తం చేయబడుతోంది." **(ఎకనమిక్ టైమ్స్ 24-6-66)**

ఆ విధంగా సహకార సంఘాల రుణాల ద్వారా; పంచాయితీలు, సమితులు, జిల్లా పరిషత్‌ల ద్వారా; అభివృద్ధి కార్యక్రమాలు, తదితర పథకాల పేరిట వ్యవసాయంలో యంత్రాలను (ట్రాక్టర్లు, బుల్‌డోజర్లు, ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు మొ॥) ప్రవేశపెట్టే పేరిట కోట్లాది రూపాయలతో గ్రామీణ ప్రాంతంలోని భూస్వాములను మేపుతూ వారు ఆదాయంలోనూ, సంపదలోనూ తమ వాటాను పెంచుకోవడానికి తోడ్పడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల ఆదాయాల మధ్య తారతమ్యాలను గతంలోకంటే అధికతరం చేస్తున్నది.

భూసంస్కరణల గురించి ఎన్ని పెద్ద కబుర్లు చెప్పినా, భూస్వాములకు హానిచేయని భూగరిష్ట పరిమితి చట్టాలను, కౌలుదారీ చట్టాలను ఎన్నింటిని చేసినా, గత 23 సంవత్సరాలుగా అధికారాన్ని చలాయిస్తూన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి ప్రజాతంత్ర భూసంస్కరణలను అమలు చేయలేదు. పంచాయితీరాజ్, సహకారసంస్థలు, ట్రాక్టర్లు తదితర వ్యవసాయ యంత్రాలకు రుణాలు ఇవ్వడం వంటి కార్యక్రమాలను పట్టుదలతో అమలు జరపడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో భూస్వాముల రాజకీయ, ఆర్థికశక్తి మరింత బలపడటం తప్ప భూసంబంధాలలో ప్రత్యేకించి ఏ మార్పూ జరగలేదు.

ఎకనమిక్ టైమ్స్ (జూలై 16, 1966)లో ప్రచురించిన జనాభా లెక్కల ప్రకారం అతిస్వల్ప మార్పులు తప్ప 1924-1961 మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతాలలో భూమి కేంద్రీకరణకు సంబంధించి పరిస్థితిలో మార్పేమీ లేదు.

1924లో 5 ఎకరాలలోపు కమతాలు కలిగిన వారు 58.3%

5-10 ఎకరాల లోపు వారు 18.4%

10 ఎకరాల కన్నా ఎక్కువ కమతాల వారు 23.3%

1939లో 5 ఎకరాల లోపు కమతాల వారు 63.7%

5-10 ఎకరాల లోపు వారు 16.9%

10 ఎకరాల కంటే ఎక్కువ వారు 19.4%

1961లో 5 ఎకరాల లోపు వారు 55.8%

5-10 ఎకరాల వారు 19%

10 ఎకరాల కంటే ఎక్కువ వారు 25.2%

సాగుభూమిలో అత్యధిక భాగం రైతాంగంలోని అతికొద్ది భాగంగానున్న అత్యున్నత శ్రేణికి చెందిన వారి చేతుల్లోనే కేంద్రీకృతమవగా అత్యధిక రైతాంగ కుటుంబాలు దివాళా తీసిన పరిస్థితిలో వున్నాయి.

1961లో ప్రప్రథమంగా జరుపబడిన వ్యవసాయకూలీ విచారణ భూకమతాల నమూనా సర్వే ప్రకారం 5 ఎకరాలు, అంతకులోపు విస్తీర్ణం కలిగిన కమతాలు మొత్తం కమతాలలో 59.1 శాతం వుండగా వాటి క్రింద వున్న భూమి మొత్తం సాగుభూమిలో 15.5 శాతం మాత్రమే వుందనీ; 25 ఎకరాలకుపైన విస్తీర్ణం కల్గిన కమతాలు మొత్తం కమతాలలో 5.6 శాతం మాత్రమే వుండగా వాటిక్రింద ఉన్న భూమి మొత్తం సాగుభూమిలో 34.4 శాతం వరకూ ఉందని తేలింది.

విభిన్న వ్యవసాయదారుల గ్రూపుల మధ్య భూమి పంపిణీ వివరాలను తెలిపే ఈ సమాచారం భారత రైతాంగంలో జరుగుతున్న చాలా లోతైన వర్గవిభజన క్రమాన్ని విదితం చేస్తున్నది.

1951-52లో కార్మిక మంత్రిత్వశాఖ నిర్వహించిన జనాభా లెక్కలు, నమూనా సర్వే అందించే సమాచారాన్ని పరిశీలించినట్లయితే వ్యవసాయ కూలీలు, వారి కుటుంబ సభ్యుల సంఖ్య మొత్తం జనాభాలో 1951 నాటికి 36% వున్నారని వెల్లడవుతుంది.

1960 జూన్ - 1961 జూన్ మధ్య జరుపబడిన 16వ జాతీయ నమూనా సర్వే వ్యవసాయక జనాభాలో పై శ్రేణికి చెందిన 10% వారి చేతులలో 56.2% సాగు భూమి ఉన్నదని నివేదించినట్లు "ఎకనమిక్ టైమ్స్" 17-2-1966 వ్రాసింది.

ఆ సర్వే ప్రకారం వ్యవసాయ జనాభాలో క్రింది శ్రేణికి చెందిన 30% వారి క్రింద 0.1% భూమి ఉంది. తర్వాతి 10% వారి కింద 0.6%, ఆ తరవాతి 10% కింద 2.1% భూమి ఉంది.

అంటే కింది 50% వారి భూమి మొత్తం భూమిలో ... 2.8%

ఆ తర్వాతి 10%	॥	4.7%
ఆ తరావాతి 10%	॥	6.9%
ఆ తరవాతి 10%	॥	11.0%
అంటే పై శ్రేణి 30%	॥	22.6%

అందువల్ల వ్యవసాయ జనాభాలో 80 శాతం మంది చేతుల్లో మొత్తం భూమిలో 25.4% మాత్రమే ఉన్నది. వ్యవసాయక జనాభాలో ఆ తర్వాత 10% వారి చేతుల్లో 19% భూమి, అత్యున్నత శ్రేణికి చెందిన 10% వారి చేతుల్లో 56.2% భూమి ఉన్నదని ఆ సమాచారం తెలియజేస్తున్నది.

వ్యవసాయక జనాభాలో అత్యున్నత శ్రేణికి చెందిన ఈ 10 శాతం మందే గత మూడు పంచవర్ష ప్రణాళికల్లోను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఆర్థికవిధానం వల్ల వచ్చిన ప్రయోజనాలలో ప్రధాన భాగాన్ని హస్తగతం చేసుకున్నారు. ఈ కారణం వల్లనే గ్రామీణ ప్రాంతంలో ఆదాయాల పంపిణీ నిష్పత్తిలో మరింతగా తారతమ్యాలు ఉంటున్నాయి. ఈ కారణం వల్లనే సహకారోద్యమం మార్కెటింగ్, వ్యవసాయ పెట్టుబడుల రూపేణ "గ్రామీణ ప్రాంతాల్లోకి ఎడతెగకుండా బయటి నుండి చొప్పించబడుతున్న సహాయం గ్రామీణ ప్రాంతాల

రూపురేఖలను మార్చలేకపోవటమే గాక గ్రామాలలో ప్రజాతంత్ర పునాదిని సృష్టించగల స్థానిక శక్తులను నిర్మించడంలో సైతం విజయం పొందలేక పోయింద"ని బూర్జువావర్గ ప్రొఫెసర్లు సైతం గుర్తించక తప్పలేదు. ఈ ఫలితాలను సాధించకపోగా ప్రభుత్వ విధానాలు ధనికులను మరింత ధనికులుగానూ మార్చాయి. **(వి.బి.సింగ్ - భారతదేశం-నిన్న-నేడు)**

కాబట్టి భూసంస్కరణల విషయంలో ప్రభుత్వం అమలు చేసిన ప్రతిచర్యా పరిస్థితి మరింతగా క్షీణించడానికే దారితీసిందని స్పష్టమౌతుంది.

'సస్యవిప్లవం' అమలులో వున్న భారతదేశంలోను, ఇంకామరి కొన్ని దేశాలలోను ఇటీవల జరిగిన అధ్యయనాన్ని ఆధారం చేసుకొని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి శ్రీ ఉథాంట్ ఏమంటున్నాడో చూడండి:

"సస్యవిప్లవం యొక్క ప్రయోజనాలు చిన్న వ్యవసాయదారులు కంటే ఇప్పటికే వాణిజ్య పంటలు పండించే వ్యవసాయదారులకు, వారిలో సైతం చిన్న ఉత్పత్తిదారులకంటే పెద్ద ఉత్పత్తిదారులకు మాత్రమే అందే అవకాశమున్నది. క్రమంగా పెద్ద ఉత్పత్తిదారుల చేతుల్లో చిన్న ఉత్పత్తిదారులు నలిగి నశించిపోయే అవకాశం, కౌలుదార్లు బేదఖల్ చేయబడే అవకాశం ఉంది. (సస్య విప్లవం గురించి భారతదేశంలో చేయబడిన అధ్యయనాన్ని ఉదహరిస్తూ ఆయన ఇంకా ఇలా అంటాడు) పంజాబ్‌లో సాపేక్షికంగా అతికొద్దిమంది వ్యక్తులు వ్యవసాయ కుటుంబాల్లో 2%కు మించని కుటుంబాలు సస్యవిప్లవం వల్ల ప్రయోజనం పొందాయి. పన్నుల భారం విపరీతంగా పెరిగిందనీ, భూముల ధరలు చుక్కలనంటు కున్నాయనీ, కౌళ్ళు విపరీతంగా పెరిగాయనీ, కౌలుదార్ల పరిస్థితులు మరింత దిగజారలేదను కొన్నప్పటికీ ఏ మాత్రం మెరుగు మాత్రం కాలేదని కూడా పంజాబ్‌లో జరిగిన అధ్యయం వల్ల తేలింది".

అప్పటి కేంద్ర ఆహార వ్యవసాయశాఖ మంత్రి జగజ్జీవన్‌రామ్ బొంబాయిలో జరిగిన కాంగ్రెసు సభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ భూమి కేంద్రీకరణలో తీవ్ర అంతరాలు ఉన్నాయని చెప్తూ ఈ విధంగా పేర్కొన్నాడు; "వ్యవసాయంలో బ్రహ్మాండమైన అభివృద్ధి సాధించబడింది. ఉత్పాదకాలు (ఎరువులు, విత్తనాలు వగైరా... అను॥) ప్రజలకు పంపిణీ చేసే ఏర్పాట్లు, రుణాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. అయితే వీటివల్ల ప్రయోజనం పొందుతున్నది మైనారిటీగా వున్న ప్రత్యేక సౌకర్యాలు పొందుతున్న పెద్ద మధ్యరకం వ్యవసాయదారులు మాత్రమే. నెలకు కొద్ది రూపాయల ఆదాయంపై జీవనం గడిపే వారికసలు వీటి ఫలితాలు అందనేలేదు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలలో 41% కుటుంబాలకు ఒక్క ఎకరంలోపుగానే ఉండగా, మరో 22% కుటుంబాలకు అసలు భూమేలేకపోగా, 3 నుండి 4 శాతం వరకు మాత్రమే ఉన్న పెద్ద వ్యవసాయ దారుల కుటుంబాలు సమస్త అధికారాలు, పలుకుబడి కలిగి ఉంటున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో ప్రభుత్వ సంస్థలలో అన్ని నిర్ణయాలు తమకు అనుకూలంగా చేసుకుంటూ ఆ సంస్థలు అందించే వనరులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని వీరే హస్తగతం చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో సగభాగంగా ఉన్న పేద ప్రజానీకానికి వీటివల్ల ఎలాంటి ఫలితాలు చేకూరడం లేదు".

అధికార పార్టీనుండి వస్తున్న ఈ సానుభూతి ప్రకంపనాలు ప్రజలను జోకొట్టి కర్తవ్య విముఖుల్ని చేయటానికీ; ఇందిరాగాంధీనీ, అధికారంలో ఉన్న ఆమె పార్టీని బలపరుస్తూ రివిజనిస్టులు సమగ్రమైన బహిరంగ ప్రకటన చేయటానికి తగిన రంగం సిద్ధం చేయటానికీ; ఆమెకూ, ఆమె ముఠాకు అభ్యుదయ మేలిముసుగు వేయటానికీ ఉద్దేశించబడ్డాయి. ఒకవైపున దారిద్ర్యం పెరుగుదల గురించి, భూసంస్కరణల ఆవశ్యకత గురించి అంతు లేకుండా మాట్లాడటం; ఇంకోవైపున భూస్వాములకు పంపిణీ చేసేందుకై అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (IDA) నుండి రుణంగా వేలకొలది ట్రాక్టర్లను దిగుమతి చేయడం - ఇదీ ఇందిరాగాంధీ అండ్ కంపెనీ వారి మోసపూరితమైన రెండు నాల్కల కార్యక్రమం.

'దున్నేవానికే భూమి అనే నినాదం పట్ల బడా బూర్జువా భూస్వామ్య ప్రభుత్వానికి ఎంతమాత్రం ఆసక్తిలేదని, ఆ నినాదాన్ని అమలు చేయడంలో ఈ ప్రభుత్వం అశక్తురాలనీ స్పష్ట మవుతోంది. భారతదేశంలో ఇందిరా కాంగ్రెసు అమలు చేస్తున్న ఇలాంటి కార్యక్రమాన్నే భూస్వామ్య బూర్జువా విప్లవమ"ని లెనిన్ వర్ణించాడు. ఈ భూస్వామ్య, బూర్జువా విప్లవం "పూర్తిగా భూస్వాముల ప్రయోజనాలకు మాత్రమే అనుగుణ్యమైనది". ఇది "గ్రామ కమ్యూన్లను కొల్లగొట్టటానికీ ప్రజలనుండి బలవంతంగా వారి భూములను హస్తగతం చేసుకోడానికీ, పేద రైతులను బేదఖల్ చేయటానికీ యావత్తు గ్రామీణ జీవితపు పునాదులనే ధ్వంసం చేయడానికీ భూస్వాములకు స్వేచ్ఛనిస్తుంది." (పేజి-278). భూస్వామ్య విధానం సంపూర్ణ రద్దుకు విరుద్ధంగా ఈ విధమైన భూస్వామ్య బూర్జువా విప్లవం పెట్టుబడిదారీ విధానం బలీయంగా అభివృద్ధి చెందిన ఈ యుగంలో సైతం అనివార్యమే. "ఇలాంటి యుగంలో ఈ బూర్జువావర్గం మొత్తం తప్పనిసరిగా విప్లవ ప్రతీఘాత స్వభావం కల్గి వుంటుంది. **(పేజి-321)**

ఇలాంటి పరిస్థితులలో సమూలమైన రాజకీయ విప్లవం లేకుండా సమూలమైన వ్యవసాయ సంస్కరణలు సాధ్యమనే భావాన్ని మార్క్సిజం దృఢంగా ఎదుర్కోవాలి. రాజకీయాధికారం విప్లవవర్గాల హస్తగతం కాకుండా దున్నేవానికే భూమిహక్కును సాధించడం అసాధ్యమని దేశవ్యాపితంగా రైతాంగానికి బోధించి అందుకై వారిని సన్నద్ధం చేసి ఆర్గనైజు చేసినపుడే అలాంటి రైతాంగ వ్యవసాయ విప్లవం నిజం కాగలదు.

రైతాంగం యొక్క విప్లవచర్యలను, రైతాంగం భూస్వాముల భూములను హస్తగతం చేసుకోవడాన్ని సమర్ధించడంపై విప్లవకారులకు విశ్వాసముంటే అలాంటి కార్యాచరణ కోసం ప్రజా బాహుళ్యాన్ని సంఘటిత పరచేందుకై విప్లవకారులు తీవ్రంగా ఆలోచించాలి. లెనిన్ చెప్పినట్లుగా "పాత వ్యవస్థను, సైన్యాన్ని, నిరంకుశాధికార యంత్రాంగాన్ని నిర్మూలించకుండా రైతాంగం వ్యవసాయక విప్లవాన్ని నిర్వహించ జాలదు. ఎందుకంటే భూస్వామ్య విధానానికి ఇవి మూలస్థంభాలు. వేలకొలది బంధనాల ద్వారా ఇవి భూస్వామ్య విధానానికి ముడివేయ బడ్డాయి". **(పేజి-349)**

"సమూలమైన రాజకీయ విప్లవాన్ని సాధించడం చాలా కష్టమే. వ్యవసాయక విప్లవాన్ని సాధించకుండా అంతేకష్టం. వ్యవసాయక విప్లవం అనేది రాజకీయ విప్లవం లేకుండా అసాధ్యం. ఈ వాస్తవాన్ని రైతులముందు దాచకుండా, దానిపై ముసుగు కప్పకుండా చాటిచెప్పడం, రాజకీయాలలో పూర్తిగా పాల్గొనకుండా భూస్వాముల భూమి హస్తగతం చేసుకోవడం గురించి ఎంతగా ఆలోచించినా అది నిరర్ధకరమని రైతాంగానికి చాటిచెప్పడం ప్రతి సోషలిస్టు కర్తవ్యం". **(పేజి-350)**

పెరుగుతున్న భూమి కేంద్రీకరణ

ప్రజలు తమ ప్రజాతంత్ర కార్యక్రమాన్ని సాధించడానికై పోరాటాల్లోకి దుమికినపుడల్లా దోపిడీవర్గాల (మన దేశంలో సామ్రాజ్యవాదులు, దళారీలు, భూస్వాములు) ప్రత్యేక హక్కుల్ని, ప్రజలపై వారు చలాయిస్తున్న అపరిమితాధికారాన్ని రక్షించుకోగలిగినంత వరకూ పెట్టుబడిదారీ పార్టీలు 'సోషలిస్టు' అవతారమెత్తడానికి సిద్ధపడతాయని చారిత్రకానుభవం మనకు చాటిచెపుతోంది.

ఆంధ్రాలో తెలంగాణా సాయుధ రైతాంగ తిరుగుబాటు, బెంగాల్‌లో తెభాగ పోరాటం, మహారాష్ట్రలో వర్లీ తిరుగుబాటు సాగుతున్న సమయంలోనే బూర్జువావర్గం భూదానోద్యమాన్ని, భూసంస్కరణలను ముందుకు తీసుకొచ్చింది. తెలంగాణా సాయుధ రైతాంగ తిరుగుబాటు ముగిసిన వెనువెంటనే ఆంధ్రలో మధ్యంతర ఎన్నికల సందర్భంగానే బూర్జువావర్గం మళ్లీ 'ఆవడి సోషలిజం' అనే మోసపూరిత కార్యక్రమా నొకదాన్ని ప్రకటించింది.

కేరళలో ప్రప్రథమ కమ్యూనిస్టు మంత్రి వర్గం ఏర్పడిన కాలంలోనే పోరాడే ప్రజల దృష్టిని మళ్ళించేందుకై పాలకపార్టీ సహకార వ్యవసాయాన్ని ఒక 'నినాదం'గా ముందుకు తెచ్చింది.

మరలా ఇప్పుడు నక్సల్‌బరీ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలలో సాయుధ తిరుగుబాట్లు చెలరేగటంతో, తూర్పుగోదావరి, ముషాహరి, తెరైప్రాంతాలలో పోరాటం సాగిస్తున్న వేలాది రైతులు భూములు ఆక్రమించడానికి ముందుకు రావడంతో భూమి సమస్య మళ్ళీ ఎజెండా మీదకు వచ్చింది. దీనితో భూసంస్కరణలు, 'దున్నేవానికే భూమి' అనే నినాదాలతో పాలక పార్టీ మరలా ప్రజల ముందుకు వచ్చింది.

ఒకవైపున భూసంస్కరణలను, దున్నేవానికే భూమి పంపిణీ తన విధానాలుగా ప్రకటించడం; మరోవైపున గ్రామీణ ప్రాంతాలలో 10%గా ఉన్న భూస్వాముల చేతులలో భూమి కేంద్రీకరణకై దారితీసే విధానాలు అనుసరించడం, ప్రభుత్వం ఈ కాలమంతటా అనుసరిస్తున్న చీదర పుట్టించే మోసపూరిత విధానం.

'ఎకనమిక్ టైమ్స్' 1970 జనవరి 3న 'వ్యవసాయం-అభ్యుదయం' అనే శీర్షికతో ఒక సంపాదకీయంలో ఇలా పేర్కొన్నది.

"ఒక ప్యాకేజి పథకంతో నిర్దిష్టమైన ప్రాంతాలపై కేంద్రీకరించడమే ప్రస్తుత వ్యవసాయాభివృద్ధి వ్యూహానికి కీలకం. ప్రస్తుతం మనం చూస్తున్న సస్యవిప్లవం ఈ నూతన వ్యవసాయాభివృద్ధి వ్యూహం సాధించిన విజయాల ఫలితమే. అయితే దానివల్ల వ్యవసాయార్థికం జీవనాధారంగా ఉన్న స్థితినుండి లాభదాయకమైన వ్యాపారంగా పరివర్తన చెందింది. ఇప్పటికే జరిగిన కొన్ని పరిశీలనలను బట్టిచూస్తే నూతనావకాశాలను ఉపయోగించుకోగలిగిన పెట్టుబడి వనరులు కలిగినవారే నూతన సాంకేతిక పరిజ్ఞానం వలన వచ్చిన ఫలితాలను చేజిక్కుంచుకొన్నారని స్పష్టమౌతుంది. అదే సమయంలో చిన్న వ్యవసాయదారులు, కౌలుదార్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొనడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ వాటిని అమలుపరచడానికి అవసరమైన పెట్టుబడి వనరులు తగినంతగా లేకపోవడం వలన వారికి దీనివలన ఎలాంటి ప్రయోజనం చేకూరడంలేదు. (అఖిల భారత వ్యవసాయార్థిక శాస్త్ర మహాసభలో అధ్యక్షోపన్యాసమిస్తూ పంజాబ్‌లో జరిపిన ఒక పరిశోధన అధ్యయనాన్ని శ్రీ జాఖాదే ఉదహరించారు). దానినిబట్టి భూగరిష్ట పరిమితి చట్టాలలో ఎలాంటి నిబంధనలున్నప్పటికీ భూములను కొనుగోలు చేసే వ్యాపారం పంజాబ్‌లోని అతిపెద్ద వ్యవసాయదారులు పెట్టుబడి పెట్టేందుకు ఎంత లాభదాయకమైన వనరుగా తయారయిందో బోధపడుతుంది. ఆ విధంగా 1955-56, 1967-68 మధ్యకాలంలో పెద్ద వ్యవసాయదారులు చేతిక్రింద ఉన్న భూమి 9.5% పెరిగింది. 20-25 ఎకరాల విస్తీర్ణం కలిగిన కమతాలు 4% మాత్రమే పెరుగగా, 100-150 ఎకరాల విస్తీర్ణం కలిగిన కమతాలు 40% వరకూ పెరిగాయి. అందువలన భూ సంస్కరణలను అతిత్వరితంగా, అతిశక్తివంతంగా అమలు జరుపకపోయినట్లయితే ఈ ధోరణులు సామాజిక ఉద్రిక్తతలను ఎంత తీవ్రతరం చేస్తాయో తేలికగా గ్రహించవచ్చు."

"సస్యవిప్లవం వలన అనేక సామాజిక సమస్యలుత్పన్నమయ్యాయి. గ్రామీణ పేదలలో ప్రధానభాగంగా ఉన్న షెడ్యూల్డు కులాలవారి ఆర్థికపరిస్థితిని మరింత దుర్భరం చేసింది. ధనికులకు పేదలకు మధ్య అగాధం మరింతగా విస్తృతమయ్యింది. భూస్వామ్య విధానాన్నే ధ్వంసం చేయడానికి దారితీయగల కొన్ని సామాజిక శక్తులను ఈ సస్యవిప్లవం బయల్పరిచింది. ఇటీవలే జరిగిన రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో అప్పటి దేశీయాంగశాఖా మంత్రి అయిన శ్రీ వై.బి.చవాన్ మాట్లాడుతూ "సస్యవిప్లవంతో పాటుగా సామాజిక న్యాయంపై ఆధారపడిన విప్లవం జరిగినట్లయితే తప్ప ఈ పచ్చ విప్లవం ఎంత మాత్రం పచ్చగా ఉండబోదని కాలం హెచ్చరిస్తుంది". అని తన భయాందోళనలను వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఈ సస్యవిప్లవం అమలు చేయబడుతున్న పద్ధతే సామాజిక ఉద్రిక్తలకు దారితీసి తీరుతుంది.

అమెరికన్ రాడికల్ మాసపత్రిక అయిన రాంపార్డ్ 1970 మే సంచికలో శ్రీ వీజ్‌మాన్ ఒక వ్యాసం వ్రాస్తూ "అమెరికన్ వాణిజ్య ప్రయోజనాలను ఇతోధికం చేసేందుకు ఈ సస్యవిప్లవం ఏ విధంగా భారతదేశంపై రుద్దబడిందో" చూపించే ఆశ్చర్యకరమైన రేఖా చిత్రాన్ని రూపొందించాడు. ఈ సస్యవిప్లవం ఎంతకాలం వరకు పచ్చగా ఉండగలదు? అని ప్రశ్నవేస్తూ దానికి ఆయనే ఇలా సమాధానాన్ని ఇచ్చాడు:

"నిజమైన వినాశనం ఏమంటే తక్షణంగా జరిగే వ్యాపారపరమైన వ్యవసాయం అంటేనే ఉత్పత్తి లాభంకోసమేగాని ప్రజల కోసం కాదని నిర్వచనం. కొత్త విత్తనాలకు నీటిపారుదల సౌకర్యం, క్రిమిసంహారక మందులు కావాలి. భారీఎత్తున ఎరువులు వాడాలి. వీటిధర ఆకాశా న్నంటుతుంది. తగినంత పెట్టుబడి లేనివాళ్ళు గ్రామీణ వడ్డీ వ్యాపారస్తుల నుండిగాని, చాలీచాలని ప్రభుత్వ పథకాల నుండిగానీ అప్పు పొందలేని వాళ్ళు వారి భూముల నుండి వ్యవసాయ కూలీలుగానో అంతకన్న హీనమైన స్థితికో నెట్టివేయబడతారు. అదే సమయంలో కొత్త కులక్‌లు, పెట్టుబడిదారీ వ్యవసాయదారులు తమ లాభాలను ఆధునికమైన శ్రమ వినియోగాన్ని తగ్గించగల యంత్రాలపై తిరిగి పెట్టుబడి పెడతారు".

కౌలుదారు కూడా ఆర్థికంగా మరింత బలహీనంగా తయారయ్యాడు. కౌలుదార్ల పరిస్థితులు తీవ్రంగా క్షీణించడానికి సస్యవిప్లవం రెండు విధాలుగా కారణమయ్యింది.

మొదటది: భూమి ఉత్పాదకశక్తి పెరగటం వలన భూస్వాములు మరింత హెచ్చు కౌళ్ళను డిమాండ్ చేస్తున్నారు. నూతనమైన, మెరుగైన వ్యవసాయ పద్ధతులను అనుసరించ దానికి తగిన వనరులు లేకపోవడం మూలానా భూమినుండి అధిక ఉత్పత్తిని తీయడంలో పెద్ద వ్యవసాయ దారులతో కౌలుదార్లు పోటీ పడలేరు. అయినప్పటికీ కౌలుదార్లు బేరసారాలు సాగించే శక్తి బలహీనంగా ఉండటం వల్ల హెచ్చుకౌళ్ళు

చెల్లించాలనే భూస్వాముల డిమాండ్లను ప్రతిఘటించలేకపోతున్నారు.

రెండవది: భూములను కౌలుకిచ్చి వాటిపై ఎంత కౌలువస్తే అంతే వసూలు చేసుకుంటూ వ్యవసాయానికి దూరంగా ఎక్కడో ఉన్న భూస్వాములు తమ భూములను కౌలుదార్ల నుండి తిరిగి స్వాధీనం చేసుకొని స్వయంగా వ్యవసాయం చేసే స్థితికి ఈ సస్యవిప్లవం ప్రోత్సహించింది.

లూథియానాలో ఈ నూతన వ్యవసాయ వ్యూహం ప్రభావాన్ని గురించి పరిశీలన జరిపిన శ్రీ ఫ్రాన్సిస్ ఫ్రాంకెల్ "సస్యవిప్లవం ఫలితంగా కౌలుదార్ల పరిస్థితి మరింత కష్టంగా తయారైందనటంలో ఎలాంటి సందేహం లేద"ని గమనించాడు.

సస్యవిప్లవం రాకతో అధికోత్పత్తి సాగించటం పేరిట పెద్దయెత్తున ప్రభుత్వ ధన సహాయం భూస్వాముల భోషాణాల్లోకి చేరడంతో వారిచేతుల్లో భూమి కేంద్రీకరణ మరింతగా పెరుగుతుంది. ఒకవైపున భూములను భూమిలేని రైతులకు పంపిణీ చేయడం గురించి పెద్దయెత్తున ప్రచారం జరుగుతున్నప్పటికీ; వాస్తవానికి దేశంలో రాజకీయ రీత్యా, ఆర్థికరీత్యా, శక్తివంతమైన పెత్తనం సాగిస్తున్న గ్రూపులు చట్టవిరుద్ధంగా అక్రమ పద్ధతుల ద్వారా మరిన్ని భూములను హస్తగతం చేసుకొంటున్నాయి. ఈ దిగువ ఉదాహరణలు దీనిని తెలియజేస్తున్నాయి.

రాజస్థాన్‌లో 'మంత్రులచే భూములు ఆక్రమణ'-(బ్లిట్జ్ డిశంబరు12, 1970 కథనం):

సుఖాడియా: 40 భిగాల విస్తీర్ణం గల దుర్గా నర్సరీకి ఈయన యజమాని. అందులోనే విలాసవంతమైన ఒక బంగళా కూడా ఉంది. రాజస్థాన్ కాలువ ప్రక్కనే గల 200 భిగాల భూఖండాన్ని కూడా ఈయన సంపాదించాడు. జైపూర్‌కు ఏడుమైళ్ళ దూరంలో గల శుక్లాపూర్ గ్రామంలో 85 భిగాల క్షేత్రానికి ఈయన యజమాని. తన భార్య ఇందు బాలసుఖాడియా, ఆమె సోదరుడు దీనాభాయ్ పేరిట అతిపెద్దదైన రఘునాద్‌పూర్ వ్యవసాయ క్షేత్రాన్ని ఈయన సంపాదించాడు. ఉదయ్‌పూర్‌కు దగ్గర్లోగల బాడి వద్ద ఈయనకు మరో 40 భిగాల క్షేత్రం వుంది. జైపూర్‌కు 4 మైళ్ళ దూరంలో ఉన్న 55 భిగాల క్షేత్రాన్ని ఈయన తన అల్లుడు మన్నాలాల్ గోయెల్‌కు బహుమతిగా ఇచ్చాడు.

జైపూర్ నగరంలో అజ్మీర్ రోడ్డు మంత్రుల వ్యవసాయ క్షేత్రాల ప్రదర్శనా రహదారిగా మార్చివేయబడింది.

ఎ) ఈ రహదారి గుండా వరుసగా ఉన్న క్షేత్రాలలో మొదటిది పరిశ్రమల శాఖామంత్రి అయిన హర్‌దేవ్ జోషీది. ఈ వ్యవసాయ క్షేత్రం విస్తీర్ణం 38 భిగాలు.

బి) దీని తర్వాత న్యాయశాఖామంత్రి బర్కతుల్లాఖాన్ క్షేత్రం ఉన్నది. దీని విస్తీర్ణం 60 భిగాలు.

సి) మూడవది సాంఘిక సంక్షేమశాఖామంత్రి అమృత్‌లాల్ యాదవ్‌ది.

డి) నాల్గవది రాష్ట్ర మంత్రి మప్పూల్‌సింగ్ యాజమాన్యంలో ఉన్న 50 భిగాల వ్యవసాయ క్షేత్రం. ఈయన తన స్వంత జిల్లా అయిన గంగానగర్ జిల్లాలో రాజస్థాన్ కాలువ ప్రాజెక్టు ప్రాంతంలో 150 భిగాల భూమిని కూడా ఆక్రమించాడు.

ఇ) ఐదవది గృహవసతి శాఖామంత్రి బాబాభాయ్‌కి చెందినది. దాని విస్తీర్ణం 50 భిగాలు.

ఎఫ్) ఆరవది ఆరోగ్యశాఖామంత్రి బ్రిజ్‌సుందర్ శర్మకు కూడా 20 భిగాల వ్యవసాయ క్షేత్రం ఈ అజ్మీర్ రోడ్డును అనుకొనే ఉంది.

ఆంధ్రమంత్రులు భూదాహం-భూమి ఆక్రమణ :

1970 సెప్టెంబర్ 10వ తేదీ నాటి బ్లిట్జ్ పత్రిక ఆ కాలంలో క్యాబినెట్ మంత్రులు ఆక్రమించి అధీనంలో పెట్టుకొన్న భూములు, స్వంత భూములు గురించి ఆసక్తిదాయకమైన ఒక జాబితా ఇచ్చింది:

1) **ఉపముఖ్యమంత్రి జె.వి.నరసింగరావ్** ఈ జాబితాలో ప్రథమ స్థానం ఆక్రమించాడు. ఈయన కుటుంబానికి తన స్వంత జిల్లా అయిన ఆదిలాబాద్ జిల్లాలోనూ, ఇతర చోట్లా 1,140 ఎకరాల భూమి ఉంది.

2) **శ్రీ రామలింగరాజు:** ఈయన జాయింటు కుటుంబ ఆస్థి తూర్పు గోదావరి జిల్లాలో సారవంతమైన 1,120 ఎకరాల భూమి ఉంది. "ఈయన దేవాలయాలకు చెందిన 1000 ఎకరాల భూమికి దీర్ఘకాలిక కౌలుపద్ధతిపై సంరక్షకుడుగా ఉన్నాడు".

3) **చిన్న తరహా నీటి పారుదల శాఖా మంత్రి పురుషోత్తమరెడ్డి:** ఈయనకు నల్గొండ జిల్లాలో 700 ఎకరాల భూమి ఉంది. తన స్వంత భూముల మారకం పేరుతో అద్ద గూడూరులో తాను ఆక్రమించుకొన్న 500 ఎకరాలు ప్రభుత్వ బంజరు భూమిని చట్టబద్ధం చేసుకోడానికి తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు.

4) **చల్లపల్లి రాజా:** 3000 ఎకరాల విస్తీర్ణం కల్గిన అతిసారవంతమైన లంక భూముల్ని ఈయన చట్టవిరుద్ధంగా ఆక్రమించుకున్నారు.

చెరకు, తోటలు, విత్తనాల క్షేత్రాలు, పచ్చికబయళ్ళు, దేవాలయాల క్రింద ఉన్న విశాలమైన భూములను చట్టపు పరిధి నుండి మినహాయించడం ద్వారా భూపరిమితి చట్టం భూస్వాములకు అపారమైన సౌకర్యాలు ఇచ్చింది.

ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్‌లోని సౌభాగ్యవంతమైన ప్రాంతాలైన నైనితాల్ లఖింపూర్ జిల్లాలో పలుకుబడి కల్గిన పెద్ద భూస్వాములు, పదవీ విరమణ చేసిన సివిల్ అధికారులు, మిలటరీ ఆఫీసర్లు, రాజకీయ బాధితులనబడేవారు భూములను ఆక్రమించుకొన్న లేదా వారికి కేటాయించబడిన ఉదంతాలను కొన్నింటిని పరిశీలిస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగకమానదు.

1) నైనితాల్ ప్రాంతంలో ప్రయాగ వ్యవసాయ క్షేత్రానికి 1000 ఎకరాలకు పైగా మంచి సారవంతమైన భూమి; 2000 ఎకరాల విస్తీర్ణం కలిగిన మరొక పెద్ద క్షేత్రం కూడా ఉన్నది. ప్రయాగ వ్యవసాయ క్షేత్రం యజమానికి (ప్రొప్రయిటరు) అనేక వాణిజ్య సంస్థలతో సంబంధాలున్నాయని తెలుస్తున్నది.

2) పదవీ విరమణ చేసిన సైనికాధికారికి (ఆర్మీ జనరల్) 1500 ఎకరాల భూమి యివ్వబడింది.

3) పదవీ విరమణ చేసిన లెఫ్టినెంటు గవర్నరుకు 1000 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన క్షేత్రం ఉంది.

4) ఉన్నత పోలీసు అధికారి ఒకరికి 500 ఎకరాల క్షేత్రం, మరొక ఐ.ఎ.యస్.అధికారికి మరొక 500 ఎకరాల క్షేత్రం ఉన్నాయి.

('ఇండియా మార్టిగేజ్డ్' పేజి 406-424)

వ్యవసాయ కార్మికులు

మన దేశపు జనాభాలో వ్యవసాయ కార్మికులే అన్నిటికంటే ఏకైక అతిపెద్ద సెక్షన్‌గా ఉన్నారు. 1961 నాటి జనాభా లెక్కల ప్రకారం మొత్తం 44 కోట్ల మంది వ్యవసాయ కార్మికులే. అంటే మొత్తం జనాభాలో వారు 25% లేదా గ్రామీణ జనాభాలో మూడో వంతున్నారు. మన ప్రజానీకంలో-అమెరికాలోని నీగ్రోలకంటే,

దక్షిణాఫ్రికాలోని నల్లజాతి వారి కంటే ఎంతో హీనంగా చూడ బడుతూ, అనేక విధాలుగా అత్యంత నికృష్ట దోపిడీకి, సామాజిక పీడనకు గురవుతున్న వర్గమిదే.

ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ విధానం, రుణాల పంపిణీ విధానం, అలాగే అధిక దిగుబడి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల పంపిణీ విధానం, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు-లేనివారు అని రెండు ధృవాలుగా చీలిపోవడం మరింత తీవ్రతరం కావడానికి మాత్రమే తోడ్పడుతున్నాయి. భూసంస్కరణల గురించి ప్రభుత్వం ఏమి ప్రచారం చేసుకొంటున్నప్పటికీ ట్రాక్టర్లు, కంబైన్లు (కోత యంత్రాలు), ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు, గ్రామీణ ధనికులకు అవసరమైన తదితర సౌకర్యాలను కల్పించడానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రపంచబ్యాంకు తన అనుబంధ సంస్థ అయిన అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (IDA) ద్వారా ఇస్తున్న కోట్లాది రూపాయల రుణాలు ఆచరణలో గ్రామీణ ప్రాంతాలలో కొద్ది మంది చేతుల్లో మరింతగా భూమి కేంద్రీకరించ బడటానికీ, వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరుగుదలకు మాత్రమే తోడ్పడుతున్నాయి.

ఈ ఆర్థిక సదుపాయాలేవీ చిన్న రైతులకు చేరనేలేదు. "చిన్న వ్యవసాయదారుల్లో అత్యధిక భాగంగా ఉన్న హరిజనులకు వ్యవసాయ విస్తరణ సంస్థలు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అసలు తెలియనే తెలియదు. పంచాయితీ సమితులు సాంద్ర ఎరువుల పథకం (క్రింద ఇస్తున్న రుణాలు (ఐ.యం.యఫ్.రుణాలు-అను) సామాజికంగా అశక్తులైన చిన్న వ్యవసాయదారులకు చేరడం చాలా అరుదు." (వ్యవసాయాభివృద్ధి, చిన్న రైతులు- ఆంధ్ర ప్రదేశ్‌లో ఒక పరిశీలన- గోగుల పార్ధ సారధి-ఆంధ్ర విశ్వవిద్యాలయం 1971-పేజి 68)

వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు వేళ్ళూనుకొన్నచోట భూమి ధర మూడు, నాలుగు, ఐదు రెట్లకు సైతం పెరిగిపోయింది. వ్యవసాయంలో మెరుగైన పద్ధతుల ద్వారా అందుతున్న ఫలితాలను ఇతరులతో పంచు కోవడానికి భూమి యజమానులు ప్రత్యేకించి పెద్ద భూస్వాములు సిద్ధంగా లేరు. వారి ప్రయత్నమంతా కౌలుదార్లను సొంతం వదిలించుకొని, సొంత సాగు పేరిట భూమిని తిరిగి తమ చేతుల్లోకి తీసుకొని, వాస్తవంలో అపరిమితంగా సరఫరా అవుతున్న కూలీలను పెట్టుకొని వ్యవసాయం చేయడమే. ఈ విధంగా కౌలుదార్లు భూమిలేని వ్యవసాయ కార్మికుల స్థాయికి దిగజార్చబడుతున్నారు.

ప్రధానంగా వ్యవసాయ కార్మికులుగా ఉన్న ఈ గ్రామీణ శ్రామికుల సంఖ్య విపరీతంగా పెరగడం భారతదేశంలో పెరుగుతున్న ఒక లక్షణంగా ఉంది.

గ్రామీణ శ్రామికుల పెరుగుదల

రెండవ లేబర్ ఎన్క్వయిరీ (కార్మిక విచారణ) రిపోర్టు ప్రకారం 1956-57 నాటికి మొత్తం మన దేశంలో 66.6 మిలియన్ల గ్రామీణ కుటుంబాలున్నాయని అంచనా వేయగా, అందులో 24.5% లేదా 16.3 మిలియన్లు వ్యవసాయ కార్మికుల కుటుంబాలే. 18వ జాతీయ నమూనా సర్వే ప్రకారం 1963 - 64లో భారతదేశంలో మొత్తం 67.6 మిలియన్ల గ్రామీణ కుటుంబాలుండగా అందులో 17.2 మిలియన్లు అంటే 26%గ్రామీణ కార్మికుల కుటుంబాలే.

ఇంతకు ముందు "భారతదేశం పారిశ్రామికీకరణ పథంలో పయనిస్తోందా?" అనే అధ్యాయంలో దేశంలో పారిశ్రామిక వ్యవసాయ వృత్తులకు సంబంధించినంత వరకూ వృత్తుల పంపకం సరళిలో ఎలాంటి ప్రాథమికమైన మార్పు సంభవించలేదని మనం గమనించాం. ఈ అంశం గ్రామీణ ఆర్థికవ్యవస్థ విషయంలో సైతం వాస్తవమే.

1901, 1969 మధ్యకాలంలో మొత్తం శ్రామికుల్లో వ్యవసాయ కార్మికుల భాగం 70% వద్ద నిలకడగా ఉన్నప్పటికీ, మొత్తం జనాభాలో వ్యవసాయకార్మికుల భాగం 70%కి కొంచెం అటూ ఇటూగా ఉంటూ వచ్చింది. స్పష్టమైన అంకెల్లో చెప్పాలంటే 97.2 మిలియన్ల నుండి 132 మిలియన్లకు పెరుగుదల ఉంది.

భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో మొత్తం గ్రామీణ కుటుంబాలలో గ్రామీణ కార్మికుల కుటుంబాల శాతాలు ఈ క్రింది పట్టికలో ఇవ్వబడ్డాయి. ఈ పట్టికను బట్టి కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, బీహార్ మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోని మొత్తం గ్రామీణ కుటుంబాలలో మూడోవంతుకు పైగా గ్రామీణ శ్రామికుల కుటుంబాలే ఉన్నాయని విశదమవు తుంది. గ్రామీణ శ్రామికులలో ప్రధానభాగం వ్యవసాయ కార్మికులే. మొత్తం గ్రామీణ శ్రామికులలో వ్యవసాయ కార్మికులు 82% ఉంటారు.

వివిధ రాష్ట్రాలలో మొత్తం గ్రామీణ కుటుంబాలలో గ్రామీణ కార్మికుల కుటుంబాల శాతం - 1963-64

రాష్ట్రం పేరు	శాతం
కేరళ	36.7
తమిళనాడు	36.3
ఆంధ్రప్రదేశ్	34.7
పశ్చిమ బెంగాల్	33.8
బీహార్	32.9
మహారాష్ట్ర	30.0
ఒరిస్సా	30.0
మైసూరు	23.6
మధ్య ప్రదేశ్	22.9
గుజరాత్	19.8
అస్సాం (మణిపూర్, త్రిపురతో సహా)	15.0
ఉత్తరప్రదేశ్	15.2
పంజాబు, ఢిల్లీ, హిమాచలప్రదేశ్‌తో సహా)	14.9
రాజస్థాన్	11.8
జమ్మూ - కాశ్మీర్	2.5
అఖిల భారత స్థాయి :	**25.5**

తాజాగా లభ్యమైన గణాంక వివరాల ప్రకారం మొత్తం గ్రామీణ జనాభా 434 మిలియన్లు ఉండగా, అందులో 100 మిలియన్ల జనాభాకు అసలు భూమే లేదని 185 మిలియన్లకు కుటుంబానికి 5 ఎకరాల లోపు భూమి ఉన్నదని తెలుస్తోంది. చిన్న చిన్న భూఖండాలుగా 5 ఎకరాలకు తక్కువ భూమి ఉన్నవారిలో అత్యధిక భాగం ప్రధానంగా వ్యవసాయ కార్మికులే.

భూమి లేని కూలీలు

దేశంలో నేడు భూమిలేని కూలీల సంఖ్య ఒక పెరుగుతున్న లక్షణంగా ఉంది. పెట్టుబడిదారీ సంబంధాలు, సరుకుల ఉత్పత్తి విధానం పెరగటం వలన చిన్న తరహా ఉత్పత్తి నాశనమవుతుంది. వ్యవసాయంలో ఇది చిన్న సాగుదార్లను, కౌలుదార్లను భూమిలేని వ్యవసాయ కార్మికుల స్థాయికి దిగజార్చి ఆ విధంగా ఎటువంటి ఉత్పత్తి సాధనాలులేని గ్రామీణ శ్రామిక వర్గాన్ని సృష్టిస్తుంది. జీవించటం కోసం వీరు మార్కెట్లో అమ్ముకొనటానికి తమ శ్రమశక్తి మినహా మరేమీ ఉండదు.

"రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి" అనే తన గ్రంథంలో లెనిన్ ఇలా వ్రాశారు :

"వ్యవసాయంలో యంత్రాలు ఉత్పత్తి కేంద్రీకరణకు, పెట్టుబడిదారీ సహకార పద్ధతులకు దారితీశాయి." మరియు "యంత్రాల వినియోగం ప్రత్యేకించి విస్తృతంగా వ్యాపించి ఉన్న ప్రాంతాలలో (Novo Russia) క్షేత్రాలు గణనీయమైన పరిమాణం కలిగినవిగా కూడా

ఉంటాయి" "మరమగ్గం చేనేత పనివాడిని త్రోసివేసినట్లుగానే, వ్యవసాయంలో ఒక క్రమ పద్ధతిలో యంత్రాల వాడకం పెరగడం వలన పూర్వకాలపు మధ్యరైతుల్ని తిరుగులేని విధంగా త్రోసివేస్తుంది."

ఆవిధంగా వ్యవసాయంలో సరుకుల ఉత్పత్తి విధానం పెరుగుదల, గ్రామీణ ప్రాంతాలలో పెరుగుతున్న పెట్టుబడిదారీ సంబంధాలు, ఉత్పత్తి కేంద్రీకరణ, యంత్రాల వాడకం పెరుగుదల చిన్న, మధ్యతరగతి రైతులను తమ భూముల నుంచి వెళ్ళగొట్టి భూమిలేని కార్మికుల సంఖ్య పెంచుతాయి.

కాబట్టి భారతదేశంలోని పాలకవర్గమైన బడా బూర్జువా - భూస్వామ్యవర్గం అనుసరిస్తున్న విధానాలు గ్రామీణ శ్రామికవర్గ సైన్యాన్ని అధికం చేస్తున్నాయంటే ఆశ్చర్యపడవలసిన విషయమేమి కాదు. భారతదేశంలో "నూతన వ్యవసాయ అభివృద్ధి వ్యూహం" ప్రభావం గురించి అనేక పరిశీలనలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 1956-57, 1963-64 సంవత్సరాలకు సంబంధించి వ్యవసాయ కార్మికుల కుటుంబాలలో భూమిలేని కుటుంబాలు, భూమి ఉన్న కుటుంబాలు ఏ నిష్పత్తిలో ఉన్నాయో ఈ క్రింది పట్టిక నుండి తెలుసుకోవచ్చును. ఈ పట్టికలోని వివరాలు భూమిలేని గ్రామీణ శ్రామికవర్గం పెరుగుదల ధోరణిని సూచిస్తాయి.

1956-57-1963-64 లో మొత్తం వ్యవసాయ కార్మిక కుటుంబాలలో పంపిణీ శాతం వర్గీకరణ

రాష్ట్రం పేరు	భూమి లేని కుటుంబాల శాతం	
	1956-67	1963-64
ఆంధ్రప్రదేశ్	67.0	72.7
అస్సాం	70.3	59.7
బీహారు	38.8	52.7
గుజరాత్	72.9	86.3
జమ్ము-కాశ్మీర్	67.2	50.0
కేరళ	43.9	30.1
మధ్య ప్రదేశ్	61.0	50.0
మహారాష్ట్ర	72.9	71.4
మైసూర్	65.5	69.0
ఒరిస్సా	47.0	55.2
పంజాబ్	89.0	85.5
రాజస్థాన్	64.2	60.4
తమిళనాడు	65.5	71.0
ఉత్తరప్రదేశ్	45.7	48.5
పశ్చిమబెంగాల్	66.6	62.2
అఖిల భారత స్థాయి	**58.4**	**61.2**

మొత్తం వ్యవసాయ కుటుంబాలలో భూమిలేని వ్యవసాయకార్మికుల కుటుంబాల అఖిలభారత సగటు 1956-57 నాటికి 58.4% ఉండగా, అది 1963-64నాటికి 61.2%కి పెరిగింది. ఆంధ్రప్రదేశ్, బీహారు, గుజరాత్, మైసూరు, ఒరిస్సా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో భూమిలేని వ్యవసాయ కార్మికుల కుటుంబాల శాతంలో ఈ విధమైన పెరుగుదల ఉంది. మొత్తం వ్యవసాయ కార్మికుల కుటుంబాలలో భూమిలేని వ్యవసాయ కార్మిక కుటుంబాల శాతం అఖిలభారత సగటు (61.2%) కంటే హెచ్చుగా ఉన్న రాష్ట్రాలు ఇవి :ఆంధ్రప్రదేశ్ (72.7%), గుజరాత్ (86.3%), మహారాష్ట్ర (71.4%), మైసూరు (69.0%), పంజాబ్ (85.5%), తమిళనాడు (71.0%), పశ్చిమ బెంగాల్ (62.2%).

వ్యవసాయ కార్మిక కుటుంబాలలో తరగతులవారీగా చూస్తే కొద్దిపాటి భూమియున్న కుటుంబాల సంఖ్య 1956-57లో 42% ఉండగా, అది 1963-64 నాటికి 39%కి పడిపోయింది. వ్యవసాయ కార్మికుల ఎన్క్వయిరీ రిపోర్టుల ప్రకారం మొత్తం వ్యవసాయ కార్మికులలో భూమిలేని కార్మికులు 1950-51లో 50% ఉండగా, అది 1956-57 నాటికి 57%కి పెరిగింది. జాతీయనమూనా సర్వే ప్రకారం ఇది ఇంకా పెరిగి 1963-64 నాటికి 61%కి చేరుకున్నది.

"ఈ విధంగా అభివృద్ధి ప్రణాళికలు అమలుజరిగిన అన్ని సంవత్సరాల్లోను భూమిలేని వ్యవసాయ కార్మికుల శాతం పెరుగుతూనే ఉన్నది."

లెనిన్ చెప్పినట్లుగా "పెట్టుబడిదారీ విధానం ప్రత్యేకించి నెమ్మదిగా, పూర్తిగా విభిన్నమైన రూపాలలో వ్యవసాయంలోకి చొరబడుతుంది." దీని ఫలితంగా ఫ్యూడల్ దోపిడిలో వివిధ రూపాలలో ఉన్న పెట్టుబడిదారీ సంబంధాలు కలగలసి గ్రామీణ పేదలపై అంతులేని భారాన్ని మోపుతాయి.

మనదేశపు గ్రామీణ ప్రాంతాలలో దాదాపు అన్నిచోట్ల ఫ్యూడల్ సంబంధాలు ప్రబలంగా ఉన్నాయి. గ్రామాలలోని రైతాంగంపై మధ్య యుగాలనాటి భూస్వాముల పెత్తనాన్ని దాదాపు పూర్తిగా ఈ ఫ్యూడల్ సంబంధాలు పరిరక్షిస్తున్నాయి. గ్రామసీమల్లో ఉద్రిక్తతల పెరుగుదలకు దారితీస్తున్న ఫ్యూడల్ దోపిడీ పద్ధతులను విదితంచేసే కొన్ని ఉదాహరణలను ఇక్కడ ఇస్తాను. దేశంలో ఇంకా "కట్టు బానిసత్వం" లేదా "రుణ బానిసత్వం" అనే పద్ధతి అనేక ప్రాంతాలలో ప్రబలంగా కొనసాగుతూనే ఉంది. "ఎకనమిక్ టైమ్స్" పత్రికలో మైసూరు రాష్ట్రంలోని హరిజనుల పరిస్థితులను గురించి వ్రాసిన ఒక వ్యాసంలో ఈ రుణ బానిసత్వం పద్ధతి గురించి ఇలా ఉంది.

ఇక "జీత" పద్ధతి అనేది మరొకటుంది. ఇది చాల కఠోరమైన వెట్టిచాకిరీ పద్ధతి. అమెరికాకు ప్రారంభంలో వలస వెళ్లి స్థిరపడిన వారు అమలు చేసిన బానిసత్వానికి చాల దగ్గరగా ఉంటుంది. హసన్ జిల్లాలోని కొన్ని భాగాల్లోనూ, దక్షిణకెనరా, చిక్‌మగళూరు, షిమోగా జిల్లాల్లోను ఇది అమలులో ఉంది. ఈ పద్ధతిని గురించి విలయ పెరుమాళ్ కమిటీ ఇలా వివరించింది. ఈ జీత పద్ధతి ప్రకారం వ్యవసాయ కార్మికులకు బాగా అవసరమైన సమయంలో కొద్దిపాటి డబ్బు అప్పుగా ఇస్తారు. తన చాలీచాలని జీతం నుండి ఈ అప్పు మరలా తిరిగి చెల్లించలేని విధంగా కొన్ని షరతులతో ఆ వ్యవసాయ కార్మికుడు బంధించబడతాడు. ఎందుకంటే అతనికి భూస్వామి ఆహారం, బట్టలు, కొద్దిపాటి జీతం మాత్రమే ఇస్తాడు. అందువల్ల ఆ అప్పు తీర్చడం ఎంతమాత్రం వీలుగాకుండా ఉంటుంది. పైగా అది పెరుగుతూనే ఉంటుంది. ఈ అప్పు తిరిగి తీర్చడంలో ఆ వ్యవసాయకార్మికుని కుటుంబంలోని పిల్లలు కూడా ఇరికించబడతారు." (ఎకనమిక్ టైమ్స్- జూన్, 1970)

ఆ విధంగా ఈ భూస్వామ్య ప్రభువులు తమ "కూలీల" పై న్యాయాధికారం సైతం కలిగి వున్నారు. వివిధ రూపాల వెట్టిచాకిరీతో బాటు మధ్యయుగాలనాటి ఫ్యూడల్ పద్ధతులను దాదాపు అన్నింటినీ వారు పరిరక్షించారు. ఫ్యూడలిజం కొన్ని ప్రాంతాలలో ఇతర ప్రాంతాల కంటే మరింత ఎక్కువగా వర్ధిల్లుతున్న మాట వాస్తవమే. అయినప్పటికీ ఏ ప్రాంతాలలో కూడా ఫ్యూడలిజం పూర్తిగా నిర్మూలించబడలేదనేది వాస్తవం.

ఉదాహరణకు దేశమంతటా పాలేరు (attached labourer) పద్ధతి ప్రబలంగా ఉంది. ఫ్రాంకైన్ ఫ్రాంకెల్ బర్ద్వాన్ జిల్లా గురించి వ్రాస్తూ ఇలా తెలియజేశాడు. "భూమి యజమానులకు, వ్యవసాయ కూలీలకు మధ్య శాశ్వత సంబంధాలు ఇప్పటికీ అమలులో ఉన్నాయి. ప్రత్యేకించి జిల్లాలో పెద్ద కమతాలు ఉన్న ప్రాంతాలలో ఇది సర్వసామాన్యం. సాంద్ర వ్యవసాయ పద్ధతులు అమలులోకి రావడంతో, పనులు బాగా ముమ్మరంగా ఉన్న సమయాలలో హామీగా వచ్చే కూలీలు అవసరం హెచ్చుగా ఉంటుంది. ఈ అవసరమే వాస్తవానికి భూమి యజమానులకీ, వ్యవసాయ కార్మికులకూ మధ్య

శాశ్వత సంబంధాల పద్ధతిని బలీయం చేసింది." (మెయిన్ స్ట్రీమ్ 13 డిసెంబరు, 1969)

ఈ పద్ధతి స్థానిక సాంప్రదాయాలపైన, ఆచారాలపైన ఆధారపడి ఉంది. "వీరు (వ్యవసాయ కూలీలు) సాంప్రదాయకమైన ఏర్పాటు ప్రకారం నియమించబడతారు. ఈ ఏర్పాటు వల్ల వ్యవసాయ కూలీ కుటుంబాలు సాధారణంగా ఒక తరం తర్వాత మరొకతరం యజమాని కుటుంబం వారికి శాశ్వతంగా ముడిపడి ఉంటారు. అటువంటివారిలో కొందరు తమకు నగదు రూపంలో సంవత్సరానికి రూ. 110ల నుంచి రూ. 150ల వరకు ఏటా 6 నుంచి 7 మణుగుల ధాన్యం వరకు చెల్లించబడుతుందని చెప్పారు. ఇవికాక మామూలుగా వారికి రోజుకు రెండు లేక మూడు పూటల భోజనం, సంవత్సరంలో మూడు లేక నాలుగు పంచలు, ఒక గొంగడి, నూనె, బీడీలు, ఇల్లు కప్పుకునేందుకు వరిగడ్డి దొరుకుతాయి." **(పై పత్రిక-పేజీ 22)**

ఈ విధంగా పాలేర్లని చెప్పేవారిలో రుణబానిసత్వం, కుల కట్టుబాట్లు, భూమి కేటాయింపులో భూస్వామికి బంధించబడి ఉండటం లక్షణాలుగా ఉంటాయి. పెట్టుబడిదారీ విధానం పూర్వపు లక్షణాల ప్రాబల్యాన్ని ఈ కూలీ పద్ధతులు సూచిస్తున్నాయి. ఆచరణలో తిరిగి చెల్లించడానికి అసాధ్యమయ్యే పద్ధతులలో ఉండే అప్పుల వల్ల వీరు శాశ్వతంగా భూస్వాములకు బంధీలుగా ఉండాల్సి వస్తోంది.

అంతేగాక అనేక సందర్భాలలో పాలేర్లను నియమించుకొనే భూస్వాములు ఆ కూలీలకు ఇళ్ల స్థలాలను, కొన్ని సందర్భాలలో పంటలో భాగం (పాలు) ఇచ్చే ప్రాతిపదికపై భూములు కూడా ఇస్తారు. దక్షిణ భారతదేశంలో పడియాల, పన్నెయాల, పులయాలు, పాలేర్లు, జీతగాళ్ళు అని పిలువబడే వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిలో అత్యధిక భాగం ఒక తరంనుండి మరొకతరం వరకూ కాకపోయినా, కనీసం సంవత్సరం తర్వాత సంవత్సరం ఒకే భూస్వామి కుటుంబాలకు పనిచేస్తూ ఉంటారు.

ఇలాంటి మధ్య యుగాలనాటి కట్టుబానిసల పద్ధతి ఇంకా పెరుగుతోందని రెండవ వ్యవసాయ కార్మిక విచారణ నివేదిక వెల్లడి చేసింది. మొత్తం వ్యవసాయకూలీలలో ఈ విధమైన కట్టుబానిసల భాగం 1950-51లో 9.7% వుండగా, 1956-57 నాటికి 26.63%కి పెరిగింది. భారత దేశంలోని వ్యవసాయ కూలీలలో గణనీయమైన భాగం పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావానికి ముందున్న ఫ్యూడల్ దోపిడీ పద్ధతులకు గురవు తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. మన దేశపు విస్తారమైన గ్రామీణ ప్రాంతాలలో వస్తురూపంలో వేతనాలు చెల్లించే అర్ధఫ్యూడల్ పద్ధతి ఇంకా ప్రబలంగానే ఉంది. ఈ కాలంలో వ్యవసాయ కూలీల ఉపాధిపరిస్థితి, అలాగే కూలీ పని షరతులు, నిబంధనలు గమనించదగినంత హీనంగా తయారయ్యాయని రెండవ వ్యవసాయ కార్మిక విచారణలో వెల్లడయ్యింది.

తక్కువ జీతాలు, అమానుషమైన జీవిత పరిస్థితే గాక వ్యవసాయ కార్మికులు నిరుద్యోగానికి, తక్కువ పనిపాటల (Under employment)కు బలవుతున్నారు. 1965లో వ్యవసాయకార్మికుల విషయమై జరిగిన అఖిల భారత సెమినార్‌కు కేంద్ర గణాంకసంస్థ సమర్పించిన ఒక నోటులో కూడా వ్యవసాయ కార్మికులకు ఏడాదిలో 200 రోజులు మాత్రమే పనులు దొరుకుతున్నాయని తెలియజేసింది.

వ్యవసాయ కార్మికులు గ్రామాలలో ఒక అంతర్భాగంగా పరిగణించబడటంలేదు. గ్రామాలకు వెలుపల వారు విడిగా మురికి వాడలలో మంచినీటి బావులు, రోడ్లు, సందులు మొదలగు కనీస సౌకర్యాలు కూడా లేకుండా దుర్భరమైన జీవితాన్ని గడపవలసి వస్తోంది. వారిలో అధికభాగం నిరక్షరాస్యులే.

"పురాతన అర్ధబానిస విధానం" కంటే ఈ వ్యవస్థ ఏ మాత్రం మెరుగుకాదని "ఎకనమిక్ టైమ్స్" సైతం తన 1 జూన్,1970 తేదీ సంచికలో వర్ణించింది. రంజిత్‌దాస్‌గుప్తా వ్రాసినట్లుగా "పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావానికి ముందున్న దోపిడీ రూపాలు - పెట్టుబడిదారీ దోపిడీ పద్ధతులు పెనవేసుకుపోయి గ్రామీణ భారతదేశంలోని అట్టడుగువర్గాల దారిద్ర్యాన్ని స్వయంగానూ, సాపేక్షికంగానూ, అధికతరం చేసింది.

ఈ ఆర్థికదోపిడీలతో పాటు వ్యవసాయ కార్మికులు మనదేశంలో అనాదిగా ఉన్న కులవ్యవస్థ వల్ల కూడా సామాజిక పీడనకు గురవుతున్నారు. మనదేశపు వ్యవసాయ కార్మికులలో అత్యధికభాగం అంటరానికులాలకు లేదా వెనుకబడిన కులాలకు చెందిన వారే. ఈ కులాలపై అమలు చేయబడుతున్న సాంఘిక బహిష్కరణ (వెలి) పద్ధతులు అమెరికాలోని నీగ్రోలపై తెల్లజాతి వారి వైఖరికంటే దారుణంగా ఉన్నాయి. బావులు, చెరువులు ఉపయోగించటం, దేవాలయాలలో ప్రవేశం, ఇతర పబ్లిక్ స్థలాల వినియోగం వీరికి నిషిద్ధం.

ప్రధానంగా అర్ధఫ్యూడల్, అర్ధవలస స్వభావం కలిగిన భారత ఆర్థికవ్యవస్థలో బ్రిటిష్‌వారి కాలంలో ఎలాంటి మౌలికమైన మార్పు సంభవించకపోవడమే దీనికి కారణం.

బ్రిటీష్ వారి నుండి భారత దళారీ బూర్జువా వర్గానికి అధికారమార్పిడి జరిగిన తరువాత కూడా దేశంలోని సామాజిక, ఆర్థికపరిపాలనా రంగాలలో ఎలాంటి మౌలికమైన మార్పులు సాధించబడలేదు అందువల్లనే ఈనాటికీ భారత ఆర్థికవ్యవస్థ ప్రధానంగా అర్ధఫ్యూడల్, అర్ధ వలస స్వభావాన్ని కలిగిఉంది. కొన్ని అంశాలలో రూపంలో కొంత మార్పు ఉన్నప్పటికీ, కుల పద్ధతిలో మౌలికంగా మార్పు సంభవించలేదు.

పంచాయతీరాజ్ వ్యవస్థ, సస్య విప్లవం అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాలలో సరుకుల ఉత్పత్తి విధానం అభివృద్ధి, ఇవన్నీ బడా భూస్వాముల, బడా పెట్టుబడిదారీ వర్గాల ప్రాబల్యం పెరగటానికే తోడ్పడ్డాయి. కులవ్యవస్థపై ఆధారపడిన సనాతన పునరుద్ధరణవాద, ఛాందసవాద సామాజిక సిద్ధాంతాల అండదండలతో ఈ వర్గాలు తమ పెత్తనాన్ని మరింతగా బలీయం చేసుకొన్నాయి. **('ఇండియా మార్ట్‌గేజ్డ్' పేజి 406-452)**

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 1970 వరకు సంబంధించి పైన ఇచ్చిన వివరణలు, సమాచారము, విశ్లేషణల, అధికార మార్పిడి అనంతరం కూడా బ్రిటిష్ వాళ్ళు వదలిపోయిన స్థితిలోనే భారతదేశ వ్యవసాయ వ్యవస్థ అర్ధ భూస్వామ్య లక్షణాలతోనే వుండిపోయిందని నిరూపించాయి. తరువాత 50 ఏళ్ళలో భారత ప్రభుత్వం చేపట్టిన వివిధ విధానాలు చర్యలు ఫలితంగా ఈ విషయమై ఏమైనా నిర్దిష్టమైన అభివృద్ధి జరిగిందా? మన అర్ధ భూస్వామ్య వ్యవసాయ వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థగా పరివర్తన గావించబడిందా?

విషయాన్ని స్పష్టపరచడానికి, ముఖ్యంగా మన వ్యవసాయిక సమాజ లక్షణాలలో మార్పులేమీ జరగలేదని నిరూపించడానికి 1970 తరువాతి కాలంలో భూస్వామ్య వర్గం చేతుల్లో అక్కడక్కడా కేంద్రీకరించబడిన భూమి ప్రాతిపదికగానూ, గూగుల్‌లోని సమాచారము, ఈ విషయమై ఇప్పటికే ప్రచురితమైన వివిధ అధికారిక గణాంకాలు, ఇటీవలి ప్రస్తుత భారతీయ వ్యవసాయ వ్యవస్థ అర్ధ భూస్వామ్య స్వభావం నేటికీ నిలిచి వుందా, లేక పెట్టుబడిదారీ వ్యవసాయక వ్యవస్థగా మారిందా అన్నది నిర్ధారించడానికి వ్యవసాయ వ్యవస్థ విమర్శనాత్మకంగా సమీక్షింపబడుతుంది.

1915-18 వ్యవసాయ గణన నివేదిక:

వ్యవసాయ గణన నివేదిక ప్రకారం చిన్న, సన్నకారు రైతుల చేతుల్లో వున్న వ్యవసాయ యోగ్యమైన భూమి, నివాస గృహాలు, కుటీర పరిశ్రమలు అంతా కలిపితే 47.3%గా మాత్రమే వుంది.

అయితే, వ్యవసాయం కింద వున్న మొత్తం భూమి 2010-11లో 159.70 మిలియన్ల హెక్టార్లు (1 హెక్టార్ = 2.471 ఎకరాలు) వుండగా 2015-16 నాటికి 156.14 మిలియన్లకు తగ్గింది.

చిన్న, సన్నకారు రైతుల చేతిలో వున్న వ్యవసాయక భూమి 47.3% మాత్రమే.

శ్రీ సాయంతన్ బేరా అక్టోబర్ 2018లో సమర్పించిన తాజా సమాచారం ప్రకారం 2010-11 నుండి 2015-16 మధ్య కాలంలో వ్యవసాయ క్షేత్రాలు మరిన్ని ముక్కలయినాయి. కౌలు భూమి పంపిణీలో కూడా చాలా అసమానతలున్నాయి.

న్యూఢిల్లీ నుండి ప్రచురితమైన 1915-18 వ్యవసాయ గణన (పదవ గణన) ప్రకారం 2 హెక్టార్ల కంటే తక్కువ భూమి వున్న చిన్న, సన్నకారు రైతులు మొత్తం రైతులలో 86.2% వుండగా, వారి చేతుల్లో వున్న సాగుయోగ్యమైన భూమి 47.3% మాత్రమే.

దీనితో పోలిస్తే 2-10 హెక్టార్ల భూమి గల పేద, మధ్యతరగతి రైతులు మొత్తం రైతుల్లో 13.2% వుండగా, వారి చేతుల్లో 43.6% సాగుభూమి వున్నదని సర్వే నివేదిక తెలిపింది. మొత్తంగా ఆ నివేదిక కనుగొన్నదేమిటంటే 2010-11 నుండి 2015-16 మధ్య కాలంలో భారతదేశ వ్యవసాయ క్షేత్రాలు విచ్ఛిన్నం కావడంతో పాటే కౌల్దారీ భూముల పంపిణీ కూడా అదే బాటలో సాగింది. ఆ దశలో చిన్న, సన్నకారు రైతుల శాతం 74.9 నుండి 82కి పెరిగింది. అదే కాలంలో తనఖా అయినా చలన స్థిరాస్థి మొత్తం 138 మిలియన్ల నుండి 148 మిలియన్లకు పెరిగింది.

2010-11లో మొత్తం సాగుభూమి 159.8 మిలియన్ హెక్టార్లు వుండగా 2015-16 నాటికి 158.14 మిలియన్ హెక్టార్లకు తగ్గిపోయింది. అయితే సర్వే ప్రకారం చిన్న, సన్నకారు రైతుల సంఖ్య మొత్తం 127 మిలియన్లగా వుంది. ఈ ఎరుకను ఒక సవాలుగా తీసుకొని ప్రభుత్వం వారికి సాంప్రదాక వ్యవసాయాభివృద్ధి ప్రణాళికల ద్వారా కొత్త వ్యవసాయక సాంకేతికతను, సాగు సహాయక పథకాలను చేరవేయవలసిన అవసరం వుంది. ఈ 127 మిలియన్ల రైతులు 74.4 హెక్టార్ల భూమిని, అంటే తలసరి 0.6 హెక్టార్లు మాత్రమే కలిగి వున్నారు. ఆ చిన్న పోషణ చేసుకోవడం కూడా కష్టతరమైనది. 2010-11 నుండి 2015-16 మధ్య కాలంలో పెరుగుతూ వచ్చిన భారత వ్యవసాయక సంక్షోభాన్ని వివరిస్తూ, చిన్న, సన్నకారు రైతుల సంఖ్య ఆ దశలో 9 మిలియన్లకు పెరిగిందని ఆ సర్వే తెలియజేసింది.

అన్ని రకాల రైతులను పరిగణించి పరిశీలిస్తే రైతుల తలసరి భూమి 2010-11 నుండి 2015-16 కాలంలో 1.15 హెక్టార్ల నుండి 1.08కి తగ్గిపోయింది.

న్యూఢిల్లీలో వున్న ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ అను పరిశోధనా సంస్థలో వ్యవసాయ శాఖకు చెందిన ప్రొఫెసర్ అశోక్ గులాటి ఈ క్రింది వ్యాఖ్యానం చేశాడు : ఉన్నతరకం పంట రకాలను సాగుచేయడం, సాగు మొదలుకొని పంట ఉత్పత్తిని అమ్ముకొనే వరకు గల గొలుసు అంతటిలోను అత్యధిక పెట్టుబడి పెట్టడం జరిగినట్లయితే చిన్న తరహా వ్యవసాయం ఆర్థికంగా, స్థిరంగా మనగలుగుతుంది.

సర్వేలో రాష్ట్రాల ప్రాతిపదికన పొందు పరచబడిన ప్రభుత్వ గణాంకాల ప్రకారం పనిచేసే రైతు కుటుంబాలు ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 23.8 మిలియన్ల కుటుంబాలు ఆ తర్వాత బీహార్‌లో 18.4 మిలియన్లు, మహారాష్ట్రలో 14.7 మిలియన్లు వున్నారు.

సాగు చేయబడిన భూమి విస్తీర్ణంలో రాజస్థాన్ 20.9 మిలియన్ల హెక్టార్లతో ప్రథమ స్థానంలో వుంది. 18.45 హెక్టార్లతో ఉత్తరప్రదేశ్ 2వ స్థానంలో వుంది. సర్వే ప్రకారం మహిళలచే నిర్వహించబడే వ్యవసాయం నిష్పత్తి 2010-11లో 12.8% వుండగా 2015-16 నాటికి 13.9%కి చేరుకోవడం వ్యవసాయ నిర్వహణలో మహిళల పాత్ర పెరగడాన్ని సూచిస్తుంది.

ఇటీవలి అన్ని సర్వే నివేదికలలోని వివిధ గణాంకాలు, సమాచారము ద్వారా, మన వ్యవసాయం గతంలో మాదిరే చెల్లాచెదురుగా, ప్రణాళిక రహిత రీతిలో సాగుతూ, తగినంత ఉత్పత్తిని సాధించలేక, తనకి తాను వృద్ధి చెందుతున్న రంగముగా నిలబడలేక పోతున్నదని మనం గమనించవచ్చు.

మన వ్యవసాయ రంగం అంతటి వెనుకబాటు స్థితిలో వుండగా మన కామ్రేడ్స్ కొందరు భారతదేశ వ్యవసాయక వ్యవస్థ పెట్టుబడిదారీ లక్షణాలను సంతరించుకున్నదని ప్రకటించడం చాలా ఆందోళన కలిగించే అంశం. అటువంటి ప్రకటనలను తిప్పికొట్టడానికి ఈనాటి సమాచారం ఆధారంగా మన వ్యవసాయ వ్యవస్థను గురించి వివరమైన విశ్లేషణాత్మక సమీక్ష చేయడానికి ఈ కింది వివరాలు తోడ్పడతాయి.

(ఇంకా వుంది) ★

(23వ పేజీ నుండి)

బిజెపియేతర పార్టీల ఏలుబడిలోనున్న పశ్చిమబెంగాల్, కేరళ, ఛత్తీస్‌ఘర్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాలలో కూడా రాజ్య నిర్బంధ కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఒడిషాలోని ధింకియాలో జిందాల్ యాజమాన్యంలోని పోస్కో వ్యతిరేక ఆందోళనకారులను క్రూరంగా నిర్బంధించటాన్ని ఖండిస్తూ నినదించిన గొంతులను అణచివేశారు. దీనికి తోడు 'ఉపా', రాజద్రోహం వంటి కేంద్ర చట్టాలతోపాటు బీహార్ వంటి రాష్ట్రాలు ఎలాంటి వారంట్ లేకుండానే ప్రజలను అరెస్టు చేయటానికి అవకాశం కల్పించే బీహార్ పోలీస్ యాక్ట్ వంటి చట్టాలను అమలుచేస్తున్నాయి.

ఢిల్లీ సరిహద్దులలో సాగిన రైతాంగ ఆందోళనోద్యమ సందర్భంగా కూడా, హర్యానా రాష్ట్రానికి చెందిన 47,000 మంది రైతులపై మోపిన కేసులు అలానే వున్నాయి. లఖింపూర్ ఖేరిలో పోరాటం చేస్తున్న రైతులను క్రూరంగా రోడ్డుపై హత్యగావించిన సంఘటనలోనూ, కేంద్రమంత్రి తనయుడు అజయ్ మిశ్రాకు బెయిల్ మంజూరు చేశారు. అలాగే మంత్రిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. రోడ్లపై రైతుల మీదకు కారును నడిపి అనాగరిక దాడి, హత్యకు పాల్పడటానికి మద్దతుగా నిలవటం, రాజ్య ఫాశిస్టు, రైతాంగ వ్యతిరేక, నిరసనకారుల వ్యతిరేక స్వభావాన్ని తెలుపుతోంది. ఈ నేపథ్యంలో మనమంతా ఒకచోటకొచ్చి ఐక్యంగా నినదిద్దాం. రాజ్యం ఎంత ఎక్కువమందిపై నిర్బంధం ప్రయోగిస్తుందో అంతకు మించిన సంఖ్యలో మనం వీధుల్లోకి వస్తామని తెలియచెపుదాం.

పీపుల్స్ ఎగనెస్ట్ స్టేట్ రిప్రెషన్ (పిఎఎస్ఆర్), ఏఐఎస్ఏ, ఏఐవైఎస్, బిగుల్‌మజ్దూర్ రాస్తా, సిఎఫ్ఐ, సిటిఎఫ్, కలెక్టివ్, దిశ, డిఐఎస్ఎస్‌సి, డీఎస్‌యు, హండ్రెడ్ ఫ్లవర్స్ గ్రూప్, కెవైఎస్, ఎన్‌సిహెచ్ఆర్ఓ, ఓపిడిఆర్, పిఎస్‌ఏ ★

రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి! నిరంకుశ చట్టాలన్నింటినీ రద్దుచేయాలి!!

రాజ్య నిర్బంధ వ్యతిరేక ప్రజానీకం (పిఏఎస్ఆర్) డిమాండ్

రాజ్య బలగాల క్రూరమైన దాడులు, అరెస్టులు, ఖైదు చేయటం, హత్యగావించటం వంటి చర్యల కారణంగా అసమ్మతిని తెలిపే ప్రజాస్వామిక హక్కు మూగబోయిన సమయంలో; పెరుగుతోన్న రాజ్య నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ, నిర్బంధంలోనున్న రాజకీయ ఖైదీలను, సామాజిక కార్యకర్తలను, విలేఖరులందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారీ సంఖ్యలో సమీకృతులై నిరసన, బహిరంగసభ నిర్వహించాలని పిలుపునిస్తున్నాము.

నానాటికీ రాజ్యహింస, నిర్బంధానికి గురవుతున్న ఇటీవలి జాబితాలో ప్రముఖ సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాడ్, రిటైర్డ్ డిజిపి బి. శ్రీకుమార్ వున్నారు. 2002 సం॥లో గుజరాత్ రాష్ట్రంలో మత మైనారిటీలపై భారీస్థాయిలో జరిగిన హింస, మారణకాండలలో ఎందరో బాధితుల పక్షాన నిలబడి వారికి న్యాయం కావాలని వీరు కోరారు. రూపేష్ కుమార్ సింగ్ అనే ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జర్నలిస్టును ప్రభుత్వ ప్రజావ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక విధానాలను ప్రశ్నించినందుకుగాను ఖైదు చేశారు. ఛత్తీస్‌ఘర్‌కు చెందిన మరో ప్రముఖ కార్యకర్త హిమాంశు కుమార్ గిరిజనులు, మహిళలు, పిల్లలతో సహా వృద్ధులను సైతం బూటకపు ఎదురుకాల్పులలో హత్యగావించటాన్ని ప్రశ్నించి, వారికి న్యాయం చేయాలని అడిగినందుకు భారత ప్రభుత్వ ఆగ్రహానికి గురై జైలులో నిర్బంధింప బడ్డాడు. హిమాంశు, తీస్తాల కేసులు రెండూ ముఖ్యంగా చాలా ఆందోళనకరమైనవి. ఎందుకంటే, ప్రజల ప్రజాస్వామిక హక్కులకు పరిరక్షకునిగా చెప్పబడే న్యాయవ్యవస్థ, రాజ్యం చేతిలో కేవలం ఒక పావుగా మారిపోయింది. కార్యవ్యవస్థ యొక్క నిరంకుశాధికారాలలో అసమ్మతి గళాలను అణచివేసే సమయంలో ప్రజలకు అంతిమ ధైర్యాన్ని ఇవ్వగలిగే ఈ వ్యవస్థ, రాజ్య యంత్రాంగంతో చేతిలో చేయి వేసుకొని నడుస్తోంది.

క్రూరంగా అసమ్మతిని అణచివేసి, జైళ్ళలో నిర్బంధించటమనే విధానాంతో రాజ్యం ప్రజలను భయభ్రాంతుల్ని చేస్తూ, ప్రజలు ఎంతో కాలంగా పోరాడి సాధించుకున్న ప్రజాస్వామిక హక్కులన్నింటినీ హరించివేస్తోందని, రాజకీయ ఖైదీల సంఖ్య నానాటికీ పెరుగుతూ వుండటమనే రక్తపంకిలమైన వాస్తవం తెలియజెప్తోంది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉ.పా.), జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ), ప్రజాభద్రతాచట్టం (పిఎస్ఏ), (జమ్ముకాశ్మీర్‌కు పరిమితమైంది), రాజద్రోహం (సెక్షన్ 124ఎ, ఐపిసి) వంటి 'ప్రత్యేక' చట్టాలను విచక్షణారహితంగా ఉపయోగించటం, వలస కాలంనాటి పాలనను తలపిస్తోంది. క్రిమినల్ ప్రొసీజర్‌కోడ్, 1973 ప్రకారం కనీసంగా నిందితునికి వున్న ప్రాథమిక హక్కులు, సహజ న్యాయసూత్రాలను కూడా మినహాయించటం, ఫాశిస్టు ఉక్కు పిడికిలిని సూచిస్తోంది. ఉదాహరణకు, ఆంతరంగిక భద్రతా చట్టం (ఎమ్ఏఎస్ఏ – మీసా) క్రింద సంబంధిత యాక్టివిస్టులను, వ్యక్తులను ముందస్తుగా నిర్బంధించటంతోపాటు ఎలాంటి వారంటు లేకుండానే వారి ఆస్తులను సోదా చేయటానికి, జప్తు చేయటానికి కావలసిన అపరిమిత అధికారాలను, అమలు సంస్థలకు కట్టబెట్టింది. నిర్బంధించటానికి వున్న ఆధారాలను ప్రభుత్వ విశ్వసనీయ వ్యవహారాలుగా నిర్వచించి, వాటిని వెల్లడి చేయటమనేది ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకమైనదిగా పరిగణిస్తున్నాయి. రాజ్య యంత్రాంగం విచక్షణగా రహితంగా ఉపయోగించిన, ఉపయోగిస్తూ వస్తున్న టెర్రరిస్టు వ్యతిరేక చట్టాలన్నీ ఒక వ్యక్తిని ఒక సమూహాన్ని లేదా ఒక చర్యను నేరపూరితమైనదిగా చిత్రించే అపరిమిత అధికారాలను కల్పించటం, ఆయుధాల కంటే తక్కువైనదేమీ కావు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలకు, ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత చర్యలకు వ్యతిరేకంగా ప్రజల నిరసనలను చట్టవ్యతిరేక మైనవిగా ఈ చట్టాలు మార్చివేసి, ఎలాంటి నేరారోపణలు చేయకుండానే జైలులో నిర్బంధించే కాలాన్ని 180 రోజుల వరకూ పెంపు చేశారు. పైగా, 2019 సం॥లో చేసిన సవరణ ప్రకారం నిర్దిష్ట వ్యక్తిని టెర్రరిస్టు అని ముద్రవేసి విచక్షణాధికారాన్ని ప్రభుత్వానికి విస్తరించారు. ఆవిధంగా, ఆచరణలో ఈ క్రూరమైన చట్టాలన్నీ కేవలం మానవ హక్కుల కార్యకర్తలను జాతీయ భద్రత, 'ప్రజల' శాంతిభద్రతల ముసుగులో వేధించటానికి ఉద్దేశించినవే.

దేశవ్యాపితంగా, రోజురోజుకీ రాజ్య నిర్బంధం పెరుగుతోంది. భీమా–కొరెగావ్ కేసులో పౌరహక్కుల కార్యకర్తలను అరెస్టు చేసి, క్రూరమైన ఉపా, రాజద్రోహం, తదితర నేరారోపణలతో జైళ్ళలో నిర్బంధించారు. స్టాన్‌స్వామి మరణం – జైలుగది 'ఉపా' ఖైదీలకు ఏవిధంగా నరకంగా మారుతున్నదో తెలుపుతోంది. వరవరరావు, సుధాభరద్వాజ్‌లకు చాలా కాలపు పోరాటం తర్వాత ఆరోగ్య కారణాలపై బెయిల్ మంజూరు అయింది. ఇతర ఖైదీల బెయిల్ పిటీషన్లు పదే, పదే నిరాకరించటం జరుగుతోంది.

సిఏఏ–ఎన్ఆర్‌సి వ్యతిరేక ఉద్యమంలో మత మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని పోలీసులు జరిపిన దాడులలో అనేకమంది ముస్లిములు ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో వారిలో చాలామంది 'ఉపా' చట్టం క్రింద నేరారోపణలను ఎదుర్కొన్నారు. షాహిన్‌బాగ్‌లోనూ, ఈశాన్య ఢిల్లీలోనూ ఒకే చర్యలు చేపట్టారు. హత్రాస్ కుట్రకేసుగా పేర్కొంటున్న దానిలో అనేకమంది జర్నలిస్టులు కనీస న్యాయం లభించక ఈనాటికీ జైలు గదుల్లో మగ్గుతున్నారు.

సిపిఐ(మావోయిస్టు)లతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో పన్‌ధీరన్‌కవు కేసులో 'ఉపా' నేరారోపణతో కేరళకు చెందిన అల్లన్, థాహ అనే విద్యార్థుల బెయిల్ నిరాకరించటం మరో తాజా పరిణామం. ఒడిషా రాష్ట్రం – పూరికి ఆనుకుని వున్న తీరప్రాంతాన్ని భూమాఫియాకు సజావుగా అప్పగించబూనుకున్న ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించి, నిలువరించిన రైతులకు నాయకత్వం వహిస్తున్న బాటకృష్ణ స్వైయిన్‌ను ఎన్ఎస్ఏ క్రింద సంవత్సర కాలంపైగా జైలులో నిర్బంధించి వుంచారు. పోలీసుల, భూమాఫియాల బెదిరింపుల నడుమ నిరంతరాయంగా రైతులు తమ జీవితాల్ని గడపాల్సి వస్తోంది.

'ఉపా'తో అవసరం లేకుండానే, ఛత్తీస్‌ఘర్‌లోను మరియు ఇతర కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకించి మహిళలు, పిల్లలతోసహా ఆదివాసీ ప్రజానీకం మధ్యన బూటకపు ఎదురుకాల్పులు సాగించటమనేది ప్రజల ప్రాణాలకు పెద్ద ముప్పుగా పరిణమించింది. **(తరువాయి 22వ పేజీలో)**

...ti (Communist Revolutionaries' Monthly) RNI No. 8315/63 VJ-077/2022-24
Date of publication : 1st & 2nd of Every Month Posting date : 5th or 6th of Every Month

'ఆదివాసులను తరిమివేసి, అడవులను సామ్రాజ్యవాదులకు కట్టబెడుతున్న పాలకుల విధానాలపై పోరాడుదాం'

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) పార్వతీపురం మన్యంజిల్లా సభలో కా॥ ఝాన్సీ ఉద్ఘాటన




పార్వతీపురం, సెప్టెంబర్ 27, 28 తేదీలు :

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) పార్వతీపురం మన్యంజిల్లా మహాసభలు సెప్టెంబర్ 27, 28 తేదీలలో పార్వతీపురంలో స్ఫూర్తిదాయకంగా జరిగాయి.

జిల్లా నలుమూలల నుండి వేలాదిగా వచ్చిన గిరిజనులు, రైతు కూలీలతో 27వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు స్థానిక మార్కెట్‌యార్డులో సభలు ప్రారంభమయ్యాయి.

సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డి. వర్మ అధ్యక్షతన తొలుత జరిగిన బహిరంగసభలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి శ్రీ పి. రఘువర్మ మాట్లాడుతూ పాలకులు ముందుకు తెస్తున్న చట్టాలు ఆదివాసీ, రైతాంగ ప్రజానీకానికి ఏవిధంగా నష్టదాయకంగా వున్నాయో వివరించారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కె. భానుమూర్తి మాట్లాడుతూ ప్రజావ్యతిరేక చట్టాలపై ఉద్యమిస్తున్న రైతుకూలీసంఘానికి, ప్రజానీకానికి అభినందనలు తెలిపారు. ప్రజారచయిత శ్రీ భూపాల్ మాట్లాడుతూ నూతన కళారూపాల ద్వారా ప్రజలకు మరింత చేరువై చైతన్యం కలిగించాలన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ అటవీ పరిరక్షణ నిబంధనావళి – 2022 బిల్లు, ఆదివాసులకున్న కనీసపాటి హక్కులను కూడా కాలరాచివేస్తోందన్నారు. ఆదివాసులను పారద్రోలి, అడవులను సామ్రాజ్యవాద కార్పొరేట్ కంపెనీలకప్పగించే దుర్మార్గ విధానాలపై ఐక్యంగా పోరాడాలన్నారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) ఉపాధ్యక్షులు కా॥ గణేష్‌పండా మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను మూసివేసి, కార్మిక-రైతాంగ ఉపాధి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నారని; వలసలను, నిరుద్యోగాన్ని పెంచుతున్న పాలకుల విధానాలపై పోరాడాలన్నారు.

ఇంకా ఈ సభలో రైతుకూలీసంఘం జిల్లా నాయకుడు కా॥ పి. శ్రీనునాయుడు ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. సభారంభంలో ప్రజాకళాకారులు ప్రదర్శించిన 'నెత్తుటిదీపాలు', 'కిందిరి', అమరవీరులపై బుర్రకథ తదితర కళారూపాలు, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

స్ఫూర్తిదాయకంగా సాగిన ప్రదర్శన

బహిరంగసభ అనంతరం మార్కెట్‌యార్డు నుండి పాతబస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా బెలగాం సెంటర్ వరకు ఆదివాసీ, రైతుకూలీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. డప్పు నృత్యాలు, కోలాటం, ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతో, ఎర్రజెండాల రెపరెపలతో ప్రదర్శన ఆసాంతం పోలీసుల ఆటంకాలను అధిమించి స్ఫూర్తిదాయకంగా సాగింది; పట్టణ ప్రజలను ఆకట్టుకుంది.

ప్రతినిధుల సభ

మర్నాడు, సెప్టెంబర్ 28న స్థానిక లయన్స్ కళ్యాణమండపంలో ప్రతినిధులసభ జరిగింది. జెండా ఆవిష్కరణ, అమరులకు సంతాపం తెలిపిన అనంతరం జరిగిన ప్రతినిధుల సభకు కామ్రేడ్ అసిరి, కె. వెంకటస్వామి, ప్రసాద్‌లు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. గత మహాసభల నుండి సంఘం ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమాల సమీక్షను కా॥ వర్మ ప్రవేశపెట్టగా, ప్రతినిధులు చర్చలో పాల్గొన్న అనంతరం దానిని ఆమోదించారు.

కొండమొదలు సర్పంచ్ వేట్ల విజయ, ఏజన్సీ గిరిజన సంఘం (పశ్చిమగోదావరి) నాయకులు కుంజం రామారావు, ఇంకా ఏఐఎఫ్‌టీయు(న్యూ), పిడిఎస్‌ఓ, స్త్రీ విముక్తి సంఘటన ప్రతినిధులు, ప్రజాకళాకారుల సమాఖ్య నాయకులు రౌతు వాసుదేవరావు ఈ సభలో పాల్గొని సందేశమిచ్చారు. అనంతరం 24 మంది సభ్యులతో కూడిన నూతన జిల్లాకమిటీనీ ప్రతినిధులు ఎన్నుకున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రాంత సమస్యలపై దృష్టి సారించి 19 తీర్మానాలను ప్రతినిధుల సభ ఆమోదించింది.

'అటవీ పరిరక్షణ నిబంధనావళి-2022'ను రద్దుచేయాలని, నాన్ షెడ్యూల్డు గిరిజన గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతంలో చేర్చాలని, అటవీ హక్కుల చట్టాన్ని అమలుచేయాలని, అటవీ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేయాలని, ఈ ప్రాంతంలో పలు గెడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలని, జంఝావతి రిజర్వాయర్‌ను తక్షణమే పూర్తిచేయాలని, ఏజన్సీ ప్రాంతాలకు విద్య, వైద్యం, మంచినీటి వసతి కల్పించాలని, 'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని, మూతబడిన వ్యవసాయాధారిత పరిశ్రమలైన షుగర్, జూట్ పరిశ్రమలను తెరిపించాలని, దళితులు – మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని రైతుకూలీసంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజానీకంపై బనాయించిన తప్పుడు కేసులను రద్దుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రతినిధుల సభ పలు డిమాండ్లను ఆమోదించింది. ✱

Printed, Published and Owned by S. Seshamma
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3
Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M258
పుస్తకం పేరు	జనశక్తి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	25
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	SK Sharmila
పేజీలు విడదీసినది	SK Sharmila
స్కాన్ చేసినది	APSAN
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good